ఏప్రిల్
2020

168

సంపుటి : 14 సంచిక : 12 వెల రు. 10/-

ఈ సంచికలో........

రాజ్యం - రాజ్యాంగయంత్రం - రాజ్యాంగం
సామాజిక, వర్గ పోరాటాలకు అంబేద్కర్ నాయకత్వం
ప్రజాస్వామ్య అనంతర రాజ్యం
తిరోగమనమే హిందుత్వ లక్ష్యం
సంపద, లింగ అసమానతలు
మహాజ్ఞాన సంపన్నుడు ఎంగెల్స్
పర్యావరణ పరిరక్షణతోనే ప్రగతి
భారతదేశ కార్మికవర్గం - జాతీయోద్యమం
పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రమవుతాయి
కమ్యూనిస్టులు సంస్కరణోద్యమనాయకులు

# కమ్యూనిస్టులు సంస్కరణోద్యమ నాయకులు

కమ్యూనిస్టు మార్గదర్శకులలో చాలామంది సామాజిక సంస్కరణయోద్యమ నాయకులు కూడా. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుండి ఆమోదించబడిన పత్రాలను గనక పరిశీలిస్తే, కులమతాల ఆధారంగా అమలవుతున్న వివక్ష, అణచివేతను కమ్యూనిస్టులు మొదటి నుండి వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టమవుతుంది. మహిళలకి సమానహక్కులు ఉండాలని కూడా కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది. ఇటువంటి ఆదర్శాలు వుండడం వలన ప్రజలలో నిత్యం ఇటువంటి సమస్యల పైనే కృషి చేస్తున్నందు వలన అనేకమంది యువకులు కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. అందువలన అణగారిన ప్రజలలో కమ్యూనిస్టుల బలం మరింతగా పెరిగింది.

కమ్యూనిస్టులు, కార్మికుల, వ్యవసాయ కూలీల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నప్పుడల్లా చైతన్యవంతంగానే దళితుల హక్కులను కూడా లేవనెత్తేవారు. ఉదాహరణకి 1928లో బొంబాయిలో సమ్మె జరుగుతున్న సందర్భంలో గుడ్డలు నేసే విభాగంలో దళితులని కూడా పనిచేయనివ్వాలనే డిమాండ్‌ను కమ్యూనిస్టులు లేవనెత్తారు. ఈ విభాగంలో దారాన్ని కండెకు చుడుతున్నప్పుడు కార్మికుల ఉమ్మితో తడప వలసి వచ్చేది. అందువలన దళితులను ఈ విభాగంలో అనుమతించేవారు కాదు. ఈ డిమాండ్ లేవనెత్తడం వలన అనేకమంది దళితులు పార్టీకి చేరువయ్యారు. ఆర్ బి మూర్ కూడా కమ్యూనిస్టులు చేసే ఇటువంటి కార్యక్రమాల వలనే ఆకర్షితులయ్యారు. మూర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌కి దగ్గరివాడు. మహద్ దళిత్ మహాసభ నిర్వహించడంలో కీలకమైన పాత్ర పోషించిన వ్యక్తి, చావదార్ సరస్సులో తాగేనీరు తీసుకునే హక్కు దళితులకుందని అంబేద్కర్ నాయకత్వంలో సత్యాగ్రహం జరిగినప్పుడు, ఆ పోరాటంలో పాల్గొన్న వ్యక్తి. నిజానికి అంబేద్కర్ ఉద్యమంలో ప్రముఖంగా ఉండి, మార్క్సిజం లెనినిజాన్ని చైతన్యవంతంగా అర్థం చేసుకుని దళిత ఉద్యమం నుండి



పార్టీలోకి వచ్చిన మొదటి వ్యక్తి మూర్. కార్మికవర్గ పోరాటాలలో కమ్యూనిస్టులు సామాజిక అంశాలను కూడా చైతన్యవంతంగా ముందుకు తెస్తారని తెలిసిన వ్యక్తి మూర్. హిందూ, ముస్లిం కార్మికులు తమ మతాలను, కులాలను పక్కన పెట్టి తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడడం చూసారు. ఇటువంటి పోరాటాలు దళితులను కమ్యూనిస్టుల వైపు ఆకర్షించాయి. మూర్ కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన తొలితరం కమ్యూనిస్టులలో ఒకరు. 1930లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. మూర్ కార్మికవర్గంలోని వివిధ తరగతులను నిర్మాణంలోకి సమీకరించటం–మునిసిపల్ కార్మికుల దగ్గరి నుండి ఉపాధ్యాయుల వరకు సంఘటితం చేయడం, సాంస్కృతిక దళాలను నిర్మించడంలో ఎంతో చొరవ తీసుకున్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అనేకమంది దళితులను కమ్యూనిస్టు పార్టీలోకి ఆకర్షించారు. ఆయన కొంకణి ప్రాంతంలో కూడా వ్యవసాయ కూలీలను, రైతులను సంఘటితం చేసారు. భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా సమీకరణలు చేసారు మోర్ తానే కాదు తన కుటుంబ సభ్యులందరూ పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేటట్టు చేసారు. 1943లో జరిగిన మొదటి అఖిల భారత కమ్యూనిస్టు మహాసభల సందర్భంగా అతని కుటుంబము 'ఎర్ర కుటుంబం' గా సత్కరించబడింది.

సామాజిక ఉద్యమాలలో చురుకుగా పనిచేసిన మరో యువ కమ్యూనిస్టు నాయకుడు బి టి రణదివే. తాను స్కూల్‌లో చదువుతున్న రోజుల నుండి (1910 చివరి నుండి) రణదివే విప్లవాత్మక ఆలోచనలతో ఉండేవారు. దళితుల, మహిళల హక్కుల కోసం పోరాడే వారు. దళిత విద్యార్థులకు చదువులు చెప్పే వారు. తల్లిదండ్రులు, బంధువులు తనకిచ్చిన డబ్బులతో వారికి పుస్తకాలు కొనిచ్చేవారు. ఇటువంటి పనులు చేస్తున్నందుకు అగ్రవర్ణంలో పుట్టిన పిల్లలు రణదివేపై రాళ్ళు విసిరేవారు. అయినా అవేవి ఆయనను ఆపలేదు. గాంధీ గారు, ఆతని వర్ణాశ్రమధర్మ సమర్ధన రణదివేని తీవ్రంగా అసంతృప్తికి గురిచేసింది. ఇది అతని కుల వ్యతిరేక ఆలోచనలకు, సంస్కరణలకు వ్యతిరేకంగా తోచాయి. అందువలన కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయాన్ని వెతుక్కుంటున్న సందర్భంలో ఆయన కమ్యూనిజం పట్ల, కార్మికవర్గ ఉద్యమాల పట్ల ఆకర్షితుడయ్యారు. మూర్‌తో కలిసి రణదివే, కార్మిక సంఘాలలో అమలవుతున్న కుల వివక్షను అంతం చేయాలని నిశ్చయించుకున్నారు. ఆఫీసులలో రెండు మట్టి గ్లాసుల విధానాన్ని, (ఒకటి దళితులకు మరొకటి ఉన్నత వర్గాల వారికి) ఆపివేశారు. ఒకే గ్లాసులో నీళ్లు తాగితే మైలపడతామనుకున్నవారు బయటికి వెళ్లి నీళ్లు తాగవచ్చని చెప్పారు. కమ్యూనిస్టులు నాయకత్వం వహించే కార్మిక సంఘాలు వర్ణ వివక్ష విషయంలో చాలా కఠినంగా ఉండాలని ఆచరించి చూపారు.

విద్యార్థి దశ నుండి జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొనే పి రామ్మూర్తికి భగత్‌సింగ్, అతని సహచరులు బెనారస్‌లో స్థాపించిన నౌజవాన్ భారత్‌సభతో పరిచయమయింది. వెంటనే కుల వివక్ష ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. దాని నిర్మూలనకు కృషి చేసారు. దళితుల ఆలయ ప్రవేశాన్ని అడ్డుకోవడానికి వ్యతిరేకంగా పని చేసారు. చెప్పులు కుట్టుకునే దళితులకు భజన పాటలు, కొన్ని సాధారణ

(మిగతా 32వ పేజీలో)

# కరోనా

మానవాళిని పట్టి పీడిస్తున్న కరోనా మహమ్మారి వేల సంఖ్యలో ప్రజల ప్రాణాలను హరిస్తూ మరోవైపు ప్రపంచీకరణ యుగపు వైరుధ్యాలను ప్రజల ముందు సాక్షాత్కరిస్తోంది. చైనాలోని వుహాన్ నగరంలో ప్రారంభమైన మహమ్మారి మూడు మాసాల్లో భూగోళం మొత్తం దాదాపు 200 దేశాలకు వ్యాపించించందంటే ప్రపంచీకరణ దేశాలనూ, ప్రజలనూ ఎంతగా అనుసంధానం చేసిందో అర్థమవుతుంది. జనవరి 23వ తేదీన వుహాన్ నగరంలో కరోనా వ్యాధి బారిన పడినవారి సంఖ్య 16. ఈ సంపాదకీయం రాసే నాటికి ఈ సంఖ్య 8 లక్షలకు చేరింది. 35,000 మంది వరకు మరణించారు. రోజూ లక్షల మంది వ్యాధిబారిన పడుతున్నారు. కాబట్టి ఇది ఎక్కడివరకు పోతుందో ఎవరూ ఊహించలేకపోతున్నారు.

వ్యాధికి ప్రారంభ స్థానమైన చైనా కొద్ది రోజుల్లోనే తేరుకుని యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకుని వ్యాధి విస్తరణను నిలువరించింది. అందుకే అక్కడ వ్యాధిగ్రస్తుల సంఖ్య 80,000 దగ్గర నెమ్మదించింది. మృతుల సంఖ్య కూడా 3,300 దగ్గర్లో దాదాపు ఆగిపోయింది. కానీ చైనాలో వ్యాధి ఉధృతంగా విస్తరిస్తున్నప్పుడు చూస్తూ ఉండిన ప్రపంచ అగ్రదేశాలు, ఇంకో మాటలో చెప్పాలంటే కమ్యూనిస్టు చైనా ఈ దెబ్బతో ఆర్థికంగా దివాళా తీస్తే తాము లాభపడొచ్చని ఆశించిన దేశాలు తమపై ఈ మహమ్మారి దాడి చేయకుండా ఏం చేయాలో ఆ పని చేయలేకపోయాయి. దాంతో పెద్దా చిన్నా అనే తేడా లేకుండా అన్ని దేశాలకు మహమ్మారి విస్తరించింది. అగ్రరాజ్యం అమెరికా వ్యాధిగ్రస్తుల విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానం ఆక్రమించగా అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాలన్నీ విలవిల లాడుతున్నాయి. 130 కోట్ల మంది ఉన్న భారత దేశంలో వ్యాధి మూడవ దశలోకి అంటే సామాజిక విస్తరణ దశలోకి వెళితే చాలా ప్రమాదం అని చెబుతున్నారు.

కరోనా వ్యాధి ప్రపంచీకరణ పేరుతో గత మూడు దశాబ్దాలుగా అమలు చేసిన నయా-ఉదారవాద విధానాల దుష్ఫలితాలను ప్రపంచం ముందు బట్టబయలు చేసింది. మొదటిది, తక్కువ ప్రభుత్వం (లెస్ గవర్నెన్స్) ఉండాలని చెప్పిన నయా-ఉదారవాద విధానాలను అమలు చేసిన దేశాల్లో ప్రజలమీద ఇటువంటి పెద్ద ఉత్పాతం వచ్చి పడినప్పుడు ప్రభుత్వాలు ఏమీ చేయలేక కళ్లు తేలేసిన పరిస్థితి కనిపించింది. కానీ ప్రజా ప్రభుత్వాలకు పెద్ద పీట వేసిన సోషలిస్టు దేశాల్లో ఈ పరిస్థితి లేదు. చైనా ప్రభుత్వం మొత్తం వనరులను, యంత్రాంగాన్ని కొద్ది రోజుల్లోనే కరోనా వ్యాప్తి నివారణకు తరలించి విజయం సాధించింది. సామ్రాజ్యవాదుల అష్ట దిగ్బంధంలో ఉన్న సోషలిస్టు క్యూబా తన దేశంలో వ్యాధి వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవడమే కాదు ఇతర దేశాలకు ఆపన్న హస్తం అందిస్తోంది. వియత్నాం, ఉత్తర కొరియా వ్యాధిని కట్టడి చేసాయి. కానీ ప్రయివేటు రంగం మీద ఆధారపడిన పశ్చిమ దేశాలు చేతులెత్తేశాయి.

కరోనా వ్యాప్తి సమయంలో తమ దేశ పౌరులను అన్ని రకాలుగా ఆదుకున్న చైనా త్వరలోనే ఉత్పత్తి ప్రారంభించింది. కానీ పశ్చిమ దేశాల కార్పొరేట్ సంస్థలు మాత్రం ఒకవైపు గరిష్ట లాభాలు కాపాడుకునేందుకు లక్షలాదిమంది కార్మికులను ఉద్యోగాలనుండి తొలగిస్తూ వీధులపాలు చేస్తున్నాయి. మరోవైపు తమకు జరిగిన 'నష్టాల'కు పరిహారాన్ని ప్రజా ధనం నుండి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. వీరి డిమాండ్‌కు తలొగ్గి ప్రభుత్వాలు ఉద్దీపన చర్యల పేరుతో కోట్లకు కోట్ల డబ్బు కేటాయిస్తున్నా ధన దాహం తీరడం లేదు, ఆర్థిక వ్యవస్థలకు ఊతం రావడం లేదు. ఇప్పటికే ఆర్థిక మాంద్యం ఎదుర్కొంటున్న ప్రపంచం మరింత సంక్షోభం లోకి కూరుకు పోతున్నది. ఈ సంక్షోభ భారాలు శ్రామిక ప్రజల మీద తీవ్రంగా పడుతున్న దృశ్యాలు మనం ప్రతి రోజూ మీడియాలో చూస్తున్నాం.

అందువల్ల ఇప్పుడు కరోనా బారినుండి మాత్రమే కాదు, నయా-ఉదారవాద ఆర్థిక సంక్షోభం నుండి కూడా శ్రామిక ప్రజలు తమను తాము రక్షించుకోవాల్సిన తరుణం వచ్చింది. నయా-ఉదారవాద విధానాలపై తిరుగుబాటు ద్వారా మాత్రమే వారు ఈ సంక్షోభం నుండి బయటపడతారు.

## ఈ సంచికలో...


1. కమ్యూనిస్టులు సంస్కరణోద్యమ నాయకులు......... 2
2. రాజ్యం - రాజ్యాంగయంత్రం - రాజ్యాంగం
వి. శ్రీనివాసరావు ................ 4
3. సామాజిక, వర్గ పోరాటాలకు అంబేద్కర్ నాయకత్వం
దడాల సుబ్బారావు.............. 6
4. ప్రజాస్వామ్య అనంతర రాజ్యం
ప్రొఫెసర్ ఐజాజ్ అహమ్మద్ ... 10
5. తిరోగమనమే హిందుత్వ లక్ష్యం
ఎ. కోటిరెడ్డి ..................... 16
6. సంపద, లింగ అసమానతలు
టి.కె. రాజ్యలక్ష్మి ................. 20
7. మహోజ్ఞాన సంపన్నుడు ఎంగెల్స్
తెలికపల్లి రవి .................... 25
8. పర్యావరణ పరిరక్షణతోనే ప్రగతి
అంకితానాయక్.................. 28
9. భారతదేశ కార్మికవర్గం - జాతీయోద్యమం
టి. చంద్రపాల్ ................... 30
10. పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రమవుతాయి
బి.వి. రాఘవులు.................. 31



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి. రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

**చందా వివరాలు**
విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా: **రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# రాజ్యం - రాజ్యాంగయంత్రం - రాజ్యాంగం

వి.శ్రీనివాసరావు



రచయిత సిపిఐ(యం) కేంద్ర కమిటి సభ్యులు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సారథ్యంలో నెహ్రూ, పటేల్, బాబు రాజేంద్రప్రసాద్ వంటి మహామహులతో కూడిన రాజ్యాంగ పరిషత్తుచే తయారు చేయబడి, 1950 జనవరి 26 నుంచి అమల్లోకొచ్చిన భారత రాజ్యాంగం 70 సంవత్సరాల అనంతరం సంక్షోభంలో పడింది. భారత రాజ్యాంగం కొంతమంది నాయకుల మేధస్సు నుంచి ఊడిపడిన పవిత్ర గ్రంథం కాదు. దశాబ్దాల పాటు సాగిన స్వాతంత్ర్యో ద్యమ పోరాటం నుంచి ఆవిర్భ వించిన గ్రంథం. బ్రిటీష్ వారి రాజరికాన్ని తిరస్కరించి, బ్రిటీష్ వలస పాలన కన్నా ఉన్నతమైన పార్లమెంటరీ వ్యవస్థకు ఇది నాంది పలికింది. మొత్తం రాజ్యాంగానికి పీఠిక పునాది. చట్టం ముందు అందరూ సమానమేనని చెబుతుంది. కుల, మత, భాష, ప్రాంతీయ, లింగ బేధాలకు అతీతంగా 'ఒక వ్యక్తి-ఒక విలువ' ఆధారంగా పార్లమెంటరీ వ్యవస్థ ఏర్పడింది. టాటా, బిర్లా అయినా, మారుమూల గ్రామ దళిత కూలీ అయినా వారికున్న ఓటు విలువ ఒక్కటే. డబ్బు, ఆస్తి, అంతస్తును బట్టి ఓటు విలువ మారదు. అయితే రానురాను ఈ పార్లమెంటరీ వ్యవస్థ కూడా ప్రమాదంలో పడింది. ఇరుగుపొరుగు దేశాలు కూడా నిరంతరంగా అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుతున్నా మన దేశంలో దాదాపుగా ఇప్పటివరకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కొనసాగుతున్నది. రాజకీయ స్వాతంత్ర్యానికి ప్రతీకగా ఉన్న ఓటు క్రమంగా అంగడి సరుకుగా మారింది. దేశంలో అసమానతలు పెరిగే కొద్దీ ఓటు కూడా అమ్మకపు సరుకుగా మారుతున్నది. ఏ ప్రజాసేవ చేయకపోయినా నేరచరిత్ర ఉన్న అవినీతి పరుడైనా డబ్బులుంటే రాజకీయాల్లోకి వచ్చేయొచ్చు. ముఖ్యంగా సరళీకరణ ఆర్థిక విధానాల్లో ఈ పరిణామాలు ఊపందుకున్నాయి. రాజ్యాంగ విలువలు బలహీనపడుతున్న దశలో కాంగ్రెస్ స్థానాన్ని బీజేపీ ఆక్రమించింది. స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి ఆ ఉద్యమంతో సంబంధం లేని పార్టీ పైగా మతవిభేదాలు సృష్టించి దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకున్న పార్టీ బిజెపి అధికారంలోకి వచ్చింది. వారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అప్పటికే బలహీనపడుతున్న రాజ్యాంగాన్ని మరింత ధ్వంసం చేయడం మొదలుపెట్టారు. ప్రజాస్వామ్యం స్థానంలో నిరంకుశత్వం, లౌకికవాదం స్థానంలో మతోన్మాదం, సామాజిక విలువల స్థానంలో కులదురహంకార పెత్తనాన్ని ప్రతిష్టాపించాలని చూస్తున్నారు. రాజ్యాంగాన్ని కాపాడే స్వతంత్ర సంస్థలైన సుప్రీంకోర్టు, కాగ్, ఎన్నికల కమిషన్ లాంటివాటిని హస్తగతం చేసుకుంటున్నారు. మొత్తం రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి హిందుత్వ సిద్ధాంతానికి మూలమైన మనువాదాన్ని ప్రతిష్టాపించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ దశలో ప్రజలముందున్నది రెండే కర్తవ్యాలు.. ఈ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మూడువేల ఏండ్ల వెనక్కి తీసుకుపోయి అనాగరిక వైదిక పాలనను (బిజెపి చెప్పే రామరాజ్యం ఇదే) పునరుద్ధరించటమా. లేకపోతే, పోరాడి సాధించుకున్న ఈ రాజ్యాంగాన్ని కాపాడు కుంటూ ఇంతకన్నా ప్రగతిశీలమైన నూతన సమాజం దిశగా దూసుకుపోవడమా? మొదటిది తిరోగమనం, రెండోది పురోగ మనం.

ఈ రాజ్యాంగాన్ని మార్చి సరికొత్త రాజ్యాంగాన్ని రూపొందించాలనుకునే కమ్యూనిస్టులు దీన్నెందుకు కాపాడాలనుకుంటున్నారు అనే ప్రశ్న కొంతమందికి వస్తున్నది. తిరోగమన శక్తులు ఆధిపత్యం వహిస్తున్నప్పుడు ఉన్నదాన్ని కాపాడుకోకుండా మనం ఉన్నత సమాజం దిశగా అడుగులు వేయలేం. అవతల ఒడ్డుకు చేరటానికి పతనావస్థలో ఉండే బ్రిడ్జియైనా అవసరమే. కొత్త బ్రిడ్జి కట్టుకోలేనప్పుడు పాత బ్రిడ్జిని కూల్చేసి ఎవరూ వెనక్కి పోవాలనుకోరు. కాని నేడు బిజెపి అదే చేస్తున్నది. వాజ్‌పేయి సారథ్యంలో మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రాజ్యాంగాన్ని మార్చడానికి ఒక కమిటీని నియమించింది. అన్ని మతాలను సమానంగా చూసే లౌకిక వ్యవస్థను కూలదోసి హిందూ రాజ్యంగా ప్రకటించాలనే వారి ప్రయత్నం నాడు విఫలమైనది. రెండోసారి మోడీ సారథ్యంలో అధికారం చేపట్టారు. మొదటి ఐదు సంవత్సరాలు రాజ్యసభలో మెజార్టీ లేనందువల్ల రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రజల మనసులో విషబీజాలు నాటుతూ వచ్చారు. 2019లో బిజెపి సొంతంగా మెజార్టీ సాధించుకున్న తర్వాత మెజార్టీ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వారి స్వాధీనంలోకి వచ్చాయి. రాజ్యసభలోనూ క్రమంగా బలపడుతూ వచ్చింది. రెండోసారి అధికారంలోకి వచ్చీరాగానే అభివృద్ధి నినాదాన్ని పక్కనపడేసి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి కార్పొరేట్ వర్గాలు అడిగినన్ని వరాలు ఇచ్చేయమని ఆర్థికమంత్రికి వదిలేశారు. ప్రధాని, హోంమంత్రి వీరిందరి చుట్టూ అధికార వికేంద్రీకరణ పెరిగింది.

రెండోసారి అధికారంలోకి వచ్చీ రాగానే ఒకదాని వెంట ఒకటి రాజ్యాంగ పునాదులను తొలిచేయడం ప్రారంభించారు. రాజ్యాంగ సంస్థలన్నింటినీ ఆర్ఎస్ఎస్ మనుషులతో నింపేశారు. అగ్రకుల ఆధిపత్యాన్ని సవాల్ చేసే సామాజిక ఉద్యమాన్ని అణిచివేయడం ప్రారంభించారు. కార్మికవర్గాన్ని దెబ్బతీసే ప్రయివేటీకరణ విధానాన్ని వేగవంతం చేశారు. టెర్రరిజం పేరుతో ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టారు. నల్లడబ్బును నిర్మూలించే పేరుతో కరెన్సీని రద్దు చేసి నలుపును తెలుపుగా మార్చారు. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మతం, ఒకే భాష, ఒకే ఎన్నికలు... ఇలా జీఎస్టీ, జమిలి ఎన్నికలు, హిందీ ఆధిపత్యం. దేశంపై రుద్దారు. ప్రాంతీయ భాషలను అణగదొక్కి సంస్కృతానికి పెద్దపీట వేశారు. గాంధీని హత్య చేసిన గాడ్సేకు గుడి కట్టించి దేశభక్తుడ్ని చేశారు.

స్వాతంత్ర్యో ద్యమాన్ని ఒక నాటకంగా అభివర్ణిం చారు. ఇలా ఒక్కొక్కటిగా రాజ్యాంగ పునాదు లన్నింటి మీద దాడి చేయడం మొదలుపెట్టారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారం, పీవోఏ యాక్ట్‌ని బలహీనపరచడం వారి మనువాద రాజ్యాంగానికి ప్రతీక.

గత ఎనిమిది నెలల్లో వారి మతోన్మాద ఎజెండాని దేశంపై రుద్దడమే కార్యక్రమంగా పెట్టుకున్నారు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ని రద్దు చేయడం, ముస్లిం పర్సనల్ లా ను నేరపూరిత చట్టంగా మార్చడం (క్రిమినల్ లా), అయోధ్య వివాదాన్ని తమకు అనుకూలంగా బలవంతంగా తీర్పు ఇప్పించుకోవడం వీటన్నింటికి పరాకాష్టగా పౌరసత్వ సవరణ బిల్లును తెచ్చి దేశం మీద రుద్దడం వారి ఘనకార్యాల్లో కొన్ని మాత్రమే. గత ఐదు మాసాలుగా దేశంలో మత ప్రాతిపదికన పౌరసత్వం గురించి తప్ప మరో చర్చ లేకుండా చేశారు. వారి సొంత ఎజెండాను ప్రజలపై బలవంతంగా రుద్దారు. ఒకవైపు విదేశీ కంపెనీలకు బ్రహ్మరథం పడుతూ ట్రంప్‌కు సలామ్ కొడుతూ, మరో వైపు దేశభక్తి, జాతి గురించి మాట్లాడటం వారికే చెల్లింది. భావోద్వేగాలతో ప్రజల కళ్ళకు గంతలు కట్టి, చెవులు మూసిపెట్టి నోటికి తాళాలు వేసి (మూడు కోతుల కథ మాదిరి) తమ మాటనే ప్రజల మాటగా చెలామణి చేసుకోవాలని చూస్తున్నారు. కాదన్నవారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారు. దేశం ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితికి ఇది అద్దం పడుతున్నది.

దేశం ఒక మూలమలుపులో ఉన్న సమయంలో రాజ్యం పట్ల స్పష్టమైన అవగాహన లేని కొందరు గందరగోళానికి గురవుతున్నారు. రాజ్యం అంటే ఏమిటి? రాజ్యానికి, రాజ్యాంగానికి తేడా ఏమిటి? రాజ్యాంగానికి ప్రభుత్వానికి ఉన్న సంబంధం ఏమిటి? వగైరా ప్రశ్నలు ఈ సందర్భంగా తలెత్తుతున్నాయి. రాజ్యం అంటే.. దోపిడీకి గురవుతున్న ప్రజలను అణచిపెట్టి ఉంచే సంఘటిత రాజకీయశక్తి అని మార్క్స్, లెనిన్ చెప్పారు. రాజ్యం ఒక వర్గం మరొక వర్గాన్ని అణచివేసే సాధనం. ఇది బూర్జువా, భూస్వామ్య వ్యవస్థ. దానికి నాయకత్వం వహించేది బడా బూర్జువా వర్గం. నేడు వారి చేతుల్లోనే రాజ్యం ఉంది. అందువల్ల దీన్ని బూర్జువా నియంతృత్వం అని మార్క్స్ కమ్యూనిస్ట్ ప్రణాళికలో చెప్పారు. ఈ రాజ్యంలో వివిధ విభాగాలుంటాయి. పార్లమెంట్, ప్రభుత్వం, కోర్టులు, పోలీస్, మిలిటరీ, అధికార యంత్రాంగం. ఈ వ్యవస్థలన్నీ రాజ్యంలో అంతర్భాగం. దాన్నే రాజ్యాంగ యంత్రం

**"రాజ్యం అంటే.. దోపిడీకి గురవుతున్న ప్రజలను అణచిపెట్టి ఉంచే సంఘటిత రాజకీయశక్తి అని మార్క్స్, లెనిన్ చెప్పారు. రాజ్యం ఒక వర్గం మరొక వర్గాన్ని అణచివేసే సాధనం. ఇది బూర్జువా, భూస్వామ్య వ్యవస్థ. దానికి నాయకత్వం వహించేది బడా బూర్జువా వర్గం. నేడు వారి చేతుల్లోనే రాజ్యం ఉంది. అందువల్ల దీన్ని బూర్జువా నియంతృత్వం అని మార్క్స్ కమ్యూనిస్ట్ ప్రణాళికలో చెప్పారు."**

అంటారు. రాజ్యాంగ యంత్రంపై అధిపత్యం ఉన్న వర్గాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలన్నింటినీ బూర్జువాపార్టీలంటారు. ఇందులో ప్రధానమైనవి బిజెపి, కాంగ్రెస్. ప్రాంతీయ పార్టీలు కూడా ఈ వర్గాలకు ప్రాతినిధ్యం వహించేవే. అయితే వారి భౌగోళిక శక్తి పరిమితం. కొన్ని మధ్యతరగతి పెటి బూర్జువాపార్టీలున్నాయి. సామాజిక తరగతు లకు ప్రాతినిధ్యం వహించే పార్టీలున్నాయి. ఇలాంటి పార్టీలు చిన్నవే అయినా ఈ వ్యవస్థను కాపాడుతూనే తాము ప్రాతినిధ్యం వహించే తరగతులకు కొన్ని హక్కుల కోసం పోరాడు తుంటాయి. వాటినే ఇన్‌క్లూజివ్ పాలిటిక్స్, ఎంపవర్‌మెంట్ పాలిటిక్స్ అని అంటూ ఉంటారు. ఈ పార్టీలు తీవ్రమైన మార్పును కోరుతున్నట్టు అనిపించినా పెట్టుబడిదారీ విధానం అనే లక్ష్మణరేఖను దాటి బయటికి రావు. కింది తరగతుల్లో పై వర్గాలకు ప్రతినిధులుగా ఉంటారు.

ఇలాంటి పార్టీలకు భిన్నమైనవి కమ్యూనిస్టు పార్టీలు. ఇవి కార్మికవర్గానికి ఇతర కార్మిక, పీడిత ప్రజానికానికి సామాజికంగా అణిచివేతకు గురవుతున్న ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ లక్ష్యం ప్రకారం సమాజాన్ని మార్చాలంటే వర్గశక్తుల బలాబలాల్లో మార్పు రావాలి. దోపిడీకి, అంటరానితనానికి గురవు తున్న సామాజిక తరగతులను కలుపుకొని కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా ఒక బృహత్తర కూటమిని (జనతా ప్రజాస్వామ్య సంఘటన) నిర్మిస్తే తప్ప కమ్యూనిస్టులు విజయం సాధించలేరు. మార్కెట్‌లో బ్రాండ్లు మార్చినట్టు ప్రజల మానసిక స్థితిని బట్టి ఒక పార్టీ స్థానంలో మరో పార్టీకి, ఒక నాయకుని స్థానంలో మరో నాయకుడ్ని ముందు పెట్టి తమ వ్యవస్థను పెట్టుబడిదారులు కాపాడుకుంటారు. మొదట ఒక రాష్ట్రంలో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తేనే సహించలేని ఈ వర్గాలు (1957లో కేరళలో ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చేశారు.) ఆ తర్వాత ఆయా వర్గాలు చీలికలొచ్చి బలహీన పడటంతో కేరళ, త్రిపుర, బెంగాల్ రాష్ట్రాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కొనసాగడానికి అనుమతించారు. కాని వామపక్షాలు, ముఖ్యంగా సిపిఐ(ఎం) అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందాన్ని వ్యతిరేకించటంతో సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రయోజనాలకు భంగం కలుగుతున్నప్పుడు ఈ ప్రభుత్వాలను నాశనం చేయడానికి కూడా వెనుకాడటం లేదు. కాంగ్రెస్ పోయి బిజెపి వచ్చినా, రాజ్యం మౌలిక స్వభావంలో మార్పు రాలేదు. కాని తక్షణం ఆ రాజ్యాన్ని నడిపే రాజ్యాంగానికి ప్రమాదం వచ్చింది. ఇది పెట్టుబడిదారులకే కాదు, కార్మికవర్గానికి కూడా నష్టం కలిగిస్తున్నది. అందువల్లనే కార్మికవర్గం ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ముందుకు వస్తోంది. కాని దాని అర్థం ఈ రాజ్యాంగాన్ని శాశ్వతంగా కాపాడుతారని కాదు. వర్గశక్తుల బలబలాల్లో మార్పు తెచ్చేంతవరకు ఎన్ని పరిమితులున్నా ఈ రాజ్యాంగాన్ని కాపాడుకో వాల్సిందే. వర్గపోరాటంలో అది కూడా ఒక భాగం అవుతుంది.

వర్గపోరాటానికి రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి.. ప్రజాసంఘాల ద్వారా ప్రజల్ని కూడగట్టి సంఘటిత పరచడం. రెండు.. ఎన్నికలను కూడా ఒక సాధనంగా చేసుకొని రాజకీయ పోరాటం చేయడం. ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉన్నంత వరకు పార్లమెంట్ ను సైతం ఉపయోగించు కోవాలని లెనిన్ చెప్పాడు. పార్లమెంట్ వ్యవస్థే లేని చోట, నిరంకుశ రాజ్యాలున్న చోట వీధి పోరాటాలు అనివార్యం అవుతాయి. కొన్ని ప్రత్యేక పరిస్థితులు, చారిత్రక కారణాల వల్ల మన దేశంలో ప్రజాస్వామ్యంలో పాల్గొనే అవకాశం కమ్యూనిస్టులకు వచ్చింది. తెలంగాణ సాయుధ పోరాటం విరమణ అనంతరం వ్యూహం, ఎత్తుగడలు మార్చుకొని పార్లమెంటరీ క్షేత్రంలో కూడా కమ్యూనిస్టు పార్టీలు

(మిగతా 31వ పేజీలో)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ 129వ జయంతి ప్రత్యేకం

# సామాజిక, వర్గ పోరాటాలకు అంబేద్కర్ నాయకత్వం



రచయిత సిపిఐ(యం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

**దడాల సుబ్బారావు**

మన సమాజంలో హిందూమతం యొక్క వర్ణాశ్రమ ధర్మాలే రాజ్యమేలుతున్నాయి. మను ధర్మశాస్త్రం దళితుల పట్ల అవమానకరమైన ఆంక్షలు విధించింది. పట్టపగలు ఊరిలో నడవ కూడదు నడిస్తే మూతికి ముంత, ముడ్డికి చీపురు కట్టుకుని, అగ్రవర్ణాల వారికి దూరంగా నడవాలి. అందరూ తోడుకునే బావులు, చెరువులలో నీరు ముట్టుకోకూడదు. దళితులు తోడితే నీరు మైల పడిపోతుంది. వీరు దేవా లయాల్లో ఉన్న దేవుళ్ళను కూడా చూడకూడదు చూస్తే దేవుడు కూడా మైల పడిపోతాడు. కనుక గుడి బయట నుండే దేవుడికి మొక్కి పోవాలి. దళితులు చదువుకోకూడదు, ఆస్తులు సంపాదించకూడదు అందరి వలె వస్త్రధారణ చేయ కూడదు, చూడగానే వేషధారణను బట్టి వారు దళితులని తెలిసిపోవాలి. శవాలపై వేసిన బట్టనే కట్టుకోవాలి, చెప్పులు వేసుకోరాదు, వెండి, బంగారం వంటి విలువైన ఆభరణాలు ధరించకూడదు, ఊరికి దూరంగా మురికి కూపంలో పూరిపాకల్లో నివసించాలి. ఇదీ వీరి దౌర్భాగ్య పరిస్థితి. ఆశ్చర్యమేమిటంటే మన దేశంలో హిందూ మతస్తులు పిచ్చుకల కోసం ధాన్యపు కంకులను ఇంటి ముందు కడతారు, నాగుపాములకు పాలు పోస్తారు, చీమలకు చక్కెర వేస్తారు కానీ దళితులను చూస్తే మాత్రం మైలు పడ్డామనే నెపంతో పశువుల కంటే హీనంగా చూస్తారు. ఇది హిందూమతంలోని వర్ణాశ్రమ ధర్మం తీరు. అందరి వలె మనిషిగా పుట్టినా పుట్టిన తరువాత మాత్రం వీరు సమాజంలో అత్యంత హీనంగా బ్రతికే పరిస్థితి ఉంది. ఇది దళితులకు మనుధర్మం కల్పించిన దుర్గతి. ఆనాడే కాదు నేటికి దళితులకు దాదాపుగా ఇదే పరిస్థితి ఉంది.

అంబేద్కర్ అంటరాని కులమైన మహర్ కులంలో పుట్టి ఎన్నో అమమానాలకోర్చి ఉన్నత విద్యను అభ్యసించాడు. పలు డాక్టరేట్‌లు పొందాడు. అయినప్పటికి అవమానాలకు గురౌతూనే ఉండేవాడు. దళితుల పట్ల చూపుతున్న ఈ వివక్షపై రగిలిపోయేవాడు. వివక్షకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటాల్లో తొలి పోరాటమే చౌదార్ చెరువు పోరాటం.

చౌదార్ చెరువులో అందరు నీరు తీసుకుని త్రాగవచ్చని మహద్ మున్సిపాలిటి 1923 లోనే తీర్మానం చేసింది. 1926లో రామచంద్ర చందోర్కర్ అనే దళితుడు చౌదార్ చెరువులోకి దిగి నీరు త్రాగుతాడు. దీనితో అగ్రవర్ణ హిందువులు కోపంతో రగిలిపోయి చందోర్కర్ పై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఆ తరువాత మహర్‌లంతా సమావేశమయారు. ఐక్యంగా నిలబడి చౌదార్ చెరువులో నీళ్ళు త్రాగడానికి సత్యాగ్రహ కమిటీని వేసి అనేక సంవత్సరాలు పోరాటం చేశారు. 1927 మార్చి 19, 20 తేదీల్లో సమావేశమై చౌదార్ చెరువు నీటిని వాడుకోవాలని తీర్మానం చేశారు. ఆ చెరువులో నీరు అందరూ వాడుకోవచ్చు కానీ అంటరాని వారు ఊరి చెరువు నీటిని తాకకూడదు అని అగ్రవర్ణాలు శాసించాయి. అగ్రవర్ణాల మల మూత్రాలు, మాలిన్యాలు కడిగివేస్తూ అందరికి సేవ చేసే దళితులు మాత్రం ఆ చెరువులో నీరు త్రాగరాదు. చౌదార్ చెరువుకి వెళ్ళి నీటిని తీసుకోవడం ద్వారా దళితుల పౌర హక్కులను అమలు జరపటానికి పూనుకోవాలని నిర్వాహకులు తీర్మానించారు. బహిష్కృత హితకారిణి సభ మహద్ పట్టణంలో సభ జరిపి అగ్ర వర్ణాల దురాగతాలను ఎదుర్కోవాలని తీర్మానం చేసింది. దీనికి అనుకూలంగా ఉన్నవారు చేతులు ఎత్తమని అడుగగా వారి చేతిలో ఉన్న 5 వేల కర్రలు పైకిలేచాయి. 1927 అక్టోబర్ 30న 10 వేల మందితో జరిగిన సభలో ఈ పోరాటానికి విరాళాలు వసూలు చేయాలని తీర్మానించారు. మహద్ చెరువు పోరాటానికి ఒక కార్యచరణ కమిటీ ఏర్పాటయ్యింది. 1927 డిశంబర్ 25 తేదీన రాత్రి వేలాది మందితో సభ జరిపి మహద్ చెరువులో దళితులు నీరు తీసుకోవాలని, హిందూ సమాజంలో అంటరాని తనానికి, అసమానతలకు మూల కారణమైన వర్ణ వ్యవస్థకు, అంటరానితనానికి కారణమైన, మనుస్మృతిని తగులపెట్టాలని తీర్మానాలు చేశారు. రాత్రి 09.00 గం॥లు దాటిన తర్వాత మనుస్మృతి గ్రంధాన్ని బహిరంగంగా తగులబెట్టడం జరిగింది. కొన్ని రోజులు గడిచిన తరువాత అంబేద్కర్ నాయకత్వంలో దళితు లంతా ప్రదర్శనగా వెళ్లి చౌదార్ చెరువులో మంచి నీళ్ళు త్రాగారు. దీనితో ఆగ్రహించిన అగ్ర వర్ణాల వారు దళితులపై మూకుమ్మడిగా దాడి చేసి దళితులను గాయ పరచడం జరిగింది. ఈ దాడిలో అంబేద్కర్ కూడా గాయపడ్డాడు. ఈ పోరాటంలోకి అంబేద్కర్‌ను రప్పించి నాయకత్వం వహించే టట్టు చేసిన దళిత నాయకుడు ఆర్.బి. మోర్.

1927లో ముంబాయిలో నూతనంగా రాకుర్ద్వార్ ఆలయం కట్టారు. అందులోకి అన్ని కులాల వారు వెళ్ళ వచ్చుని ప్రకటించారు. అంబేద్కర్ ఆలయానికి వెళ్ళగా అగ్రవర్ణాల వారు అంబేద్కర్‌కి వ్యతిరేకంగా భక్తులను రెచ్చగొట్టి ఆయన మీద దాడి చేయడానికి పూనుకుంటారు. ఈ స్థితిలో గత్యంతరం లేక ఆలయ పూజారులు అంబేద్కర్‌ను బయటికి పంపించేసి ప్రాయశ్చిత్త కార్యక్రమం చేపడతారు. ఈ ఘటన అంబేద్కం్‌ను ఎంతో తీవ్రంగా బాధించింది. మహారాష్ట్ర, బెంగాల్‌లో అనేక ప్రాంతాలల్లో దేవాలయాల ప్రవేశం చేయ డానికి ప్రయత్నించిన దళితులకు ఈ విధంగానే అవమానం జరిగింది.

నాసిక్‌లో దేవాలయ ప్రవేశంకై 1930

మార్చి 2వ తేదీన ఉద్యమం మొదలైంది. బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపుగా దళితులు అంబేద్కర్ నాయకత్వంలో నాసిక్ దేవాలయం ప్రవేశంకై వెళతారు. ఇందులో ఐదు వందల మంది స్త్రీలు కూడా పాల్గొన్నారు. దళితులంతా ఊరేగింపుగా రావడం చూసి పూజారులు ఆలయానికున్న నాలుగు ద్వారాలు మూసి వేశారు. సుమారు ఎనిమిది వేల మంది దళిత కార్యకర్తలు అక్కడ గుమిగూడారు. కానీ పూజారులు ఆలయం తెరవలేదు. ఇందుకై సత్యాగ్రహ కమిటీ ఏర్పాటు చేసి ఆలయ ప్రవేశం జరిపి తీరాలని తీర్మానించారు. కొన్ని రోజులు గడిచాయి. చివరికి సవర్ణ హిందూ నాయకులు సత్యాగ్రహం చేస్తున్న దళితులతో రాజీకి వచ్చారు. అగ్రవర్ణాల వారు ఒకప్రక్క దళితులు మరో ప్రక్క రథాన్ని లాగడానికి ఒప్పందం కుదిరింది. దళితులు రథం లాగడా నికి పిలుపు కోసం ఎదురు చూస్తుండగానే పూజారులు మరొక దారిగుండా రథాన్ని దొంగచాటుగా తీసుకుపోయారు. జరిగిన ఘోర అవమానానికి దళితులు నిశ్చేష్టులైపోయారు. కాంద్రేకర్ అనే బండారి యువకుడు సాహసంతో పోలీసుల ముందు నుంచి వెళ్ళి రథాన్ని పట్టుకున్నాడు. వెంటనే మిగిలిన దళితులు, దళిత నాయకులు ఒక్కమారున పరుగెత్తి రథాన్ని చుట్టు ముట్టారు. దీనితో ఆగ్రహించిన సవర్ణ హిందువులు రాళ్ళతో దాడి చేయగా అంబేద్కర్ తలకు తీవ్ర గాయమైంది. కాంద్రేకర్ అనే యువకుడు ఈ దాడిలో రక్తపు మడుగులో పడి చనిపోయాడు. ఆ రోజంతా సవర్ణ హిందువులకు, దళితులకు మధ్య పోరాటం జరుగుతూనే ఉంది. దళితుల రక్తతర్పణంతో రథోత్సవం ముగిసింది. దీనితో ఒక సంవత్సరం పాటు ఆలయాన్ని మూసి వేశారు. మరల 1931లో దేవాలయాన్ని తెరచినపుడు ఉద్యమం తిరిగి ప్రారంభించగా వందలాది మంది దళితులు అరెస్టయ్యారు. నాలుగు సంవత్సరాల పాటు ఈ ఉద్యమం సాగి 1935లో ముగిసింది. రౌండ్‌టేబుల్ సమావేశా నికి వెళ్ళినా అక్కడి నుండి అంబేద్కర్ ఈ సత్యాగ్రహ పోరాటాన్ని ఏ విధంగా కొనసా గించాలో సలహాలు, సూచనలు ఇస్తూనే ఉన్నారు. ఈ పోరాటంలో కూడా ఆర్.బి.మోర్ అంబేద్కర్ వెంట ఉన్నాడు.

నాసిక్ జిల్లాలో స్థానిక బోర్డుల అధీనంలో ఉన్న మొత్తం పదకొండు వందల బావుల్లో దళితులను నీళ్ళను తోడుకోనివ్వడం లేదు. దీనిపై దళితులు కార్యాచరణకు సిద్ధమవు తుండగా బ్రిటిష్ అధికారులు వర్ణ భేదాల గురించి గొడవ చేయవద్దని అంబేద్కర్‌కు సూచిస్తారు. మాకు చెప్పే బదులు అగ్రవర్ణాల

**“రౌండ్‌టేబుల్ సమావేశాల అనంతరం అంబేద్కర్‌లో మార్పు కనిపించింది. ఒక సమావేశంలో అయన మాట్లాడుతూ “దేవాలయ ప్రవేశాలు, బావులలో నీరు తోడడం, సహపంక్తి భోజనాలపై పోరాటం వద్దు. గౌరవంగా బ్రతకాలంటే ప్రభుత్వ ఉద్యోగం, తినడానికి తిండి, కట్టడానికి బట్ట, మనకు విద్య ఇతర అవకాశాలు కావాలి” అంటూ ఇందుకై పోరాడమని అంబేద్కర్ పిలుపునిస్తాడు.”**



**మహద్ చెరువు నీటిని దళితులు వినియోగించు కోవటం కోసం అంబేద్కర్ నాయకత్వంలో జరిగిన పోరాటం.**

వారికే ఆ సూచన చేయవచ్చు కదా అని అంబేద్కర్ బ్రిటీష్ అధికారులను నిలదీస్తాడు. రౌండ్‌టేబుల్ సమావేశాల అనంతరం అంబేద్కర్‌లో మార్పు కనిపించింది. ఒక సమావేశంలో అయన మాట్లాడుతూ “దేవాలయ ప్రవేశాలు, బావులలో నీరు తోడడం, సహపంక్తి భోజనాలపై పోరాటం వద్దు. గౌరవంగా బ్రతకాలంటే ప్రభుత్వ ఉద్యోగం, తినడానికి తిండి, కట్టడానికి బట్ట, మనకు విద్య ఇతర అవకాశాలు కావాలి'' అంటూ ఇందుకై పోరాడమని అంబేద్కర్ పిలుపునిస్తాడు. పూనా ఒప్పందం తర్వాత కాంగ్రెస్ నాయకులు, హిందూ నాయకులు దళితుల పట్ల మార్పు వచ్చిందని బ్రిటీష్ ప్రభుత్వానికి తెలియ జేయడానికి హరిజనులకు దేవాలయాల ప్రవేశం కల్పిస్తున్నాం అని ప్రకటిస్తారు. కొన్ని చోట్ల ఆలయాల వద్దకు కూడా తీసుకువెళ్లారు. కాని గుడిలోకి ప్రవేశం కల్పించలేదు. దళితులను ఉద్దేశించి అంబేద్కర్ మాట్లాడుతూ ఆలయ ప్రవేశం ద్వారా మనకేమీ లాభం చేకూరదు. రాజకీయ హక్కుల కోసం పోరాడండి, అధికా రంలో మరియు అధికారులుగా దళితులు కూడా భాగస్వాములు అయినపుడే మనం ఎన్ని ప్రయోజనాలైన సాధించవచ్చు అని చెప్పాడు.

మహారాష్ట్రలో బట్టల మిల్లులలో పని చేయడానికి అస్పృశ్యులైన దళితులను కార్మికులుగా తీసుకునేవారు కాదు. కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉన్న కార్మిక సంఘం 1928లో అనేక డిమాండ్లతో పాటు దళితులను కూడా కార్మికులుగా తీసుకోవాలని పోరాడ తారు. అంబేద్కర్ నాయకత్వాన ఉన్న హితకా రిణి సభ అధ్వర్యంలో ఈ సమ్మెకు మద్దతు తెలుపుతారు. మరల 1929లో కార్మికులు దీర్ఘకాల సమ్మె చేసినప్పుడు దానికి అంబేద్కర్ దూరంగా ఉంటాడు. 1928లో సమ్మె జరుగుతున్న సందర్భంగా పోలీసుల కాల్పుల్లో పరుశురాం జాదవ్ అనే యువకుడు మరణిస్తాడు. దీనితో ఉద్రిక్తులైన కార్మికులు మిల్లు ఇంగ్లీష్ మేనేజర్ అయిన “దావర్”పై దాడిచేసి చంపేస్తారు. ఎనిమిది సంవత్సరాల క్రితం పాండిచ్చేరి రాష్ట్రం యానాం సిరామిక్స్ ఫ్యాక్టరీలో ఇదేవిధంగా జరిగింది. సమ్మె చేస్తున్న కార్మికులు ఫ్యాక్టరీ గేటు ముందు ఆందోళన చేస్తుండగా కార్మిక సంఘ నాయకుడైన మురళీమోహన్ (దళితుడు) పోలీసు కాల్పుల్లో

> **“ 1924 మార్చిలో అంబేద్కర్ అస్పృశ్యత నివారణోద్యమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాడు. ఇందుకోసం బహిష్కృత హితకారిణి సభను స్థాపించారు. దళితుల్లో చైతన్యం కల్పించి సంఘంలో వారికి సమానస్థాయిని సాధించడమే ఈ సభ ఆశయం. ఇందుకోసం ప్రధానంగా స్త్రీలలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలి. ”**

మరణిస్తాడు. దీనితో సమ్మె చేస్తున్న కార్మికులు రెచ్చిపోయి ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌పై మూకుమ్మడిగా దాడి చేయగా ఆ దాడిలో జనరల్ మేనేజర్ మృతి చెందాడు.

ఆ రోజుల్లో కార్మికులు కూడా ఎక్కువగా కుల వ్యవస్థను పాటించేవారు. కార్మిక యూనియన్ ఆఫీసుల్లో కూడా అగ్రవర్ణాల వారు త్రాగే మంచినీటి కుండలో దళిత కార్మికులను త్రాగనిచ్చేవారు కాదు. దళితులకు మంచినీటి కుండ వేరుగా పెట్టేవారు. దీనిపై కమ్యూనిస్టు నాయకులు, ట్రేడ్‌యూనియన్ నాయకులు కార్మికుల్లో చైతన్యం కల్పించిన ఫలితంగా రెండు కుండలు పోయి ఒకే కుండ అమలులోకి వచ్చింది. ఈ పోరాటాల్లో చురుకుగ్గా ఉన్న దళిత నాయకుడైన ఆర్.బి.మోర్ అంబేద్కర్‌కు అనుచరుడుగా ఉంటూనే కార్మిక పోరాటాలను నిశితంగా పరిశీలించి కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులైనాడు. 1930లో ఆర్.బి. మోర్ అంబేద్కర్ దగ్గరకు వెళ్ళి కమ్యూనిస్టు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెబుతాడు. ఆ సందర్భంగా అంబేద్కర్ మోర్ యొక్క నిజాయితీని, పోరాట పటిమను మెచ్చుకుంటూ నీలాంటి వ్యక్తులు నా వెంట ఉండడం వలన నేను గర్వపడుతున్నాను. నీవు ఇప్పటివరకు దళితుల విముక్తికై జరుగుతున్న పోరాటాలలో పాల్గొన్నావు. నేడు నన్ను వదలి మొత్తం మానావళి విముక్తికై పోరాడాలని నిశ్చయించుకున్నావు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అగ్రకుల బ్రాహ్మణ నాయకత్వంలో ఉన్నదని తెలిసికూడా కమ్యూనిస్టు పార్టీలో చేరుతున్నావంటే నీ యొక్క అంకిత స్వభావాన్ని అభినందిస్తున్నాను. నేను ఎప్పుడు నీ శ్రేయస్సు కోరే వ్యక్తిని. భవిష్యత్తులో నీవు మరింత అభివృద్ధి చెందాలని అశిస్తున్నానని మోర్‌ను అభినంది స్తాడు. మోర్ కమ్యూనిస్టుగా వర్గ సంఘాలల్లో పని చేస్తూనే అంబేద్కర్ సాగించే పోరాటాల్లో పాల్గొంటాడు. అంటరానితనానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల నుండి వర్గ పోరాటాల వైపు కమ్యూనిస్టు సిద్ధాంతం వైపు మోర్ ఆకర్షించబడి కమ్యూనిస్టు పార్టీలో చేరిన మొట్టమొదటి దళిత కమ్యూనిస్టు ఆర్.బి.మోర్. ఈయన తరువాత అనేక మంది అంబేద్కర్‌తోఉన్న దళిత నాయకులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

“యాచన ద్వారా, ఆత్మప్రబోధం ద్వారా కోల్పోయిన హక్కులు తిరిగి పొందలేము. అవిశ్రాంత పోరాటాల ద్వారానే వాటిని సాధించగలం” అని అంబేద్కర్ బోధిస్తాడు. మేకల్ని బలియిస్తారు కాని సింహాన్ని బలియివ్వరు. కోల్పోయిన మీ హక్కుల కోసం సింహాల్లా పోరాడండి అని పిలుపునిస్తాడు. సంఘ సంస్కర్తల బోధనలు సాధించలేని పనిని ప్రత్యక్ష కార్యచరణ ద్వారా స్వల్ప కాలంలోనే సాధించగలమని ఆయన అనుభవంతో చెబుతాడు. దళిత జాతులు తమ స్థితిని గుర్తెరిగి వారే పరిష్కరించు కోవాలని, అగ్ర వర్ణాల కన్నా మనం ఎందులోనూ తీసిపోమని ఋజువు చేసుకోవా లని ఆయన పదే పదే బోధించారు.

1924 మార్చిలో అంబేద్కర్ అస్పృశ్యత నివారణోద్యమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాడు. ఇందుకోసం బహిష్కృత హితకారిణి సభను స్థాపించారు. దళితుల్లో చైతన్యం కల్పించి సంఘంలో వారికి సమానస్థాయిని సాధించడమే ఈ సభ ఆశయం. ఇందుకోసం ప్రధానంగా స్త్రీలలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలి. స్త్రీ సమాజంలో వెనకబడిపోవడానికి కారణం స్త్రీకి విద్య లేకపోవడమేనని ప్రచారం చేస్తూ స్త్రీ విద్యకై హితకారిణి సభ కృషి చేసింది. స్త్రీలకు కూడా ఆస్తి పంచి ఇవ్వాలని విధవా పునర్వివాహాలు జరిపించాలని, బాల్య వివాహాలు అరికట్టాలని ఈ సభ కృషి చేసింది. ఈ సభ అధ్వర్యంలో సోలాపూర్‌లో ఒక పాఠశాల నెలకొల్పి విద్యార్థులకు వసతి గృహం కూడా ఏర్పాటు చేసి స్త్రీలు, దళితులకు విద్య గరపడానికి అంబేద్కర్ ఎక్కువగా తపించారు.

అంబేద్కర్ కులతత్వానికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడారు. మన దేశంలో కులం అనేది శ్రమ విభజన మాత్రమే కాదు. ఇది శ్రామికులను కూడ విభజించింది. శ్రామికుల మధ్య అసహజమైన అడ్డుగోడలు నిర్మించింది. ఇది ఏ ఇతర దేశాలలో లేదు. ఏ నాగరిక సమాజంలోను లేని దుర్వ్యవస్థ మన దేశంలోనే ఉన్నది. మన దేశంలో సామాజిక క్రమాన్ని పూర్తిగా మార్చుకోక పోతే ఏ విధమైన అభ్యుదయాన్ని సాధించలేరు. “కులం పునాదుల మీద మీరు దేనిని నిర్మించలేరు. ఒక జాతిని నిర్మించలేరు, ఒక నీతినీ నిర్మించలేరు. కులం పునాదుల మీద మీరు ఏదైనా నిర్మిస్తే అది పగిలి ముక్కలు కావడం తథ్యం. అలాంటిదేది సంపూర్ణంగా నిర్మాణం చేయలేం” అని కుల సంస్థల పట్ల తన అసమ్మతిని తెలియజేస్తాడు.

కులం పుట్టుక, కుల నిర్మూలన విషయంలోను అంబేద్కర్ చారిత్రక పరిణామ క్రమంలో పరిశీలించి చెప్పలేదు. మన దేశంలో కుల వ్యవస్థ శాస్త్రాల ఆధారంగా, వేదాల ఆధారంగా నిర్మాణమైందని ఆయన నిశ్చిత అభిప్రాయం. అందుచేతనే ఈ కుల వ్యవస్థను బద్దలు కొట్టాలంటే వేదాలపైన మీరు దాడిచేయాలి. మీరు ఉపయోగించే డైనమైట్‌ను వేదాలపైనా, శాస్త్రాలపైనా ప్రయోగించవలసి ఉంటుంది. వాటిని ఛేదిస్తే తప్ప కుల వ్యవస్థను ఛేదించలేరు. శృతువులను, శత్రువుల యొక్క మతాన్ని మీరు నాశనం చేయవలసి ఉంది. ఈ పని మీరు చేయకపోతే మీ కృషి ఫలించదు అని అంటారు. భారతదేశంలో స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక జీవన విధానంపై ఏర్పడ్డ ఫ్యూడల్ వ్యవస్థలో భాగంగా కులవ్యవస్థ ఏర్పడిందని కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. ఈ కులవ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయడానికి మనుధర్మ శాస్త్రం దోహదపడింది. మన దేశంలో భూస్వామ్య సమాజాన్ని, పెట్టుబడిదారి పూర్వ లక్షణాలను సమూలంగా నిర్మూలించ గలిగితే చాలా వరకు కులవ్యవస్థను నాశనం చేయగలుగుతాం. కులం ఉపరి తలంలో ఉన్నదని ఒకనాటి అభిప్రాయం. కులం ఉపరితలంలోనే కాదు పునాదిలో కూడ ఉన్నదని నేటి అభిప్రాయం. కనుక కుల నిర్మూలన జరగాలంటే ఫ్యూడల్ వ్యవస్థ సమూల రద్దుతో పాటు దాని భావజాలానికి, బూజుపట్టిన దురాచారాలకు వ్యతిరేకంగా సాంస్కృతిక విప్లవం నిరంతరాయంగా జరపవలసి ఉంటుంది.

అంబేద్కర్ కమ్యూనిస్టు పార్టీ పట్ల, నాయకుల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తాడు. కాని సోషలిజం పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తారు. “ఒక వర్గం పీడించబడుతూ, అవమానించబడుతూ ఉన్నంత కాలం, వర్గ

దౌర్జన్యం సమాజంలో ఉన్నంత కాలం ఇండియాలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గల సమాజాన్ని నిర్మించడం అసాధ్యం" సోషలిస్టు సిద్ధాంతంలో, అ లక్ష్యంలో విశ్వాసం కలవాడిని కనుక సమాజంలోని వివిధ వర్గాలను, గ్రూపులను సంపూర్ణ సమానత్వంతో చూడాలని నేను నమ్ముతున్నాను. కుల సమస్యకు, వర్గ పీడనకు నిజమైన పరిష్కారం సోషలిజం ఒక్కటే అందివ్వగలదని నా అభిప్రాయం. సోషలిజం ఒక వాస్తవ కార్యచరణ. అయితే అది ఎప్పుడో, ఎక్కడో దూర దూరాలలో ఉండే ఆదర్శం. నిరంకుశత్వం అక్రమం, అన్యాయం, హింస ఒక వర్గాన్ని నిరంతరం వేధిస్తూ విలయతాండవం చేస్తుంటే సోషలిస్టు ఒప్పుకుంటాడా అని ప్రశ్నిస్తాడు. ఇటువంటి సామాజిక దురాచారా లకు వ్యతిరేకంగా పోరాడాలని చెబుతాడు. అంబేద్కర్ అవగాహన వలె నేడు కమ్యూనిస్టులు కృషి చేస్తున్నారన్న విషయాన్ని అంబేద్కర్ వాదులు అవగాహన చేసుకొని వారితో కలిసి పని చేయాల్సి వుంది.


> **"సోషలిస్టులు కోరుకునే అర్థిక సంస్కరణలు ఎపుడు ఎలా సాధ్యపడతాయి అని ప్రశ్నిస్తూ "విప్లవం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుంటేనేగాని అది సాధ్యం కాదనేది సత్యమేకదా" అంటూ విప్లవం తీసుకురావడానికి ఇండియాలోని కార్మికవర్గ ప్రజలంతా ఏకం అవుతారా అని ప్రశ్నిస్తాడు."**


సోషలిస్టులు కోరుకునే అర్థిక సంస్కరణలు ఎపుడు ఎలా సాధ్యపడతాయి అని ప్రశ్నిస్తూ "విప్లవం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుంటేనేగాని అది సాధ్యం కాదనేది సత్యమేకదా" అంటూ విప్లవం తీసుకురావడానికి ఇండియాలోని కార్మికవర్గ ప్రజలంతా ఏకం అవుతారా అని ప్రశ్నిస్తాడు. ఇండియాలోని కార్మికవర్గం అంతా విప్లవంలో పాల్గొనాలంటే వ్యక్తి సమానత్వం, సౌభ్రాతృత్వం, అన్నింటికి మించి సహజ న్యాయం ప్రేరణతో పోరాడగలిగినప్పుడే సాధ్యపడుతుంది. అది నేడు ఇండియాలో లేదని కుల నిర్మూలన గ్రంథంలో అంబేద్కర్ చెబుతాడు. కనుకనే ఇండియాలో సాంఘీక వ్యవస్థను సోషలిస్టులు ఎదుర్కొనక తప్పదు. అలా ఎదుర్కొనకుండా విప్లవం సాధ్యం కాదు. ఒక వేళ అది సాధ్యం అయినా మన దేశంలోని సామాజిక వ్యవస్థతో సోషలిస్టులు కుస్తీపట్టక తప్పదు అని అయన అంటాడు. అందుచేతనే నేడు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విప్లవాన్ని జయప్రదం చేసే లక్ష్యంతో ఆర్థిక పోరాటాలతో పాటు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం జమిలిగా పోరాటాలు చేస్తుందన్న వాస్తవాన్ని ప్రజలు గమనించాలి.

అంబేద్కర్ స్టేట్ సోషలిజం సాధన కొరకు కొన్ని ప్రతిపాదనలు సూచిస్తారు. అందులో 1). వ్యవసాయం ప్రభుత్వ పరిశ్రమగా మారాలి. 2). మొత్తం భూమిని ప్రభుత్వం జాతీయం చేయాలి. 3). ఎటువంటి భూస్వామి గాని, కౌలుదారుడు గాని, వ్యవసాయ కార్మికులుగాని ఉండరాదు. భూమి వ్యక్తుల పేర ఉండకూడదు. సమిష్టి వ్యవసాయ విధానం ఉండాలి. 4).ప్రైవేటు పరిశ్రమలను ప్రభుత్వం జాతీయం చేసి పారిశ్రామికీకరణను వేగవంతం చేయాలి. 5). ఇన్సూరెన్సు సంస్థలను జాతీయం చేసి ప్రభుత్వ అధీనంలో నిర్వహించాలి. అంబేద్కర్ ఈ ప్రతిపాదనలను అలిండియా షెడ్యూల్డ్ కాస్ట్స్ అసోసియేషన్ తరుపున రాజ్యాంగ కమిటీకి సమర్పిస్తాడు. కాని రాజ్యాంగాన్ని రచించేటపుడు వీటిని పొందుపరచలేక పోయారు. ఈ అభిప్రాయాలనే స్టేట్స్ అండ్ మైనార్టీస్ అనే చిన్న గ్రంథంగా వెలువరించారు.

ఖోటీ విధానం రద్దుకై అంబేద్కర్ పోరాటం చేస్తాడు. బొంబాయి రాష్ట్రంలో అమలులో ఉన్న భూమికౌలు విధానంలో ఖోటీ విధానం ఒకటి. ఖోటి విధానం అంటే ఒక వ్యక్తి భూమి శిస్తు వసూలు చేసి బ్రిటీషు ప్రభుత్వానికి చెల్లించాలి. మన రాష్ట్రంలో జమిందారి వ్యవస్థ లాంటిదే ఈ ఖోటి విధానం. తమకు ఇష్టం వచ్చిన విధంగా శిస్తు నిర్ణయించి వసూళ్ళు చేసే స్వేచ్ఛ ఖోటిలకు ఉంది. వీరు సన్నకారు, చిన్నకారు రైతులను శిస్తు పేరుతో పీడించుకు తినేవారు. ఇందువల్ల రైతులు పన్నుల భారంతో దుర్భర దారిద్ర్యంలోకి నెట్టబడేవారు. ఖోటి విధానం రద్దు చేయాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్నా బ్రిటీషు వారు పట్టించుకోలేదు. ఖోటీలకు రైతులకు మధ్య జరిగిన ఘర్షణలో ఖోటీలు రైతులను చంపేశారు. ఈ దుస్థితి నుండి రైతులను కాపాడటానికి అంబేద్కర్ మహారాష్ట్ర శాసనసభలో 1937 సెప్టెంబర్‌లో ఖోటీ విధానం రద్దు బిల్లును ప్రవేశపెడతాడు.

ఈ బిల్లులో ముఖ్యమైన అంశాలు: 1) ఖోటీ విధానాన్ని రద్దుచేసి రైతులకు, ప్రభుత్వానికి మధ్య ప్రత్యక్ష సంబంధాలను నెలకొల్పడం. 2) ఖోటీలు తమ హక్కులు కోల్పోయారు కాబట్టి వారికి తగిన నష్టపరిహారం ఇవ్వడం. 3) ఇప్పటివరకు సాగులో ఉన్న రైతులకు భూమిపై హక్కు కల్పించడం వంటి అంశాలతో శాసన సభ్యుడిగా ఉన్న డా॥ అంబేద్కర్ సభలో బిల్లును ప్రవేశపెడతాడు. కాని శాసనసభలో ఈ బిల్లు ఆమోదించబడదు. దీనితో కౌలురైతులు సమ్మె చేస్తారు. వీరికి మద్దతుగా కార్మికులు కూడా సమ్మె చేస్తారు. రైతులు సమ్మె కొనసాగిస్తుండగా నాటి వ్యవసాయశాఖ మంత్రి మొరార్జీ దేశాయ్ ఆందోళన చేస్తున్న కార్మికులతో చర్చలు జరిపి 1939 ఫిబ్రవరి 4న రైతుల హక్కులకు రక్షణ కల్పిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం జరిగింది. దీనితో రైతాంగం పోరాటాన్ని ఉపసంహరించింది. అంబేద్కర్ చేసిన కృషికి ఫలితం దక్కింది. ఈ సందర్భంగానే మహారాష్ట్రలో "వతన్" వ్యవస్థకు వ్యతిరేకంగా దళితులు పోరాటం చేస్తారు. వతన్ వ్యవస్థలో మగ్గిపోతున్న అట్టడుగు కులాల వారిని అంబేద్కర్ సమీకరించి పోరాటానికి నాయకత్వం వహిస్తాడు. వతన్ వ్యవస్థ అనగా భూస్వామి వద్ద పాలేరుగా ఉన్న దళితుడు అప్పుచేస్తే అప్పు తీరేవరకు భూస్వామి వద్దే తక్కువ కూలీకి పనిచేయాలి. చేసిన అప్పు తీరక తాతలు, తండ్రులు, కొడుకులు కూడా ఒకే భూస్వామి కుటుంబం వద్ద పాలేరుగా వెట్టిచాకిరి చేసే వారు. అప్పు తీరిన తరువాతనే భూస్వామి వద్ద పనిచేయకుండా మానేయవచ్చు. మన రాష్ట్రంలో వెట్టి చాకిరి లాంటిదే ఈ విధానం. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో కామ్రేడ్ సుందరయ్య నాయకత్వాన వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారు. మహారాష్ట్రలో అంబేద్కర్ నాయకత్వాన వతన్ వ్యవస్థకు వ్యతిరేకంగా శాసనసభలో కూడా చేసిన పోరాట ఫలితంగా వతన్ వ్యవస్థ రద్దు చేయడం జరిగింది. అంబేద్కర్ 1924 నుండి 1940 వరకు సాగించిన పోరాటాలను మాత్రమే పేర్కొనడం జరిగింది. కుల వివక్షతో పాటు వర్గదోపిడీని కూడా వ్యతిరేకిస్తూ అంబేద్కర్ నిర్వహించిన పోరాటాలు దళితులు, అంటరాని ప్రజలను సామాజిక, వర్గ పోరాటాల లోకి సమీకరించాయి.

❋

**ఈ మాసం ముఖ్యాంశం**

# ప్రజాస్వామ్య అనంతర రాజ్యం

**- ప్రొఫెసర్ ఐజాజ్ అహమ్మద్**



రచయిత
జెఎన్‌యు మాజీ ప్రొఫెసర్

ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో చారిత్రకంగా రెండు రకాల రాజ్యాలు ఆవిర్భవిస్తున్నాయి. ఉదారవాద, ఫాసిస్టు నమూనాల సమ్మేళనంగా, సనాతన పెట్టుబడిదారీ రాజ్యాల రూపంలో అవి వున్నాయి. నరేంద్ర మోడి సారధ్యంలోని భారతదేశం కూడా ఆ దిశగానే పయనిస్తున్నది.

1992నాటి బాబ్రీమసీదు విధ్వంసకన్నా, 1998లో వాజ్‌పాయి ప్రభుత్వం రెండవ పర్యాయం కొలువు దీరటంకన్నా, 2002 గుజరాత్ మారణహోమం కన్నా నేటి భారత రాజకీయాలు ప్రమాదకరంగా వున్నాయి. ఆర్‌యస్‌యస్ అండతో ఒక దశాబ్దంలో జరిపిన హేయమైన రెండు హింసాకాండలతో, ఎన్నికల ద్వారా బిజెపి సులభంగా అధికార పీఠం ఎక్కింది. 1996, 1998 నాటి వాజ్‌పేయి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వాలు రామ మందిరం ఆందోళన, బాబ్రీ మసీదు కూల్చివేత లేకుండా అది సాధ్యమయ్యేది కాదు. హిందూ సమాజాన్ని సైనికీకరించాలన్నది సావర్కర్ స్వప్నం. మతతత్వ హింసాకాండ ఎన్నికల ఫలితాలుగా మారగలదని రుజువైంది. నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా ఎంపికైన వెంటనే గుజరాత్ మారణకాండకు తెరలేపారు. దాని ఫలితంగా అనంతరం రాష్ట్రంలో వరుసగా జరిగిన ఎన్నికల్లో ఆయనకు మద్దతును పెరిగింది. భవిష్యత్ ప్రధానిగా జాతీయ స్థాయిలో మధ్యతరగతి మోడి పట్ల సానుకూలత కనబరచ సాగారు. కానీ మతోన్మాద విషాన్ని వెదజల్లడానికి మోడి ఏనాడూ కళ్లెం వేయలేదు. మీడియా, ప్రజాసంబంధాల సంస్థలు ఆయనను ఒక 'వికాస పురుషుడి' గా అభివర్ణించాయి. మోడీ చేసిన వాగ్దానాలు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమం చేశాయి.

ఎన్నికల రాజకీయాలు ఎపుడైనా పడుతూ లేస్తూ వుంటాయి. కానీ 1989 నుండి 2019 వరకూ 30 సంవత్సరాలకు పైబడి హింసాయుత రాజకీయాల ద్వారా బిజెపి జాతీయ స్థాయిలో ఒక చిన్న పార్టీ స్థాయి నుండి అతి పెద్ద రాజకీయ శక్తిగా ఎదిగింది. విశ్వహిందూ పరిషత్(విహెచ్‌పి), భజరంగ దళ్, దుర్గావాహిని వంటి సంస్థలు అవతరిస్తూ, అంతరిస్తూ వుంటాయి. ఎన్నికల విజయాలు బిజెపితో పాటు పై సంస్థలకూ మంచి గౌరవం అందిస్తాయి. అవసరం వచ్చినపుడంతా ఎన్నికల ప్రచారంలోకి దూకే ఆర్‌యస్‌యస్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆర్‌యస్‌యస్ సిద్ధాంతానికి స్పష్టంగా కట్టుబడి వుండే సామాజిక పునాది కూడా పెరిగింది. నిత్య జీవితంలో ఆర్‌యస్‌యస్ ప్రాపంచిక దృక్పధాన్ని పాక్షికంగానైనా ఆమోదించే వారు అసంఖ్యాకంగా వున్నారు. మూక దృక్పధం సైద్ధాంతిక ఆకర్షణ కేంద్రంగా మారిపోయింది.

సైద్ధాంతిక ఆకర్షణ కేంద్రంలో జరిగిన మార్పు దేశపు నైతిక నిర్మాణాన్ని మరింతగా మొద్దుబార్చింది. అసంఖ్యాకమైన ప్రజలు మోడి, యోగి ఆదిత్యనాథ్‌లకు మద్దతుదారులుగా మారటమే అందుకు సంకేతం. ఉత్తర ప్రదేశ్ జనాభా దాదాపు జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌ల జనాభా అంత వుంటుంది. వాస్తవానికి యోగి ఆదిత్యనాథ్ కాషాయ దళానికి చెందిన భజరంగదళ్ సభ్యుడు. ఎలాంటి పెద్ద ఎదురు దెబ్బలను తినకుండానే అంత పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాగల్గాడు. దీన్నిబట్టే పై నిర్ధారణలు ఎంతో సరైనవని రుజువౌతున్నది. ఉత్తరప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో బిజెపికి అతడు ఆకర్షణీయమైన ప్రచారకుడుగా మారాడన్న అంశాన్ని మర్చిపోరాదు. అతడు భవిష్యత్తులో కాబోయే ప్రధాని అని కూడా తరచూ ప్రచారం జరుగుతున్నది.

వారి విజయాలకు దోహదపడ్డ తక్షణ, దీర్ఘకాలికాంశాల్లో అతి ప్రమాదకరమైనది కాంగ్రెస్ వంటి తమ కీలక రాజకీయ ప్రత్యర్ధుల ఆమోదాన్ని కూడా పొందగల శక్తిని ఆర్‌యస్‌యస్ సంతరించుకుంది. ప్రజా జీవనానికి చట్టబద్ధమైన భరోసాను కల్పిస్తూ, రాజ్యాంగపు మౌలిక విలువల పరిరక్షణకు బాధ్యత వహించవలసిన సుప్రీం కోర్టువంటి రాజ్యాంగ బద్ధ సంస్థలు కూడా అందుకు మినహాయింపు కాదు. బాబ్రీ మసీదును కూల్చేందుకు ఆర్‌యస్ యస్, శివ సైనికులకు సంవత్సర కాలానికిపైగా విస్తారమైన కార్యకర్తల శిక్షణ, భారీ సన్నాహక కార్యక్రమాలు కొనసాగాయి. సుదీర్ఘకాలం సాగిన ఈ హంగామా గురించి గూఢచార సంస్థలు తమకేమీ తెలియనట్లు అమాయకత్వాన్ని నటించటం ఈ అంశాన్ని ధృవపరుస్తున్నది

రాజకీయ అగ్ర నాయకులకు ముందస్తు సమాచారం వుందా? పివి నరసింహారావు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేష్టలుడిగిన తీరు ఆశ్చర్యాన్ని కల్గించింది. నాటి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ మసీదును కాపాడుతానని సుప్రీంకోర్టుకు వాగ్దానం చేశాడు. కానీ ఆ వాగ్దానాన్ని చాలా తేలిగ్గా గాలికొదిలేసి తప్పుకున్నాడు. బాబ్రీ మసీదు కూల్చివేత దృశ్యాలన్నీ టివీలో ప్రసారం చేయబడ్డాయి. ఆ దుర్మార్గంలో పాల్గొన్న బిజెపి, సంఘపరివార్ అగ్రనాయకుల విన్యాసాలను ప్రజలందరూ వీక్షించారు. వారి గావు కేకలు, కూల్చివేత బృందాలకు సూచనలిస్తున్న తీరును గమనించారు. అందులో ఏ ఒక్కరికీ శిక్షలు పడలేదు. కూల్చివేతలపై మూడు నెలల్లోగా నివేదిక సమర్పించేదుకు జస్టిస్ యంయస్ లిబర్‌హాన్ కమిటిని నియమించారు. కానీ ఆ కమిటి 17 సంవత్సరాల అనంతరం అరకొర నివేదిక సమర్పించింది. కూల్చివేతలో పాల్గొన్న అనేక మంది ముఖ్య నేతల పేర్లు ఆ నివేదికలో లేవు. కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, సుప్రీం కోర్టు ఈ అంశాన్ని గాలికి వదిలేశాయి. ఆర్‌యస్ యస్, బిజెపి, విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థల ప్రధాన నాయకులు ఎవ్వరినీ శిక్షించక పోవటం ఇక్కడ కీలకమైన అంశం. 2002 గుజరాత్ హత్యాకాండ కారణంగా

అమెరికా, ఇంగ్లండు దేశాలు మోడికి వీసా మంజూరుకు తిరస్కరించాయి. దాన్ని ఒక భారతీయ ముఖ్య మంత్రికి జరిగిన అవమానంగా భావించిన నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆ దేశాలకు తన నిరసన తెలియజేశారు. చట్ట ఉల్లంఘనలు, నీతి నియమాల అర్థాలు మారుతున్నాయనటానికి ఇదొక నిదర్శనం.

పైన ప్రస్తావించిన 1992, 1998, 2002లో జరిగిన ప్రతి సంఘటన ఆర్‌యస్‌యస్ దేశంలోని అత్యున్నత అధికార స్థానానికి ఎగబాకేందుకు నిర్ణయాత్మకంగా దోహద పడింది. ప్రస్తుత పరిస్థితులు అంతకంటే ప్రమాదకరంగా మారాయి. 1925 నుండి 1970 వరకూ షుమారు 40 సంవత్సరాల పాటు ఆర్‌యస్‌యస్ చాలా చిన్నశక్తిగా వుండేది. భారత రాజకీయాల్లో నాదది ఒక అంటరాని సంస్థగానే మిగిలిపోయింది. 1970 మధ్య కాలంలో జయప్రకాష్ నారాయణ ఇందిరా గాంధీ వ్యతిరేక వుద్యమం ప్రారంభించారు. ఆ వుద్యమంలో ఆర్‌యస్‌యస్ నిర్వహించిన తెలివైన పాత్రతో తొలిసారి దాని దశ తిరిగింది. జయప్రకాష్ నారాయణకు వ్యక్తిగతమైన ప్రతిష్ట మాత్రమే వుంది. కానీ ఎలాంటి నిర్మాణమూ లేదు. మొరార్జీ దేశాయికి రాజకీయంగా ఉన్నతస్థానం వుంది. కానీ ఆయన పార్టీ డొల్లయి వుంది.

ఆర్‌యస్‌యస్‌కు సమిష్టి నాయకత్వం, సుశిక్షితులైన కార్యకర్తలు, ప్రతిష్టాకరమైన పార్లమెంటరీ బృందం (జనసంఘ్) వుంది. అది ఇందిరాగాంధీ వ్యతిరేక మితవాద కూటమిలో ఆధిపత్య స్థానంలో వుంది. 1977 ఎన్నికల అనంతరం వారు 94 మంది సభ్యులతో పార్లమెంటులో ప్రవేశించారు. భారత రాజకీయాలలో ఆర్‌యస్‌యస్ మద్దతున్న జనసంఘ్‌ను ఒక సాధారణ రాజకీయ పార్టీగా చూడటం తొలిసారిగా ప్రారంభమయింది. నాటి నుండి 2014లో మోడీ మొదటిసారి ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పరచే వరకూ శక్తి, ప్రతిష్టను పెంచుకొంటూ వున్నత స్థాయికి చేరింది.

ఐదు సంవత్సరాల క్రితం స్పష్టమైన (282 స్థానాలు) ఆధిక్యతతో 2014-19 మధ్య మోడీ ప్రధానిగా తన తొలి ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఈకాలంలో తన అధికారాన్ని సుస్థిర పరచుకుని, రాజ్యాంగ సంస్థలపై పట్టు బిగించాడు. తన కూటమిలోని మిత్రపక్షాలపై ఆధారపడటం తగ్గింది. కాషాయీకరణ, అలగా మూకల పై ఆధారపడటం పెరిగింది. ప్రభుత్వం పని, దేశ సామాజిక జీవనం తదితర అంశాల్లో ఆర్‌యస్‌యస్ ప్రత్యక్ష జోక్యం మరింతగా బహిర్గతమౌతున్నది.

**" ఐదు సంవత్సరాల క్రితం స్పష్టమైన (282 స్థానాలు) ఆధిక్యతతో 2014-19 మధ్య మోడీ ప్రధానిగా తన తొలి ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఈకాలంలో తన అధికారాన్ని సుస్థిర పరచుకుని, రాజ్యాంగ సంస్థలపై పట్టు బిగించాడు. తన కూటమిలోని మిత్రపక్షాలపై ఆధారపడటం తగ్గింది. కాషాయీకరణ, అలగా మూకల పై ఆధారపడటం పెరిగింది. "**

దేశంలోని విస్తారమైన ప్రాంతాల్లో ముస్లింలపై మూకదాడులు సర్వసాధారణ మౌతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్ నుండి బెంగాల్ , అస్సాంల వరకు ఈ మారణ కాండ నిత్యకృత్యంగా మారింది. పశ్చిమ, దక్షిణ ప్రాంతాలకు కూడా ఈ దుశ్చర్యలు విస్తరిస్తున్నాయి. ఆర్‌యస్‌యస్ బీజాలు దేశవ్యాపితంగా మొలకెత్తుతున్నాయి. భిన్నత్వాల విభజన రేఖలు చెరిగిపోతున్నాయి. గౌరవపాత్రులైన మేధావులు ప్రొఫెసర్ కల్‌బుర్గీ నుండి గౌరీ లంకేష్‌ల హత్యా కాండల వరకు ఈ అంశం ముఖ్యమైనదిగా ముందుకు వస్తున్నది. పరివార్ ప్రేరిత మూకలు ఒంటరి ముస్లింలు, ముస్లిం నివాసాలపైన మూకదాడులకు పాల్పడ్డాయి. ఫాసిజంతో ఉత్తేజం పొందిన తీవ్రమితవాద హిందు గ్రూపులు హిందు మెజారిటీతోసహా, లౌకిక మేధావులు, ఉదారవాద ఆలోచనా పరులు, సమరశీలురు, కమ్యూనిస్టులతో సహా ప్రతివారినీ, భారతీయ సమాజమంతటినీ పునర్ నిర్మించేందుకు అది పూనుకుంటున్నది. ప్రాథమికంగా చరిత్ర, సమాజం, రాజకీయాలు, ప్రభుత్వాల పట్ల ఆర్‌యస్‌యస్ దృక్పథాన్ని వ్యతిరేకించేవారందరినీ ఆ పరిధి లోకి చేర్చుకోవాలని ఆకాంక్షిస్తున్నది.

మోడీ మొదటిసారి ప్రధానమంత్రి అయ్యాక విశ్వవిద్యాలయాలపై ప్రారంభమైన దాడులు ఈ ప్రాజెక్టులో భాగమే. గోవు పేరుతో హిందుత్వ మూకలు పేద ముస్లింలపై దాడులు చేశారు. దేశభక్తి పేరుతో న్యాయవాదుల గుంపు జెయన్‌యు విద్యార్ధి సంఘం అధ్యక్షుడు కన్హయకుమార్‌ను న్యాయస్థానం ప్రాంగణంలోనే చితకబాదారు.

మోడీ ప్రభుత్వం భారత ఆర్థికవ్యవస్థను ఛిద్రం చేసింది. నోట్లరద్దు, జియస్‌టిలు ప్రభుత్వం అపసవ్యంగా తెచ్చి ప్రజల నెత్తిన రుద్దిన జంట విపత్తులు. వాటితో పాటు రిజర్వుబ్యాంకును రాజకీయంగా ఉపయోగించుకోవటం ప్రారంభించారు. ఆశ్రిత పెట్టుబడిదారుల కోసం ప్రభుత్వరంగ బ్యాంకుల నిధులను పీల్చేస్తున్నారు. పెట్టుబడిదారీ విధానమంతా ఆశ్రితమైనదే. కానీ మోడీ, అదానీల ఆశ్రిత పెట్టుబడి అంతకంటే ప్రమాదకరమైనది. 2019 ఎన్నికల నాటికి సంఘటిత, అసంఘటిత రంగాలలో కోటి పదిలక్షల వుద్యోగాలు వూడిపోయాయి. కొత్తగా వుద్యోగాల కల్పన లేదు. ఆర్థికవ్యవస్థ స్థబ్దతకు గురయింది. నిరుద్యోగం 2.5 కోట్లకు చేరింది. మొత్తం శ్రామికుల్లో 6.5 శాతం నిరుద్యోగులుగా మిగిలారు.

అధికారిక లెక్కల ప్రకారం పెట్టుబడుల రాక ఒక శాతం కంటే తక్కువకు పడి పోయింది. మోడీని ఎంతగానో ప్రేమిస్తున్న పెట్టుబడిదారులకు దేశ ఆర్థిక వ్యవస్థపై పెద్దగా నమ్మకం లేనట్లు దీన్ని బట్టి అర్థమౌతున్నది. పర్యవసానంగా ఎన్నికల కేంద్రాల వద్ద మోడీ మూల్యం చెల్లించవలసి వస్తుందని విస్తారంగా అభిప్రాయ పడినారు. కానీ అందుకు భిన్నంగా గతం కంటే 21 స్థానాలు పెంచుకుని 303 స్థానాలతో ఆధిక్యతను సాధించాడు.

### ఇంతకూ ఏం జరిగింది ?

ఆర్థిక పరిస్థితులతో నిమిత్తం లేకుండా కార్పొరేట్ రంగం భారీ మొత్తాలను రాజకీయ పార్టీలకు సమర్పించుకుంది. సుమారు 3,500 కోట్ల రూపాయల వరకూ ఆ మొత్తం వుంటుంది. అందులో 93 శాతం ఒక్క బిజెపికే ముట్టాయి. బరాక్ ఒబామా తన ఉప ఎన్నికల్లో ఖర్చు చేసినంత మొత్తాన్ని 2014 ఎన్నికల్లో మోడి ఖర్చు చేశారనుకుంటే, 2019 ఎన్నికల్లో అంతకంటే ఎక్కువే ఖర్చు చేశాడు. ప్రజలకు అర్థంకాని మోతాదులో వస్తున్న పెట్టుబడులు సూచిస్తున్నదేమిటి? దేశ ఆర్థికపరిస్థితిపై కార్పొరేట్ శక్తులు అసంతృప్తిగా వున్నాయి. మరి ఆర్థిక వ్యవస్థను తలకిందులు చేసిన ప్రభుత్వానికి నాయకత్వం వహించిన వ్యక్తి గురించి అంత విస్తారమైన ప్రచారం ఎందుకు చేశారు?

**"ఛాయాచిత్రాలు పరిశీలించిన ప్రపంచంలోని పలు ప్రయోగ శాలలు ఆ దాడిలో ఎవ్వరూ మరణించలేదని రుజువు చేశాయి. ఆ వెంటనే జరిగిన పాకిస్థాన్ ఎదురు దాడిలో భారత్ ఒక యుద్ధ విమానాన్ని కోల్పోయింది. వాస్తవంగా ఈ సంఘటన భారత్‌కు అపజ యంగా పరిణ మించింది. కానీ దేశంలో దేశభక్తి ప్రేరిత వున్మాదాన్ని రెచ్చగొట్టారు."**

అందుకు మూడు కారణాలను పేర్కొనవచ్చు. ప్రధానంగా మోడి పాలనలో భారీ లాభాలు పొందిన ఆశ్రిత పెట్టుబడిదారులే అంత పెద్ద మొత్తాలు చేర్చివుంటారు. మోడీకి ప్రత్యామ్నా యం కన్పించి వుండక పోవచ్చు. గెలుపు గుర్రంపైనే పందెం కాసి వుండవచ్చు.

రెండవది. ఎలక్ట్రానిక్ మీడియా 2014 నాటి కంటే పరివార్ రాజకీయాలపట్ల, సార్వత్రికంగా మరింత కచ్చితంగా కట్టుబడి వుంది. యన్‌డిటివి, మరి కొన్ని చిన్న ఛానళ్లు మినహా మిగిలిన మీడియా అంతా ఈ పాటికే పీకల్లోతు అవినీతిలో కూరుకు పోయాయి. అవి నాటకీయతకు అలవాటు పడ్డాయి. వాటి వద్ద బిజెపి ఎన్నికల విభాగం, ఐటి విభాగాలు సమకూర్చిన ధనం పొంగి పొర్లుతున్నది. శక్తి వంతమైన సోషల్ మీడియాతో అవి జట్టు కట్టాయి. సంఘ వ్యతిరేకమైన, అర్ధ సత్యాలతో నిండిన సోషల్ మీడియానే హిందుత్వ బ్రిగేడ్ భారీ స్థాయిలో వినియోగి స్తున్నది. లక్షలాది అమాయకులకు, తమ ఆశ్రితులకు ఒకే విధంగా సమాచారాన్ని చేరవేస్తున్నారు.

మూడవది. పుల్వామా అందించిన వరం. 2019 ఫిబ్రవరి 14న ఎన్నికలకు సుమారు రెండు మాసాల ముందు జమ్ము కాశ్మీరులోని పుల్వామాలో వుగ్రవాద దాడి జరిగింది. 40 మంది సిఆర్‌పిఎఫ్ జవానులు చనిపోయారు. మరొక 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ నుండి పనిచేస్తున్న వుగ్రవాద సంస్థ జైషే -ఇ - మహమ్మద్ సంస్థ ఆ దాడికి తానే బాధ్యురాలినని ప్రకటించింది. భారత వైమానిక దళం 12 రోజుల అనంతరం పాకిస్థాన్‌లోని మదరసాలకు సమీపంలో బాంబులు వేసింది. ఆ దాడిలో 300-400ల మంది ఉగ్రవాదులు హతులైనట్లు మన ప్రభుత్వం ప్రకటించింది. ఛాయాచిత్రాలు పరిశీలించిన ప్రపంచంలోని పలు ప్రయోగ శాలలు ఆ దాడిలో ఎవ్వరూ మరణించలేదని రుజువు చేశాయి. ఆ వెంటనే జరిగిన పాకిస్థాన్ ఎదురు దాడిలో భారత్ ఒక యుద్ధ విమానాన్ని కోల్పోయింది. వాస్తవంగా ఈ సంఘటన భారత్‌కు అపజ యంగా పరిణ మించింది. కానీ దేశంలో దేశభక్తి ప్రేరిత వున్మాదాన్ని రెచ్చగొట్టారు. పాలకుల అభిప్రాయా లకు అనుగుణంగా ప్రజాభిప్రా యాన్ని మలచ గల్గారు. వాస్తవాలు నిరాశాజన కంగా వున్నా మోడీని వున్నత స్థాయిలో చూపారు.

అంతిమంగా అప్రదిష్ట పాలైన ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రాల (ఇవియం) సమస్య ఉంది. అనేక దేశాల్లో వీటిని వినియోగిస్తున్నారు. వీటితో ఫలితాలను తేలిగ్గా తారుమారు చేయవచ్చని తెలుస్తున్నది. భారత్‌లో పరీక్షించిన కనీసం ఒక ఇవియంలో ఓట్లన్నీ బిజెపికే పడ్డాయని చెప్పారు. 'పేపరు ట్రయల్' లేకుండా ఓటు వేసేందుకు, లెక్కించేందుకూ ఇవియంలే ఏకైక, అంతిమ సాధనాలుగా మారాయి. ఎన్నికల కమీషన్‌కు అ సంఖ్యాకమైన ఫిర్యాదులు అందాయి. కోర్టుల్లో పిటీషన్లు వేశారు. కానీ అవన్నీ చెత్తబుట్టలోకి వెళ్లాయి. ఈ అంశాలన్నీ మోడికి అనుకూలించి వుండవచ్చు. 303 స్థానాలతో వూహించని ఆధిక్యత లభించింది. ఆరు శాతానికి పైగా ఓట్లు పెరిగాయి. పార్లమెంటులో ఒక పార్టీ ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే సభలో 10శాతం స్థానాలు వుండాలన్నది భారత్‌లో నియమం. దాన్ని అనుసరించి 2014 తర్వాత పార్లమెంట్‌లో గుర్తింపుగల ప్రతిపక్ష నాయకుడే లేడు. రెండవది సభలో 303 స్థానాలు బిజెపికి వుండగా బిజెపి ఏతర పార్టీలకు 245 మంది యంపిలున్నారు. ఇది పెద్ద సంఖ్య. తేడా కేవలం 60స్థానాలలోపే. ఈ 245 మంది పొందికైన ప్రతిపక్షంగా యేర్పడమని ఎవరైనా కోరవచ్చు. వారు ఏకీభావంతో పనిచేయవచ్చు. వారంతా కనీస వుమ్మడి కార్యక్రమాన్ని రూపొందించు కోవచ్చు. ఇటువంటి వాటిని గురించి వారు పట్టించుకోవటం లేదు. ఈ రెండు వాస్తవాల ఆధారంగా బిజెపి ఏతర పక్షాలు ఎంతగా చీలివున్నాయో, జడత్వంతో (ఇనర్షియా) కూడి వున్నాయో అర్థం చేసుకోవచ్చు.

పరివార్ రాజకీయాల్లో అరుణ్ శౌరీ ఒక సీనియర్. ప్రస్తుతం తిరుగుబాటుదారుగా వున్నాడు. ఇటీవల కరణ్ థాపర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా చెప్పాడు. (2018 సెప్టెంబరు 2న వైర్ ప్రకటన) " 2019 ఎన్నికలే భారత్‌లో చివరి స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు కావచ్చు. బిజెపి ప్రత్యర్థులకు దీర్ఘకాల నిరంకుశ ప్రభుత్వపు ఎదుగుదలను నిలువరించేందుకు ఇదే చివరి అవకాశం కావచ్చు''. అతని సూత్రం చాలా సాధారణమైనది: ''మీ మధ్య పరస్పర విబేధాలను మరచిపొండి. ఒక వుమ్మడి వేదికపైన కలసి పొండి. బిజెపికి వ్యతిరేకంగా ప్రతి నియోజకవర్గంలో ఒక వుమ్మడి అంగీకృత అభ్యర్థిని ఎన్నికల బరిలో పోటీకి నిలబెట్టండి". అతడు వ్యక్తపరచిన ఒక గణాంకాన్ని పరిశీలిం చాల్సి వుంది: ''2014ఎన్నికల్లో మోడీ సాధించిన సీటుల్లో 90శాతం కొన్ని రాష్ట్రాల్లోనే వచ్చాయి. అవి లోక్‌సభ మొత్తం స్థానాల్లో 60 శాతంగా వున్నాయి. ఉత్తర ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర - కనీసం ఈ మూడు రాష్ట్రాల్లో ప్రతిపక్షం ఏకమై వుంటే అక్కడ 90శాతం సీట్లను మరోసారి సాధించటం మోడీకి అసాధ్య మయ్యేది". ఇది సమాధానం దొరకని వాదన. పరివార్ శక్తులు గెలుపు నిశ్చయమన్న అభిప్రాయం నెలకొన్న కాలంలో దానిని నివారించేందుకు జాతీయస్థాయి సంపూర్ణ ఐక్యతా పిలుపు ముందుకువచ్చింది. ఈ విజ్ఞప్తి సోనియా గాంధీ లేదా రాహుల్ గాంధీవంటి కాంగ్రెస్ నాయకుని నుండి రాలేదు. అరుణ్‌శౌరీ నుండి వచ్చింది. అందుకే దానిలో లోతైన ఆంతర్యం ఇమిడి వుంది.

గతంలో చెప్పినట్లు భారత రాజకీయాలు వేగంగా మారుతున్న క్రమంలో వున్నాయి. ఇపుడు మనకొక ప్రశ్న ఎదురౌతుంది : అలంకార ప్రాయంగా కాక ఈ ప్రశ్నను (సీరియస్) గట్టిగానే అడగాలి. ఈ విధమైన అస్థిరస్థితి బహుశా ఇప్పట్లో ముగియకపోవచ్చు. ఎందుకంటే 1947 ఆగస్టు 15న రిపబ్లిక్ ఆవిష్కరించబడింది. అది రాజ్య శాసనాలకు అతీతంగా వుండేందుకు అవకాశం లేదు. ప్రశ్న చాలా సంక్లిష్టమైనది. దానికి క్రింది విధంగా సంక్షిప్తంగా సమాధానం చెప్పాలి. ప్రస్తుత రీతిలో పరివార్ శక్తులు అప్రతిహతంగా వినాశనాన్ని సృష్టించటం కొనసాగుతుంద నుకుందాం. రాజ్యాంగ వ్యవస్థల్లో ఎక్కువ

భాగం ఆర్‌యస్‌యస్ అధీనంలోకి పోతున్నాయని భావిద్దాం. అయిప్పటికీ ఇప్పటి నుండి మూడు సంవత్సరాల వరకూ ఆర్‌యస్‌యస్ తన వ్యవస్థల ద్వారా క్షేత్రస్థాయి సమాచారాల సేకరణకు పూను కుంటుంది. ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరైనా బిజెపి గెలుపుకు అవకాశాలు లేవన్న సమాచారం అందిందని అనుకుందాం. అపుడు ఆర్‌యస్ యస్ వెనుకడుగు వేస్తుందా? ఓటమిని అంగీకరిస్తుందా? ప్రస్తుతం తమ అధీనంలోని తనకు అనుగుణమైన రీతిలో వినియోగించు కుంటున్న కీలకమైన అధికారాలను వదులు కుంటుందా? అసాధారణ సాధనాలతో తమ అధికారాన్ని నిర్ధారించుకుంటుందా? ఆర్‌యస్ యస్ తప్పుడు పనులకు పురిగొల్పటం చాలా ఎక్కువ. 2024 పార్లమెంటు ఎన్నికలు దాని శతజయంతి వుత్సవాలకు ఒక సంవత్సరం ముందే జరుగుతాయి. ఓటమి నేపథ్యంలో ఆ వుత్సవాలను జరుపుకుంటుదా?

> **“2019 అనంతర ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలంటే, మొదట 2014 నాటి ప్రధాన లక్షణాలను అవలోకించాలి. స్వతంత్ర భారత దేశ రాజకీయ చరిత్రలో మొట్టమొదటి సారి యావత్ బడా పెట్టుబడిదారీ వర్గం ఒక రాజకీయపార్టీ వెనుక, ప్రత్యేకంగా ఒక వ్యక్తి నరేంద్రమోడీ వెనుక సమీకరించబడ్డారు. రాహుల్ బజాజ్ వంటి బహు కొద్దిమంది అందుకు మినహాయింపు.”**

**2014 ప్రధాన లక్షణాలు :**

2019 అనంతర ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలంటే, మొదట 2014 నాటి ప్రధాన లక్షణాలను అవలోకించాలి. స్వతంత్ర భారత దేశ రాజకీయ చరిత్రలో మొట్టమొదటి సారి యావత్ బడా పెట్టుబడిదారీ వర్గం ఒక రాజకీయపార్టీ వెనుక, ప్రత్యేకంగా ఒక వ్యక్తి నరేంద్రమోడీ వెనుక సమీకరించబడ్డారు. రాహుల్ బజాజ్ వంటి బహు కొద్దిమంది అందుకు మినహాయింపు. అదే స్థాయి మద్దతు 2019లో కూడా కొనసాగింది. భారత జాతీయ కాంగ్రెస్ మరణాంతకమైన, ఆకస్మిక పతనం మోడీ ఎన్నికల కంటే ఎంతగానో ఆశ్చర్యకర మైనది. అదే కాంగ్రెస్ పార్టీ ఒక శతాబ్ద కాలానికిపైగా దేశ రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయించింది. ఆ ఎన్నికల్లో దాని ప్రాతినిధ్యం 206 నుండి 44స్థానాలకు పడిపోయింది. 10 సంవత్సరాల యుపిఎ పాలన అనంతరం ఆ పార్టీకి ఈ పరిస్థితి ఏర్పడింది. 2019లో అదనంగా ఎనిమిది సీట్లు పెంచుకుని 52 స్థానాలకు చేరింది. కానీ దాని ప్రతిష్ఠాత్మక కాలం ముగిసింది. తిరిగి పునరుజ్జీవనం పొందే అవకాశాలు కన్పించటం లేదు.

ఎన్నికల పరంగా వామపక్షాలు క్రమంగా, నెమ్మదిగా తరిగి పోయాయి. సిపిఐ(యం) 2004లో 42 స్థానాలు గెలుపొందింది. 2009లో ఆ పార్టీ ఓట్ల శాతం స్థిరంగావున్నా సీట్ల సంఖ్య 16కు తగ్గిపోయింది. 2011 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. 2014 లో తొమ్మిది సీట్లను గెల్చుకుంది. అంతకంటే ముఖ్యంగా దాని ఓట్ల వాటా బాగా పడిపోయింది. 1967తర్వాత చరిత్రలో దాని ఓట్లు శాతం అతి తక్కువ స్థాయికి పడిపోయింది. పశ్చిమ బెంగాల్లోనే అపారమైన నష్టం జరిగినట్లు స్పష్టమౌతున్నది. 2014లో అక్కడ వామపక్షాల ఓట్లు 29.95 శాతం నుండి 2019లో షుమారుగా ఎనిమిది శాతానికి తగ్గాయి. అదే కాలంలో అక్కడ బిజెపి తన ఓట్లను 2015లో 17.02 శాతం నుండి 2019 నాటికి 40.25 శాతానికి పెంచుకుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, కాంగ్రెస్ పతనం కేవలం మితవాదానికే లబ్ది చేకూర్చింది. వామపక్షాలకు మాత్రం కాదు. అంతేకాదు పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాల ఎన్నికల వైఫల్యం కూడా బిజెపి ఎదుగుదలకు ఉపయోగపడింది.

అంతకంటే ముఖ్యంగా గతంలో కాంగ్రెసేతర, బిజెపి వ్యతిరేక కూటముల ఏర్పాటులో, తృతీయ కూటమిగా తరచూ వామపక్షం కీలక పాత్ర పోషించింది. కాంగ్రెస్ పతనంతో పాటు, వామపక్షాల ఎన్నికల తరుగుదలతో తృతీయ కూటమి ఏర్పాటుకు అవకాశాలు మృగ్యమయ్యాయి. ప్రస్తుత పార్లమెంటులోని 245 మంది బిజెపి ఏతర సభ్యుల్లో బిజెపి వ్యతిరేకులు ఎందరు వుంటారో కూడా స్పష్టం కాలేదు. ఈ పాటికే దాదాపు కనుమరుగైన యన్‌డిఏలోనే పలువురు వున్నారు. బేరసారాల్లో తాము ఆశించిన ప్రయోజనాలు సమకూరితే మిగిలిన వారిలో కూడా పలువురు బిజెపి వైపు మొగ్గుతారు. అది ఆర్‌యస్‌యస్ విభాగం కనుక బిజెపి కూటమిలో చేరేందుకు అత్యధిక రాజకీయ పార్టీలకున్న సంశయాలు గత శతాబ్దం చివరి లోనే సమసిపోయాయి. వాస్తవానికి ఎన్నికల ప్రాంగణంలో పరివార్‌ను శక్తివంతంగా సవాలు చేయగల అవకాశాలు సన్నగిల్లుతు న్నాయి. అంతర్గతంగా ఆర్‌యస్‌యస్, బిజెపి లకు సమకూరిన బలంవల్లో లేదా ఆధిక్యతవల్లో మాత్రం కాదు. కేవలం ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు విడివడి వుండటమే అందుకు కారణం.

**సంస్థాగత వైఫల్యాలు :**

గత ఐదు సంవత్సరాల మోడీ పాలనలో భారతదేశంలోని కీలకమైన రాజ్యాంగబద్ధ సంస్థలను పక్షపాత పూరితంగా వినియోగిస్తున్నారు. ఉన్నత న్యాయస్థానం మొదలు చిన్న, పెద్ద పట్టణాల్లోని పోలీసు బలగాల వరకూ అది వర్తిస్తుంది. సుప్రీంకోర్టు తన బాధ్యతల నిర్వహణలో నిష్పాక్షిక వైఖరిని విడనాడుతున్నదా ? అందుకు తాజా ఉదాహరణ : 1992 డిసెంబరు బాబ్రీమసీదు కేసు తీర్పులో నిందితులకు ఉపశమనం లభించింది. సాక్ష్యాల ఆధారంగా కాకుండా మత విశ్వాసాలు ఆధారంగా తీర్పులిచ్చారు.

మరొక ఉదాహరణ : జనరల్ బిపిన్ రావత్ ఒక మాజీ సైనిక అధికారి. ఉద్యోగవిరమణ అనంతరం ఆఘమేఘాలపైన మోడీ మంత్రి వర్గంలో అతనికి స్థానం కల్పించారు. దేశ రక్షణ దళాల తొలి ప్రధాన అధికారి (చీఫ్ ఆఫ్ ద డిఫెన్స్ స్టాఫ్)గా మోడీ అతన్ని నియమించాడు. ఇటీవలి పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ప్రతిఘటన వుద్యమంలో భాగస్వాములౌతున్న ప్రజలను తన బాధ్యతలు మరచి తూలనాడాడు. ఆ విధంగా వుద్యోగంలో వున్న ఒక సైనిక జనరల్, దేశ రక్షణ దళాల తొలి ప్రధాన అధికారి తమకు పదవులు కట్టబెట్టిన ప్రధాని మోడి విధానాలను ప్రతిఘటిస్తున్న ప్రజలను బహిరంగంగా విమర్శిస్తున్నారు. భవిష్యత్‌లో ఏం జరుగబోతున్నది ?

మరి పోలీసుల సంగతేమిటి ? ఉత్తరప్రదేశ్ అంతటా క్షుద్ర దేవతా పూజలతో మతోన్మాద హింసకు పాల్పడుతున్నారు. అదే విధంగా ఆలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియాలోనూ హాస్టళ్ళు, గ్రంథాలయాల్లోకి పోలీసులు అక్రమంగా ప్రవేశిస్తున్నారు. టియర్ గ్యాస్‌ను ప్రయోగిస్తున్నారు. ఆ దృశ్యాలన్నీ రికార్డు చేయబడిన వీడియోలు మనవద్ద

**"గత ఐదు సంవత్సరాల మోడీ పాలనలో భారతదేశంలోని కీలకమైన రాజ్యాంగబద్ధ సంస్థలను పక్షపాత పూరితంగా వినియోగి స్తున్నారు. ఉన్నత న్యాయస్థానం మొదలు చిన్న, పెద్ద పట్టణాల్లోని పోలీసు బలగాల వరకూ అది వర్తిస్తుంది. సుప్రీంకోర్టు తన బాధ్యతల నిర్వహణలో నిష్పాక్షిక వైఖరిని విడనాడుతున్నదా ? అందుకు తాజా ఉదాహరణ : 1992 డిసెంబరు బాబ్రీమసీదు కేసు తీర్పులో నిందితులకు ఉపశమనం లభించింది."**

వున్నాయి. పోలీసులు, గూండాలు ఏకమై బెంగుళూరులో ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రగుహపై దాడిచేసి కొట్టారు. ఎన్నికల పరిశీలకుడు, రాజకీయ కార్యకర్త యోగేంద్ర యాదవ్‌ను జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ గేటువద్ద కింద పడేసి కొట్టి గాయపరిచారు. ఉత్తరప్రదేశ్‌లో మతోన్మాద హింసాకాండ జరిగినపుడు పోలీసులు నిందితులను వదిలేసి బాధితులకు వ్యతిరేకంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఆ సంఘటనల నుండి ఢిల్లీ పోలీసులు ప్రేరణ పొందుతున్నారు. అందుకే జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ముసుగు మనుషుల దాడిలో ఆ విద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షురాలు తల పగిలి రక్తమోడింది. అయినా నిందితులను వదిలేశారు. తీవ్రంగా గాయపడ్డ ఆమెపై పోలీసు అధికారులు కేసు బనాయించారు.

రాజ్యానికి సంబంధించిన నిర్దిష్టమైన సంస్థలను –ఉన్నత న్యాయస్థానాలు, అత్యున్నత సైనిక అధికారులు, అసంఖ్యాకమైన పోలీసు అధికారులు– ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించాలి. ఎందుకంటే సంఘ్‌పరివార్ శక్తులు ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి..

ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో చారిత్రక ంగా నూతన తరహా రాజ్యాలు ఆవిర్భవిస్తున్నట్లు అర్థమౌతున్నది. పెట్టుబడిదారీ రాజ్యానికి రెండు ప్రామాణికమైన ధోరణులున్నాయి. అవి – ఉదారవాద రాజ్యం, ఫాసిస్టు రాజ్యం. రెండింటి లోనూ ఎంపిక చేసుకున్న కొన్ని అంశాల కలయికగానే పైన తెల్పిన నూతన తరహా రాజ్యాలు ఏర్పడు తున్నాయి. వాటికి ప్రజా స్వామ్య అనంతర (పోస్ట్ డెమోక్రటిక్) రాజ్యాలుగా నేను తాత్కాలికంగా నామకరణం చేస్తున్నాను. బహుశా భారత్ కూడా ఆ దిశగానే సాగుతున్నట్లు అనిపిస్తున్నది. ఉదారవాద రాజ్యంలో ఎన్నికలు, పత్రికా స్వేచ్ఛ, అసెంబ్లీలు వంటి పలు సంస్థాగత అంశాలను చెక్కుచెదర కుండా కొనసాగిస్తారు. కానీ రాజకీయ ఉదారవాదపు నిర్మాణాలు పతనమౌతాయని హెచ్చరికలు అందుతున్నా యన్నది వాస్తవం. అతి తీవ్రవాద ఎజండా గల నియంతృత్వ రాజకీయ పార్టీలు ముందు కొస్తున్నాయి. అవి రాజ్యపు వుదారవాద నిర్మాణాలపై ఆధిపత్యం చలాయిస్తున్నాయి. వాటిని మార్చివేస్తున్నాయి. కానీ వాటిని పూర్తిగా రద్దుచేయటం లేదు.

గతకాలపు నాజీల నుండి ఆ మార్పులు ఆర్థికపరమైన జాతీయతా రూపం ధరించటం లేదు. కానీ అవి ఒక నిర్దిష్ట భూభాగానికి పరిమితమైన ఒకజాతి ప్రజలు (బ్లడ్ అండ్ సాయిల్), ప్రాంతం జాతి –తెగల (ఎథినో అండ్ రేషియల్) రూపం తీసుకుంటున్నాయి. నాజీల దృష్టిలో దాని అర్థం ఏమిటి? మైనారిటీలు అందరూ విదేశీయులే. వారు అసలైన జాతి రాజకీయాలను కలుషితం చేస్తున్నారు. వారందరినీ నిర్మూలించాలి. ఈ అంశంపై ఇజ్రాయిల్ పథకాలు ఇలావున్నాయి : "తమ జనాభాలో 20 శాతంగా వున్న పాలస్తీనా ప్రజలను నిరంతరం వేధించాలి. చంపేయాలి. అపుడపుడూ వారిని వికలాంగు లను చేయాలి. అవన్నీ సాధ్యం కానపుడు దేశం నుండి బహిష్కరించాలి. అత్యధికులను కఠినమైన ఆంక్షలతో కూడిన ద్వితీయశ్రేణి పౌరులుగానే వుంచాలి".

ఆర్‌యస్‌యస్ ప్రజాస్వామ్య అనంతర రాజ్యంలో ముస్లింల గురించిన అవగాహనలు ఇలా వున్నాయి : నాజీల నమూనానే అమలు పరచాలి. అవకాశముంటే ఇజ్రాయెల్ వారి ప్రత్యక్ష భాగస్వామ్యంతోనే ఆ పని చేయాలి. ఇక్కడ వాస్తవంగా ఒక సమస్య వున్నది. ఈపాటికే అన్నివిధాలా విధేయులై, పూర్తిగా లొంగిపోయిన ముస్లింలతో పరివార్ శక్తులకు ఎలాంటి సమస్య లేదు. ప్రస్తుత సమస్య, భవిష్యత్‌లో తలెత్తనున్న వివాదమూ ప్రధానంగా హిందూ సమాజంలో నుండే వస్తున్నది.( ఇక్కడ హిందు అనే పదాన్ని చాలా విశాలమైన అర్థంలో వినియోగిస్తున్నాను. దాన్ని మత పరమైన కోణంలో కాకుండా సామాజిక తరగతుల అవగాహనతో వుపయోగించాను. ఈ అంశాన్ని కేవలం కుటుంబ నేపథ్యం, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించినదిగానే పరిగణించాలి.)

మోడీ రెండవసారి అధికారం చేపట్టిన ఆరంభంలోనే ఆర్‌యస్‌యస్ ఎజండాలోని అనేక అంశాలను అలవోకగా అమలు పరచేందుకు పూనుకున్నాడు. అందుకు పలు రాజ్యవ్యవస్థల సహకారం తీసుకున్నాడు : వాటిలో కాశ్మీరు, రామ మందిరం, త్రిపుల్ తలాక్, పౌరసత్వ హక్కులు, వున్నత విద్యా సంస్థలను అదుపు చేయటం వంటి అంశాలు న్నాయి. ఆ విధంగా ఆర్‌యస్‌యస్ ఎజండాకు, బిజెపి విధానాలకు మధ్యగల అంతరాన్ని పూడ్చేందుకే పై చర్యలు ఇంకా వేగవంత మౌతాయి. వాజ్‌పాయి ప్రభుత్వ కాలంలో ఆర్‌యస్‌యస్ నాయకత్వం ఇంత తరచుగా బహిర్గతం కాలేదు. అపుడపుడూ అరుదుగా కన్పిస్తుండేది. కాకుంటే ఇటీవల హైదరాబాద్‌లో వలే, పట్టణాల్లో ఖాకీ యూనిఫాం దళాలతో పాక్షికమైన మిలిటరీ కవాతులను నిర్వహి స్తుండేది. మోడీ మొదటి ప్రభుత్వ కాలంలోనే ఎంతో పద్ధతిగా ఇవన్నీ జరిగాయి. మోడీ ప్రభుత్వంలో సభ్యులైన అనేక


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

> **"ప్రస్తుత సమస్య, భవిష్యత్‌లో తలెత్తనున్న వివాదమూ ప్రధానంగా హిందూ సమాజంలో నుండే వస్తున్నది.( ఇక్కడ హిందు అనే పదాన్ని చాలా విశాలమైన అర్థంలో వినియోగిస్తున్నాను. దాన్ని మత పరమైన కోణంలో కాకుండా సామాజిక తరగతుల అవగాహనతో వుపయోగించాను. ఈ అంశాన్ని కేవలం కుటుంబ నేపథ్యం, సాంస్కృతిక వారసత్వానికి సంబంధించినదిగానే పరిగణించాలి.)"**



**జెఎన్‌యు విద్యార్థులు, అధ్యాపకులపై దాడి చేస్తున్న దుండగులు, ప్రేక్షక పాత్రలో పోలీసులు**

మంది బిజెపి నాయకులు, లోక్‌సభకు, అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులు ఈ పాటికే చాలా క్రమపద్ధతిలో, తరచుగా ఆర్‌యస్‌యస్ భాషనే మాట్లాడు తున్నారు. అలాంటివారు ఆర్‌యస్‌యస్‌లో అనుభవజ్ఞులు కావటం వల్ల మాత్రమే కాదు. అధికార యంత్రంపై తనకున్న పట్టు చాలా బలంగా వున్నట్లు ఆర్‌యస్‌యస్ నమ్ముతున్నది. అందుకే ఆ సంస్థ భావజాలాన్ని, ఆ సంస్థ పేరుతోనే మాట్లాడటం ప్రారంభించారు.

మోడి రెండవసారి పాలన కేవలం నియంతృత్వ స్థాయి నుండి క్రమంగా 'ప్రజాస్వామ్య అనంతర' స్థాయికి కూడా మారవచ్చు. ఉదారవాద రంగులు వెలిసిపోవచ్చు. ఫాసిస్టు పద్ధతులు పదునెక్కవచ్చు. వారి వుద్దేశ్యాలు ఆ విధంగా వుండవచ్చు. తరువాత ఎన్నికల్లో తప్పక గెలుస్తామన్న విశ్వాసం పరివార్‌కు వున్నట్లైతే, ఎన్నికల రాజకీయాలు ఉదారవాద చట్రంలోనే కొనసాగేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. ఆ ఎన్నికల్లో తాము ఓడిపోతామన్న భయం వారికి కల్గితే ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు.

నియంతృత్వ స్వప్నాల వూహాగానాల్లో రెండు అంశాలున్నాయి. ఒకటి. హిందుత్వ భావోద్వేగ స్థితిలోని మూక (మాస్) రాజకీయ వుద్యమం, బహుళ సంఖ్యలోని పరివార్ రంగాలు, సుశిక్షితులైన అంకిత భావం గల ఐదు నుండి పది లక్షల సభ్యత్వం. రెండు, సుప్రీంకోర్టు నుండి దిగువ పోలీస్ బృందాల వరకు వారికి చెప్పుకోదగ్గ విధేయత గల కీలకమైన రాజ్యసంస్థలు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ పోలీసుల భయానక హింసాకాండతో పాటు వారిని ఆవహించిన మతతత్వ పూనకం గురించి కూడా అనేక కథనాలు వెలువడు తున్నాయి. అక్కడే కాదు. కాశ్మీర్‌లోని సైన్యం కూడా తన అధీనంలోని భారీ పౌర అధికార యంత్రాంగాన్ని వినియోగించుకుని అక్కడి ప్రజలపై ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్నది.

వేరొక వైపున భారతదేశం ప్రాంతాలు, భాషలు, ప్రజల నమ్మకాలు, ఆచారాలు, రాజకీయ అనుబంధాలు చాలా భిన్నమైనవి. అందుకే ఏకవ్యక్తి ఇష్టాలకు అనుగుణంగా భిన్నత్వాలను మార్చటం అసాధ్యం. డజన్లకొద్దీ భాషలు, మాండలికాలు కలిగి, 130 కోట్ల మంది ప్రజలతో కూడిన భారత్ చాలా విశాలమైనది. నాజీ జర్మనీలో కేవలం ఐదు కోట్లమంది మాత్రమే ఒకే భాష మాట్లాడేవారు. సమీకృత హిందు సమాజమన్నది కూడా కట్టుకథే. అందులో ఏదైనా మంచివుండి వుంటే అది హిందు మాత్రం కాదు. మిగిలినదంతా బ్రాహ్మణత్వ నిషేధాజ్ఞల సాంప్రదాయాలు వున్నప్పటికీ, ప్రధానంగా విశ్వాసాల అంశంలో ఒక భిన్నత్వాల సాలెగూడులా వుంది. విద్యావంతులున్న అత్యధిక పట్టణ భారతం వామపక్ష వుదారవాదులతోను, వామపక్ష భావజాలంపై ఆధారపడి పెరిగింది. ఆ భావాలు చాలా లోతుగా చొరబడ్డాయి. ప్రతివారి పౌరసత్వాన్నీ పరిశీలించాలన్న పథకాన్ని ప్రకటించటంతో స్వచ్ఛందంగా వెల్లువెత్తుతున్న తిరుగుబాటు ఉద్యమాలు ఒక నగరం నుండి మరో నగరానికి వ్యాపిస్తున్నాయి. ప్రధానంగా వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడటానికి వ్యతిరేకంగా తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమౌతున్నది.

### ముగింపు

పై పేరాలోని చివరి వాక్యం మోడి రెండవ ఇన్నింగ్స్ ఆరంభంలోనే తలెత్తిన ఒక ప్రక్రియను సూచిస్తున్నది. అందుకు భిన్నంగా ఈ వ్యాసంలో అలాంటివేవీ ఎక్కువగా చర్చించబడలేదు. పౌరసత్వాలను పరిశీలించే సమస్యలపై విశాలమైన విశ్వవిద్యాలయాల ప్రాంగణాల నుండి, పేద మధ్యతరగతి ముస్లింలుండే పేటల పరిసరాల వరకూ దేశంలోని పలు ప్రాంతాల్లో భిన్న ఛాయల విశిష్టమైన తిరుగుబాట్లు కన్పిస్తున్నాయి. పౌరసత్వాన్ని పరిశీలన చేయటం, మత ప్రాతిపదికపైన కొందరికి పౌరసత్వం మంజూరు చేయుటం, మరి కొందరికి తిరస్కరించటం సమస్యపై ఇవి జరుగుతున్నాయి. ఇలాంటివన్నీ పలు రకాల ఇతర సమస్యలన్నింటితో ముడివడి వున్నాయి. ఏ రాజకీయ పార్టీ కూడా ఈ తిరుగుబాట్లకు నాయకత్వం వహించటం లేదు. నిరసనలు, సమీకరణల్లో కేవలం వామపక్షాలు మాత్రమే చురుగ్గా ఉన్నాయి. విశ్వవిద్యాలయాల ప్రాంగణాలతో పాటు దేశవ్యాపితంగా అనేక బహిరంగ ప్రదేశాల్లో కూడా జరుగుతున్న ఈ తిరుగుబాట్లకు మొత్తం నూతనతరం యువతే బాధ్యత వహిస్తున్నది. ఈ సంవత్సరం జనవరి 8వ తేదీన దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె జరిగింది. ఇరవై ఐదు కోట్లమందికి పైగా కార్మికులు పాల్గొన్న ఈ సమ్మె మానవాళి చరిత్రలోనే అతి పెద్దది. అది ఒక భారీ స్థాయి కార్మిక సమ్మెతో పాటు విస్తారమైన ప్రజా తిరుగుబాటు కూడా. అవి రెండూ ఒకదానిని ఒకటి బలపరచుకొనే విధంగా కలసి పోతాయా? అలా జరిగితే వాటి శక్తి అపారమైనదిగా ఉంటుంది.

**అనువాదం: వై సిద్ధయ్య**

మతోన్మాదం

# తిరోగమనమే హిందుత్వ లక్ష్యం

ఎ. కోటిరెడ్డి



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

హిందుత్వను గురించి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రచారం చేస్తున్నాయి. భారతదేశం హిందువులకు మాత్రమే చెందిన దేశమని, ఇతర మతాలకు చెందిన వారెవరైనా ఈ దేశంలో నివసించాలంటే హిందువుల ఆధిపత్యాన్ని అంగీకరించాలని చెబుతున్నారు. హిందుమత పరిరక్షణ గురించి చెబుతున్న ప్పటికీ, పెరుగుతున్న కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయటం ఈ విధానాలలో ప్రధానాం శంగా ఉంది. హిందుత్వను మొదటగా విడి సావర్కర్ రూపొందించి ప్రచారంలో పెట్టాడు. ఈనాడు హిందుత్వ ఆధారంగా దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలను పునర్నిర్మించాలని చెప్పటంతో పాటు సావర్కర్ ను అత్యున్నత దేశభక్తుడని, జాతీయోద్యమంలో త్యాగాలు చేశాడని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది. జాతిపితగా గాంధీజీని పక్కకు నెట్టి ఆ స్థానంలో సావర్కర్‌ను ప్రతిష్ఠించాలని సంఘ్ పరివార్ ప్రయత్నం చేస్తున్నది. ఇందుకు తీవ్రమైన వ్యతిరేకత ఎదురుకావటంతో దీనిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. సంఘ్ పరివార్ ప్రయత్నానికి ఇంత తీవ్రమైన వ్యతిరేకత రావటానికి సావర్కర్ చరిత్రే కారణం. జాతీయోద్యమంలో పాల్గన్న సావర్కర్‌కు బ్రిటిష్ ప్రభుత్వం జీవితఖైదు విధించి అండమాన్‌లోని సెల్యూలర్ జైలుకు పంపింది. అండమాన్ సెల్యూలర్ జైలులో జీవితకాల శిక్ష అనుభవించటానికి వెళ్ళిన సావర్కర్ సంవత్సరం కూడా గడవక ముందే బ్రిటిష్ ప్రభుత్వానికి లొంగిపోయాడు. తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని వేడుకొంటూ బ్రిటిష్ ప్రభుత్వానికి లేఖలు రాశాడు. జైలు నుండి విడుదలైన తర్వాత బ్రిటిష్ వారి ప్రయోజనాల కు అనుగుణంగా పనిచేస్తూ జాతీయోద్యమానికి ద్రోహం చేశాడు. రెండవ ప్రపంచయుద్ధం సందర్భంలో జాతీయోద్యమం అంతా బ్రిటిష్ వారిని వ్యతిరేకిస్తుంటే బ్రిటిష్ వారికి సైనికులను రిక్రూట్ చేయటంలో తోడ్పడటం, స్థానిక ప్రభుత్వాలలో కొనసాగుతూ బ్రిటిష్ ప్రభుత్వాని కి మద్దతుగా వ్యవహరించాడు. సావర్కర్ ప్రబోధించిన, నేడు బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న హిందుత్వ విధానాల పర్యవసానాలు వినాశకరంగా ఉంటాయి.

వర్గ పోరాటాన్ని దారి తప్పించి, పెట్టుబడి దారులు, సామ్రాజ్యవాదులు చేస్తున్న దోపిడీని కాపాడటం సంఘ్ పరివార్ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. అందుకోసం ఒక నకిలీ శత్రువును ఎన్నుకోవటం ద్వారా వర్గ పోరాటాన్ని దారి తప్పించటం ఈ విధానాలలో ప్రధానమైనది. జర్మనీలో హిట్లర్ అదేచేశాడు. కార్మికవర్గం నుండి పెట్టుబడిదారీ వర్గపాలనకు ప్రమాదం ఎదురైనపుడు వర్గ పోరాటాలను దెబ్బతీయ టానికి ఇతర మార్గాలు ఏవీ పనిచేయలేదు. అపుడు జర్మన్ ప్రజలకు యూదులను శత్రువు లుగా చూపుతూ జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టా డు. అరాచక మూకలను కూడగట్టి, అర్ధ సైనికదళాలను సమీకరించి సంఘటిత కార్మిక వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేశాడు. అదే విధమైన ఎత్తుగడలను ఈరోజు సంఘ్ పరివార్ అనుసరి స్తున్నది. జర్మనీలో ఫాసిస్టులు చేసిన విధంగానే ఇక్కడ కూడా దేశంలోని శ్రామికప్రజలను దోపిడీ చేస్తున్న పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద శక్తులను రక్షించటం కోసం ముస్లింలను శత్రువు లుగా చూపుతున్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా దేశప్రజలను సమీకరించటం, ఈ క్రమంలో శ్రామికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయటం, యువతను సమీకరించి ఆయుధ శిక్షణ ఇవ్వటం, అరాచకమూకలను పోగుచేసి ముస్లిం లపై దాడులు, హత్యలు చేయించటం వీరి కార్యక్రమాలలో ప్రధానమైనవి.

దేశంలో పెట్టుబడిదారీ వర్గదోపిడీ తీవ్రం కావటంతో కార్మికులు ఇతర శ్రామికప్రజల దరిద్రం పెరుగుతున్నది. ఈ దోపిడీకి వ్యతిరేక ంగా కార్మికవర్గం, రైతాంగం, ఇతర శ్రమ జీవులు పోరాటాలలోకి వస్తున్నారు. సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత దేశ వ్యాపితంగా జరుగుతున్న కార్మికవర్గ సమ్మెలు, రైతాంగ పోరాటాలు, ప్రభుత్వరంగ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు, ఇతర వర్గాలు, తరగతుల ప్రజల ఆర్థిక, సామాజిక పోరాటాలు ఈ విషయాలను స్పష్టం చేస్తున్నాయి. ఈ పోరాటాలను నిలువరించగల శక్తి కాంగ్రెస్‌కు, ఇతర ప్రాంతీయ బూర్జువా పార్టీలకు లేదు. ఇటువంటి వర్గ పోరాటాలను నిరంకుశంగా అణచివేసి, పెట్టుబడిదారుల ప్రయోజనాలను రక్షించగలిగిన శక్తి సంఘ్ పరివార్‌కు మాత్రమే ఉంది. అందుకే దేశంలోని పెట్టుబడిదారులందరూ సంఘ్ పరివార్‌కు మద్దతిస్తున్నారు.

### భారత జాతీయత

సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్న హిందుత్వ దేశంలోని ముస్లిం, క్రైస్తవ తదితర మైనారిటీ మతాలకు చెందిన ప్రజలతో పాటు హిందుమతంలోని దిగువ కులాల ప్రజలకు కూడా వ్యతిరేకమైనది. కోట్లసంఖ్యలో ఉన్న మెజారిటీ హిందు ప్రజలకు హిందుత్వతో ఎటువంటి ఉపయోగం లేకపోగా, అది వారి ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. బ్రిటిష్ వారు మన దేశాన్ని ఆక్రమించుకోవటాన్ని ప్రారంభించినప్పటి నుండి 1947 ఆగస్టు 15న దేశం విడిచి వెళ్ళేవరకు బ్రిటిష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల ద్వారా భారత జాతీయవాదం ఆవిర్భవిం చింది. భారత జాతీయవాదం భారతదేశంలో నివసిస్తున్న వివిధ మతాలు, భాషలు, జాతులకు చెందిన ప్రజలు అందరిని సమానహక్కులు కలిగిన భారతీయులుగానే పరిగణించింది. భారతదేశంలో నివసిస్తున్న పౌరులందరికీ కుల, మతాలతో నిమిత్తం లేకుండా సమానహక్కులు సంక్రమిస్తాయని జాతీయోద్యమం ప్రకటిం చింది. జాతీయోద్యమం ప్రవచించిన విధంగానే

స్వాతంత్ర్యానంతరం దేశపౌరులందరికీ సమాన హక్కులను కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించారు.

దేశ ప్రజానీకంలోని సామాజికంగా బలహీనవర్గాల వారికి ప్రత్యేకహక్కులను కూడా కల్పించారు. తమ జనాభా శాతం ప్రాతిపదికగా దళితులు, గిరిజనులకు రాజకీయ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించారు. పార్లమెంటు, అసెంబ్లీ, స్థానికసంస్థలు, విద్య, ఉద్యోగ రంగాలలో కూడా రిజర్వేషన్లు కల్పించారు. ఫలితంగా దళితులు, గిరిజనులు చట్టసభలకు ఎన్నిక అవటం, ఉన్నతోద్యోగాలు నిర్వహించటం జరుగుతున్నది. అన్ని రాష్ట్రాల లో మంత్రులుగానూ, వివిధ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు అవుతున్నారు. దళితుడైన రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి అయ్యాడు. ఈ విధంగా ప్రజాస్వామ్య, లౌకిక భారతదేశంలో దిగువ కులాల ప్రజలకు రాజకీయ హక్కులు సంక్రమించాయి. వారు అధికారంలో కూడా భాగస్వాములౌతున్నారు.

ఆర్‌ఎస్ఎస్, బిజెపిలు చెబుతున్న హిందుత్వ లేక సాంస్కృతిక జాతీయవాదం అంటే భారత జాతీయవాదాన్ని నిరాకరించటమే. భారత జాతీయవాదం అంటే మతాలు, భాషలు, జాతులతో నిమిత్తం లేకుండా భారతదేశంలో జన్మించిన వారంతా భారతపౌరులు అవుతారు. దేశంలో పుట్టుకతోనే వారందరికీ సమాన హక్కులు సంక్రమిస్తాయి. లౌకికతత్వం, ప్రజాస్వామ్యం దీనికి పునాదిగా ఉన్నాయి. దేశం వివిధ జాతులు, సంస్కృతులకు నిలయంగా ఉంది. ఐనా అందరూ భారతీయులుగానే ఉన్నారు. దేశ నిర్మాణంలో ఐక్యంగా భాగస్వాములు అవుతున్నారు.

**భారత జాతీయవాదం ఆవిర్భావం**

బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్యమం భారత జాతీయవాదాన్ని ముందుకుతీసుకు వచ్చింది. బ్రిటీష్ వారు మన దేశాన్ని దోపిడీ చేస్తున్న సందర్భంలో తమపై జరుగుతున్న దోపిడీని ఎదుర్కోవటం కోసం దేశంలోని ఉన్నత తరగతుల వారు వివిధ ప్రాంతాలలో అసోసియేషన్లు ఏర్పాటు చేసుకొని, ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసుకునేవారు. ప్రభుత్వం వారి విజ్ఞప్తులను పట్టించుకొనేది కాదు. అపుడు ప్రభుత్వానికి మరింత బలంగా తమ డిమాండ్లను వినిపించటం కోసం దేశవ్యాపిత సంస్థగా కాంగ్రెస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. దేశంలోని పెట్టుబడిదారులు, బడా వ్యాపారులకు ప్రయోజనం కల్పించే డిమాండ్లను కాంగ్రెస్ ముందుకు తీసుకురావటం ప్రారంభించింది.

> **"ఈ క్రమంలో కులాలు, మతాలకు సంబంధం లేకుండా మొత్తం భారతీయులందరినీ సమీక రించటానికి ప్రయత్నం చేశారు. సామాన్య ప్రజలను సమీకరించటంలో భాగంగా దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల ప్రజల డిమాండ్లను ముందుకు తెచ్చారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులు, చేతివృత్తుల వారు తదితర వర్గాలన్నీ జాతీయోద్యమంలో పాల్గొన్నాయి."**

కాంగ్రెస్ ముందుకు తెస్తున్న డిమాండ్లు బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న దోపిడీకి కొంతమేరకు అడ్డుకట్ట వేస్తాయి. కాబట్టి కాంగ్రెస్ ముందుకు తెస్తున్న అత్యధిక డిమాండ్లను బ్రిటిష్ ప్రభుత్వం వ్యతిరేకించింది. అపుడు కాంగ్రెస్ నాయకత్వం తమ కోర్కెలను సాధించుకోవటం కోసం ప్రజలను సమీకరించటానికి పూనుకున్నది. ఈ క్రమంలో కులాలు, మతాలకు సంబంధం లేకుండా మొత్తం భారతీయులందరినీ సమీకరించటానికి ప్రయత్నం చేశారు. సామాన్య ప్రజలను సమీకరించటంలో భాగంగా దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల ప్రజల డిమాండ్లను ముందుకు తెచ్చారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులు, చేతివృత్తుల వారు తదితర వర్గాలన్నీ జాతీయోద్యమంలో పాల్గొన్నాయి. హిందువులు, ముస్లింలు, సిక్కులు, పార్శీలు, క్రైస్తవులు తదితర అన్ని మతాలకు చెందినవారూ బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో భాగస్వాములైనారు. ఈ ఉద్యమంలో వివిధ పార్టీలు, సంస్థలు, విభాగాలకు చెందినవారు పాల్గన్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్ పార్టి నాయకత్వం వహించింది. ఈ దృక్పధానికి, పోరాటాలకు గాంధి, నెహ్రూలు ప్రధాన ప్రతినిధులుగా నిలిచారు.

ఈ విధంగా ప్రజలందరినీ సమీకరించి పోరాటాలు నిర్వహిస్తున్నందుకు గాంధీజీని సంఘ్ నాయకులైన గోల్వాల్కర్, సావర్కర్‌లు ఖండించారు. ముస్లిం వ్యతిరేకతను ప్రజలలో పెంచకుండా వారిని కూడా పోరాటంలో కలుపుకెళుతున్నందుకు అత్యంత నీచంగా దూషించారు. "మన ప్రజల్లో మగతనాన్ని కత్తిరించి వేసేందుకు ప్రతిజ్ఞ పట్టినట్లు మన నాయకులున్నారు. అయితే ఇదేదో చరిత్రలో ప్రమాదవశాత్తూ జరిగినది కాదు. గత పన్నెండు వందల సంవత్సరాల చరిత్రలో పూర్వీకులు జాతి గౌరవాన్ని అమ్మేశారు. విదేశీయులకు మన స్వాతంత్ర్యాన్ని అమ్మేశారు. ఎంతో కాలంగా దేశంలో పాతుకుపోయిన శత్రువులతో చేతులు కలిపారు. వారి వ్యక్తిగత స్వార్థాన్ని, అహంకారాన్ని, శత్రుత్వాన్ని తృప్తి పరుచుకునేందుకు మన మతాన్ని కుదువ పెట్టి, తమ రక్త సంబంధీకుల గొంతులను నరికారు. ఇలాంటి నాయకత్వపు అత్యున్నత రూపమే ఇప్పటి నాయకత్వం". ఈ విధంగా బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలను వ్యతిరేకించటం, ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టే విధానాలను వీరు అనుసరించారు.

**అభివృద్ధిని అడ్డుకోవటానికి సనాతనవాదుల ప్రయత్నాలు**

భారత జాతీయవాద దృక్పధానికి ప్రతిగా సనాతన ఆచారాలను బలపరిచేవారు హిందు మత దృక్పధాన్ని ముందుకు తెచ్చారు. ఇటువంటి వారంతా కలిసి 1915 ఏప్రిల్ 9న హరిద్వార్‌లో హిందు మహాసభను స్థాపించారు. హిందు సమాజంలో పశ్చిమ దేశాలకు చెందిన ఉదారవాద భావజాలం చొరబడకుండా, సనాతన హిందు ఆచారాలు దిగజారకుండా నివారించేందుకు రూపొందించిన మతసంస్థగా ఇది పనిచేసింది. తర్వాత 1923లో మదన మోహన మాలవ్యా వారణాసిలో దీనిని పునరుజ్జీవింపచేశాడు. దేశాన్ని ఆక్రమించుకొని ప్రజలను పీడిస్తూ పరిపాలన సాగిస్తూ, దేశసంపదను బ్రిటన్‌కు తరలించుకు వెళుతున్న బ్రిటిష్ ప్రభుత్వం వీరికి శత్రువు కాదు. దేశంలోని సామాన్య హిందువులు, మిగతా మతాలకు చెందిన ప్రజలతో పాటు బ్రిటిష్ వారి దోపిడీకి గురవుతున్న ముస్లిం మతస్తులను మాత్రమే హిందుత్వవాదులు శత్రువులుగా చూస్తున్నారు. హిందువులకు ముస్లింలకు మించిన శత్రువులు లేరని, ముస్లింలు మనదేశంపై దాడిచేసి దేశాన్ని ఆక్రమించుకున్నారని, హిందువులను ఓడించారని, ప్రజలను చిత్రహింసలు పెట్టారని, మహిళలను మానభంగం చేశారని, హిందువులకు బ్రిటిష్ వారు శత్రువులు కాదని, ముస్లింలే శత్రువులని ప్రచారం ప్రారంభించారు. ప్రజా

**"గత కాలంలో ఇవన్నీ బ్రాహ్మణు లు, కొద్దిమంది ఉన్నత తరగతులకు చెందిన వారు మినహా అపారమైన సంఖ్యలో ఉన్న హిందుమతంలోని సామాన్యులకు సంబంధం లేని అంశాలు. ఆ విధంగా సావర్కర్ బ్రాహ్మణ వాదాన్ని హిందు మతాన్ని అనుసరించే ప్రజలం దరికీ ప్రాతినిధ్యం వహించేదిగా ముందుకు తీసుకువచ్చాడు. బ్రాహ్మణులు చేసేవాటినే హిందువులందరూ చేస్తున్నట్లు చెప్పాడు."**



జాతీయోద్యమ ఐక్యంగా పాల్గొన్న వివిధ కులాలు, మతాలకు చెందిన ప్రజలు

స్వామ్య, లౌకిక సూత్రాలపై ఏర్పడిన భారత రాజకీయ వ్యవస్థను సంపూర్ణంగా మార్చటం, భారత జాతీయ భావనను తోసిపుచ్చటం, హిందుత్వను ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రతిష్ఠించటం వారి లక్ష్యం. విద్వేషాన్ని సృష్టించే హిందుత్వ పదానికి 1923లో రూపకల్పన చేసినవాడు సావర్కర్.

ఆ తర్వాత 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ –ఆర్‌ఎస్‌ఎస్– ఏర్పడింది. ఏర్పడిన నాటి నుండి సనాతన పద్ధతులలో హిందు మతాన్ని కొనసాగించాలని, అందుకోసం యువకులకు సాయుధ శిక్షణ ఇస్తున్నది. హింసాపూరితంగా హిందుమత వైభవాన్ని పునరుద్ధరించాలని ప్రకటిస్తున్నది. ఈ సాయుధ శిక్షణ, హింసాపూరితంగా హిందుమత పునరుద్ధరణకు చేస్తున్న ప్రయత్నాలు పైకి ముస్లింలకు వ్యతిరేకంగా కన్పిస్తున్నప్పటికీ వాస్తవంగా కార్మికవర్గ ఉద్యమాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినవి. దానితో పాటు అభ్యుదయ భావాలు వెనుకపట్టుపట్టి, మతమౌఢ్యం పెరగటం హిందుమతంలో దిగువకులాల ప్రజలను కూడా మరింత సామాజిక అణచివేతకు గురిచేస్తుంది.

బ్రిటిష్ వారు మన దేశాన్ని ఆక్రమించుకున్న తర్వాత ఆధునిక విద్య, ఆధునిక భావాలు సమాజంలో వ్యాపించటం ప్రారంభమైంది. అనేకమంది ఆధునిక విద్యను నేర్చుకోవటం, నూతన భావాలను ప్రచారం చేయటం ప్రారంభించారు. స్త్రీ విద్య, వితంతు వివాహాలు తదితర సంఘ సంస్కరణోద్యమాలు ప్రారంభమయాయి. దీనితో ఫ్యూడల్ శక్తుల ఆధిపత్యం తగ్గటం ప్రారంభమైంది. తమ ఆధిపత్యన్ని పరిరక్షించుకోవటం కోసం ఈ మార్పులు హిందుమతాన్ని నాశనం చేస్తున్నాయని సనాతనవాదులు ప్రచారం చేయటం ప్రారంభించారు. మతం పేరుతో మినహా మరో విధంగా తమకు మద్దతు సమీకరించుకోవటం సాధ్యం కాదు కాబట్టి మతాన్ని రక్షించుకోవటం అనేపేరుతో 1913లో మొదటగా హిందు మహాసభను ఏర్పాటు చేశారు. తర్వాత 1923లో మదనమోహన మాలవ్యా దానిని పునరుజ్జీవింపజేశాడు.

హిందువులను ఐక్యం చేయాల్సిన ఆవశ్యకత, వారి మధ్య ఉన్న సంబంధాలను గురించి సావర్కర్ ఈ విధంగా చెప్పాడు. "పితృదేశం పట్ల ప్రేమబంధం ఒక్కటే కాదు. మన గుండెల్లో చప్పుడు, మన అభిమానాల్లో నిండిన ఆప్యాయతలు, మన నరాల్లో పారే రక్త సంబంధంతో పాటు మన మహత్తర నాగరికతకు మనం సమర్పించే సమాన గౌరవం అనేబంధం కూడా హిందువులను కలిపి ఉంచుతుంది. అలా కలిపి ఉంచేది హిందు సంస్కృతి. ఆ సంస్కృతి భాష సంస్కృతం. ఆ సంస్కృతి వ్యక్తీకరణ మనజాతి చరిత్రలో ఉత్కృష్టమైనది. పరిరక్షణకు, అర్హమైనదానిని కాపాడేందుకు ఎన్నుకునే సాధనం. హిందు సంస్కృతి అనేదానిని సంస్కృత పదం సంస్కృతి అనేదానితోనే అత్యుత్తమంగా వ్యక్తీకరించగలం. మనం ఒక జాతి. ఒకే సంస్కృతిని కలిగి ఉన్నాం. అందు వల్లనే మనమంతా ఒకటి". (హిందుత్వ–హిందుయిజం వ్యాసంలో ఎ జి నూరాని ఉటంకింపు).

సావర్కర్ హిందుజాతి అని ఎవరిని గురించి చెబుతున్నాడో దీనిలోనే స్పష్టమౌతున్నది. అభిమానాలు, ఆప్యాయతలు, సంస్కృత భాష, హిందు సంస్కృతిని సంస్కృతం ద్వారానే వ్యక్తీకరించగలమని చెప్పటం తదితరాలు ఆయన చెబుతున్న జాతికి అర్థాన్ని చెబుతున్నాయి. గత కాలంలో ఇవన్నీ బ్రాహ్మణులు, కొద్దిమంది ఉన్నత తరగతులకు చెందిన వారు మినహా అపారమైన సంఖ్యలో ఉన్న హిందుమతంలోని సామాన్యులకు సంబంధం లేని అంశాలు. ఆ విధంగా సావర్కర్ బ్రాహ్మణ వాదాన్ని హిందు మతాన్ని అనుసరించే ప్రజలం దరికీ ప్రాతినిధ్యం వహించేదిగా ముందుకు తీసుకువచ్చాడు. బ్రాహ్మణులు చేసేవాటినే హిందువులందరూ చేస్తున్నట్లు చెప్పాడు. ఇది వాస్తవాలను వక్రీకరించటం ద్వారా బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని కొనసాగించటానికి మిగతా హిందు ప్రజల మద్దతును కూడగట్టటానికి ఉద్దేశించినది. (బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకిస్తున్నామంటే బ్రాహ్మణులందరినీ వ్యతిరేకించటం కాదు. ఎవరైతే సమాజంపై బ్రాహ్మణాధిపత్యాన్ని సమర్థిస్తూ దిగువ కులాల ప్రజలను అణచివేయటానికి పూనుకుంటున్నారో వారికి వ్యతిరేకంగా మాత్రమే ఉద్దేశించింది. బ్రాహ్మణ వాదాన్ని వ్యతిరేకించే వారిలో అనేకమంది బ్రాహ్మణులు ఉన్నారు. దిగువ కులాలకు చెందిన వారిలో కూడా అనేకమంది బ్రాహ్మణ వాదాన్ని బలపరిచేవారున్నారు).

బ్రాహ్మణులు, కొద్దిమంది రాజులు మినహా సంస్కృత భాష ఏనాడూ సామాన్యులు మాట్లాడిన భాషకాదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులైన పై మూడు వర్ణాలు మినహా శుద్రవర్ణంలోని వారిని విద్యకే దూరం చేశారు. విద్య నేర్చుకున్నాడని శూద్రుడైన శంభూకుని తల నరికించారు. శూద్రులు వేదాలను ఉచ్ఛరించటం విన్నా వారి చెవుల్లో సీసం పోయమని చెప్పారు. హిందువులలో భాగమైన శూద్రులను ఈ విధంగా వేరు చేసిన తర్వాత ఉమ్మడి సంస్కృతి, సమాన గౌరవానికి స్థానం ఎక్కడ? ఏ హిందువుల

మధ్య ఉమ్మడి సంస్కృతి, సమాన గౌరవం ఉంది? బ్రాహ్మణులకు, క్షత్రియులకు మధ్య సమాన గౌరవం ఉందా? క్షత్రియులు, వైశ్యులకు మధ్య, వైశ్యులు, శూద్రులకు మధ్య సమాన గౌరవం ఉందా? బ్రాహ్మణులతో సహా దిగువకులాల వారి వరకు హిందుమతంలో భాగంగా ఉన్న అంటరాని వారిని కనీసం మనుషులుగా నైనా చూశారా? చాతుర్వర్ణ వ్యవస్థలో వివిధ వర్ణాల మధ్య సమాన గౌరవానికి అవకాశం ఎక్కడుంది? పైనున్న ప్రతివర్ణం కిందనున్న వర్ణాలను హీనంగా చూడలేదా? పై వర్ణాలకు చెందిన తమకు కింది వర్ణాల వారు తగిన గౌరవం ఇవ్వలేదను కున్నపుడు వారిపై తీవ్రమైన అణచివేత, హింసాకాండను సాగించలేదా? చివరికి తాము శత్రువులుగా ప్రచారం చేస్తున్న మొగలులపై విజయం సాధించిన శివాజీని పట్టాభిషిక్తుని చేయటానికి కూడా శూద్రుడని ఆటంకపరచి అవమానించలేదా? ఈ విధంగా బ్రాహ్మణులు దిగువ వర్ణాలు, కులాల ప్రజలందరినీ పీడిస్తూ, అవమానిస్తూ తమ పెత్తనాన్ని కొనసాగించారు. ప్రజలందరినీ అవమానించిన, పీడించిన, దోపిడీ చేసిన బ్రాహ్మణ సంస్కృతే మొత్తం హిందువుల సంస్కృతి అని సావర్కర్ చెబుతున్నాడు. తద్వారా సావర్కర్ హిందుమతంలో ఉన్న వర్ణ, కుల విభజనలను కాపాడటానికి పూనుకున్నాడు.

హిందువుల నరాల్లో పారే రక్త సంబంధం గురించి కూడా సావర్కర్ ఉదహరించాడు. ఇది కూడా అతి సంకుచితమైన అంశాన్ని హిందువులందరికీ సంబంధించిన అంశంగా చెబుతున్నాడు. హిందువులందరి మధ్య రక్తసంబంధం ఎక్కడుంది? ఏ కులానికి ఆ కులాన్ని విడదీసి, కులం దాటకుండా వివాహాలు చేసుకోవాలని ఆంక్షలు విధించారు. ఆంక్షలు దాటిన వారిని కఠినంగా శిక్షించారు. ఈనాటికీ అటువంటి శిక్షలు అమలు జరుపుతున్నారు. బ్రాహ్మణవాదం హిందు సమాజంలో వ్యాపించి కులవివక్షను కొనసా గిస్తున్నది. ఆ వివక్షను ఎదిరించి, కులాలను కాదని ప్రేమించి పెళ్ళి చేసుకున్న వారిని కుటుంబ సభ్యులే హత్యలు చేసేలా ప్రోత్సహి స్తున్నారు. కింది కులాల వారు ఇచ్చిన నీటిని సైతం పైకులాల వారు తాగరు. తాము వినియోగించే బావులు, చెరువుల నుండి నీటిని అంటరాని కులాల వారు స్వయంగా తీసు కోవటాన్ని కూడా సహించలేరు. ఇక హిందువు లందరి మధ్య రక్త సంబంధం ఎక్కడ?

“హిందువులందరి మధ్య రక్తసంబంధం ఎక్కడుంది? ఏ కులానికి ఆ కులాన్ని విడదీసి, కులం దాటకుండా వివాహాలు చేసుకోవాలని ఆంక్షలు విధించారు. ఆంక్షలు దాటిన వారిని కఠినంగా శిక్షించారు. ఈనాటికీ అటువంటి శిక్షలు అమలు జరుపుతున్నారు. బ్రాహ్మణవాదం హిందు సమాజంలో వ్యాపించి కులవివక్షను కొనసా గిస్తున్నది.”

### సంస్కరణోద్యమాలు

దేశంలోని దిగువకులాల ప్రజలు 17,18 శతాబ్దాల కాలం వచ్చేసరికి సామాజి కంగా పైస్థాయికి చేరటం కోసం పోరాటాలు చేయటం ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆ కాలంలో తలెత్తిన భక్తి ఉద్యమాలు, ఇతర సామాజిక ఉద్యమాలలో దీనిని చూడవచ్చు. బ్రిటీష్ వారు వచ్చిన తర్వాత కులాలతో నిమిత్తం లేకుండా అన్ని తరగతుల ప్రజలకు విద్యనేర్పి, ఉద్యోగాలలోకి తీసుకు న్నారు. దిగువ కులాలు, అంటరాని వారుగా ఉన్న అనేకమంది ప్రభుత్వ ఉద్యోగాలు, సైన్యం లో చేరారు. వారి ఆర్థికస్థితి మారటంతో పాటు సామాజిక స్థాయి కూడా పెరిగింది. ఉద్యోగులకు తమకులంలోనూ, సమాజంలో కూడా గౌరవం పెరిగింది. వర్ణ, కుల కట్టుబాట్లు సడలటం ప్రారంభమైంది. భూ సంస్కరణల ఫలితంగా కొద్దిమందికైనా భూములు దక్కటం తదితరాలు కులవ్యవస్థ, సామాజిక విభజనల ను బలహీనపరిచాయి. ఈ మార్పులు ఆర్ఎస్ఎస్ దృక్పధానికి వ్యతిరేకమైనవి. ఈ మార్పులను అడ్డుకోవాలని, సమాజంలో ఉన్న కుల, మత విభజనలను యధాతథంగా కొనసాగించటం, మరింత తీవ్రం చేయటం ద్వారా శ్రామికప్రజలు ఐక్యం కాకుండా నిరోధించి, పెట్టుబడిదారీ వ్యవస్థను, ఫ్యూడల్ సాంప్రదాయాలను కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారు.

దీనికోసం సృష్టించిన నకిలీ శత్రువులే ముస్లింలు. కార్మికులుగానూ, కర్షకులుగానూ ఉన్న హిందువులు, ముస్లింల మధ్య శత్రుత్వం ఏదీలేదు. పెట్టుబడిదారులు, కార్మికులుగా ఉన్న హిందువుల మధ్య వర్గ శత్రుత్వం ఉంది. పెట్టుబడిదారులు, కార్మికుల మధ్య ఉన్న శత్రుత్వాన్ని కప్పిపెట్టటానికి, హిందు-ముస్లింల మధ్యలేని శత్రుత్వాన్ని సృష్టిస్తున్నారు. శత్రువుల పేరుతో బలవంతంగా ముస్లింలను అణచి వేయటం, హిందువులను ఐక్యం చేయటం, వర్ణ, కుల వ్యవస్థలను అమలు జరపటానికే యువకుల కు సాయుధ శిక్షణ ఇస్తున్నారు. అరాచక మూకలను హత్యలు చేయటానికి ప్రోత్సహిస్తున్నారు.

సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్న హిందు ఐక్యత ముస్లిం వ్యతిరేకత ప్రాతిపదికగానే సాధ్యమౌతుంది. అదికూడా చరిత్రలో జరిగిన వాస్తవాలను చెబితే సాధ్యం కాదు. అందుకే హిందుత్వవాదులు నిరంతరం అబద్ధాలను ప్రచారం చేస్తుంటారు. ముస్లింలకు వ్యతిరేకంగా దాడులుచేసి, హింసాకాండను రెచ్చగొట్టి, హత్యలు చేయటం ద్వారా హిందుమతోన్మాదం పెంచటానికి ప్రయత్నం చేస్తున్నారు. హిందుత్వ లో ఇదొకభాగం. ముస్లింలు లొంగిపోయే వరకు హిందువుల ఐక్యతను గురించి ప్రచారం చేస్తారు. ఆ తర్వాత హిందు సమాజంలోని అవ్యవస్థ - అభ్యుదయ మార్పులు-ను సరిదిద్ది, వర్ణ, కుల వ్యవస్థలను, మనుస్మృతిని అమలు చేయటానికి పూనుకుంటారు. ఇపుడు ముస్లింలను లొంగ దీయటానికి ఏ సాయుధ, అరాచక మూకలనైతే వినియోగిస్తున్నారో అవే సాయుధ అరాచక మూకలను రేపు వర్ణ, కులవ్యవస్థను ధిక్కరించే దిగువ వర్ణాలు, కులాలకు చెందిన వారిని బెదిరించి, భయపెట్టి లొంగదీయటానికి ఉపయోగిస్తారు.

అందువలన సావర్కర్ ప్రవచించిన, సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్న హిందుత్వ భావజాలం భారత సమాజాన్ని మరింతగా విభజించటానికి, దేశంలో అమలు జరుగుతున్న పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీని పరిరక్షించటానికి ఉద్దేశించినది. దేశంలోని వివిధ మతాలు, కులాలకు చెందిన ప్రజల మధ్య నిరంతరం శత్రుత్వాన్ని పెంచుతూ వారు సుఖంగా జీవించటానికి అవకాశం లేకుండా చేస్తుంది. అందువలన ప్రజలు హిందుత్వ వెనుక ఉన్న రాజకీయాలను అర్థం చేసుకొని, సంఘ్ పరివార్ కుట్రలను తిప్పికొట్టటానికి పూనుకోవాలి.

❋

ఈ మాసం ప్రత్యేకం

# సంపద, లింగ అసమానతలు

**టి. కె. రాజలక్ష్మి**



రచయిత్రి ప్రముఖ ఆర్థిక విశ్లేషకురాలు

లింగ అసమానతలపై "ప్రపంచ అసమానతల నివేదిక 2020", "ఇండియా అసమానతల నివేదిక 2020", "ఆన్ ఉమెన్స్ బ్యాక్స్" పేరుతో జనవరిలో రెండు ఆక్స్‌ఫాం నివేదికలు విడుదలయ్యాయి. పెరుగుతున్న సంపద కేంద్రీకరణ, పెరుగుతున్న పేదరికానికి, మహిళలపై జరుగుతున్న హింసకు, చెల్లింపులేని సంరక్షణ పనికి మధ్య ఉన్న సంబంధాన్ని ఆక్స్‌ఫాం నివేదిక ఎత్తి చూపింది. ఉద్యోగ ప్రపంచంలో ఉద్యోగాలు సంపాదించడం అంత సులువు కాదు. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యం క్షీణించడం, వేతనం లేని మహిళల శ్రమ పెరగడం ఆందోళన కలిగించే అంశాలుగా మారాయని నివేదిక వెల్లడించింది. పెరుగుతున్న పేదరికంతో పాటు, మహిళలపై హింస, సంపద కేంద్రీకరణ, కూలి ఇవ్వని సంరక్షణ పనికి మధ్య ఉన్న సంబంధం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఇటువంటి సేవలను అందించే బాధ్యత నుండి ప్రభుత్వాలు తప్పుకొని మార్కెట్ శక్తులకు ఇవ్వడం వలన ప్రపంచ సంరక్షణ సంక్షోభం నెలకొంటుందని నివేదికలు చెబుతున్నాయి. వేతనాలు లేకుండా చేసే పనిని మహిళలు నిలిపి వేస్తే మొత్తం మార్కెట్ వ్యవస్థ సంక్షోభంలో పడుతుందని నివేదిక హెచ్చరించింది. అందుకనే మహిళలు చేస్తున్న పనిని ఇప్పుడైనా గుర్తించవలసిన అవసరం ఉన్నదని ఆక్స్ ఫాం తెలిపింది.

దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచంలో అసమానతలు పెరిగాయని "టైమ్ టు కేర్" అనే ఆక్స్‌ఫామ్ నివేదిక చెప్పింది. ప్రపంచంలోని అత్యంత ధనవంతులైన 2,153 మంది దగ్గర 4.6 బిలియన్ల ప్రజల సంపద కంటే రెండు రెట్లు ఎక్కువ సంపద ఉంది. ప్రపంచంలోని ఒక శాతం అత్యంత ధనవంతులు 6.9 బిలియన్ ప్రజల కన్నా రెట్టింపు సంపదను కలిగి ఉన్నారు. పేదరికంతో సమానంగా సంపద కూడా అత్యంత వేగంగా పెరుగుతున్నదని నివేదిక పేర్కొంది. లింగ వివక్షతో ఉన్న ఆర్థిక వ్యవస్థ నమూనా తప్పని తెలిపింది. మనం ఊహించలేని స్థాయిలో సంపద అతి కొద్దిమంది దగ్గర కేంద్రీకృతమై ఉన్నది. ఒక వైపు ఎటువంటి శ్రమ చేయకుండానే సంపన్నుల సంపద ప్రతిరోజూ పెరిగిపోతున్నది. మరో వైపు మహిళలు, యువతులు జీతం లేని 'సంరక్షణ పని' (చిన్న పిల్లలు, వృద్ధుల సంరక్షణ, ఇంటి పనులు)లో నిమగమై ఉన్నారు. వీళ్లు చేస్తున్న పనిని పరిగణనలోకి తీసుకుంటే దాని విలువ సుమారు 10.8 ట్రిలియన్ డాలర్లుగా ఉంటుందని ఆక్స్‌ఫామ్ అంచనా వేసింది. మరో విస్తుగొలిపే విషయం ఏమంటే మహిళలు చేస్తున్న ఈ వేతనం లేని పని ప్రపంచ సాంకేతిక సంస్థలు సంపాదిస్తున్న దానితో పోల్చుకుంటే మూడు రెట్లు ఎక్కువగానే ఉందట.

2019వ సంవత్సర 'ప్రపంచ సంపద నివేదిక'ను అనుసరించి ప్రపంచ జనాభాలో సగానికి పైగా ప్రజలు రోజుకు ఐదున్నర డాలర్ల కన్నా తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. భారతదేశంలో సంపద అసమానతలు పెరుగుతున్నాయి. దేశంలో నేడున్న సంపద అసమానతలు అభివృద్ధి చెందిన దేశాలు 'వర్థమాన' దేశాల కంటే కూడా ఎక్కువగా ఉన్నాయి. 2000–2019 సంవత్సరాల మధ్య కాలంలో అభివృద్ధి చెందిన, 'వర్థమాన' దేశాల్లో సంపద అసమానతలు ప్రతిచోటా పెరుగుతున్నాయి. భారతదేశంలో ఈవాటా 38 శాతం నుంచి 45 శాతానికి పెరిగింది. శత కోటీశ్వరుల సంఖ్య పెరుగుతూ ఉండడం ఆర్థిక వ్యవస్థకు మంచిది కాదు. నిజానికి అది ఆర్థిక వ్యవస్థను రోగగ్రస్తం చేస్తుంది. ఒకసారి సంపద కేంద్రీకృతం అయ్యాక పెరిగి పోతూనే ఉంటుంది. గత పదేళ్లలో శత కోటీశ్వరులు తమ సంపదపై సగటున 7.6 శాతం రాబడిని పొందారని ఆక్స్‌ఫామ్ అంచనా వేసింది.

సంపన్నులపై పన్ను శాతం తగ్గడం, అలాగే చెల్లించాల్సిన పన్నును చెల్లించకుండా కాలయాపన చేయడం వారి సంపద పెరగడానికి కారణం అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా విధించబడుతున్న పన్నులలో 4శాతం మాత్రమే సంపదపై పన్ను ద్వారా వస్తుందని, ఇందులో సుమారు 30 శాతం పన్నును సంపన్నులు చెల్లించడం లేదని ఆక్స్‌ఫామ్ లెక్కలు వేసింది. కార్పొరేట్ పన్ను చాలా తక్కువగా ఉండడం కూడా సంపద పెరగడానికి కారణమైంది. 2011–17 మధ్య వేతనాల్లో వృద్ధి 3 శాతం ఉండగా, సంపన్నుల డివిడెండ్ ఆదాయాలలో 31 శాతంగా వృద్ధి ఉన్నదని ఆక్స్ ఫామ్ పేర్కొన్నది. సమాజంలో ఉత్పత్తి అయిన సంపద విలువతో సంబంధం లేకుండా ఆర్థిక వ్యవస్థ దిగువన ఉన్న వారితో పోల్చితే ఎగువన ఉన్న వారి దగ్గర సంపద భారీగా పెరిగిందని వికటించిన ఆర్థిక నమూనా నివేదిక తెలియజేసింది. మహిళల వేతనాలు చాలా తక్కువగా ఉండడం స్వేచ్ఛా వాణిజ్యానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. మహిళలు, యువతులు చేసే వేతనం లేని శ్రమ కూడా చాలా హెచ్చు స్థాయిలో ఉంది. వేతనం లేని శ్రమ యొక్క ఆర్థిక ప్రయోజనాలు ధనవంతులకే ఉపయోగపడతాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వం చేసే ఖర్చులో కోతల వలన కార్మికులలో ఆరోగ్య సంరక్షణ పెద్ద కొరతగా ఉంది. 2017లో లాన్సెట్ చేసిన "గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్" అధ్యయనం ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 50 శాతం దేశాలలో మాత్రమే నాణ్యమైన సంరక్షణ సేవలను అందించడానికి తగినంత మంది ఆరోగ్య కార్యకర్తలున్నారు.

ఆక్స్ ఫామ్ అంచనాల ప్రకారం మహిళలు, బాలికలు ప్రపంచ వ్యాప్తంగా రోజుకి 12.5 బిలియన్ గంటలు వేతనం లేని శ్రమ చేస్తున్నారు. ఇది ఇంటికి కావలసిన వంట చెరకును సమకూర్చుకోవడం, మంచినీళ్లు తీసుకురావడం, ఇంటిని శుభ్రం చేసుకోవడం, పిల్లలు, వృద్ధులను సంరక్షించుకోవడం లాంటి

విగా ఉన్నాయి. ప్రపంచంలో వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల సంరక్షణకు సంబంధించిన సంక్షోభాలు (కేర్ క్రైసిస్) పెరుగుతున్నాయని ఆక్స్‌ఫామ్ పేర్కొన్నది. పర్యావరణ సంక్షోభం దీనికి తోడవుతున్నది.

జనాభాలో వృద్ధులు ఉన్నప్పటికీ వారి సంరక్షణను ధనికులు భరించగలుగుతారుగాని పేదలు భరించలేరు. వాతావరణ మార్పులు, ప్రభుత్వ వ్యయంలో కోతలు లింగ, ఆర్థిక అసమానతలను పెంచుతాయి. రాబోయే పదేళ్లలో ధనికులపై అదనంగా 0.5 శాతం పన్ను విధిస్తే 117 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడటమే కాకుండా వృద్ధుల సంరక్షణకు అవసరమైన ఆర్థిక వనరులతో పాటు, పేదలకు ఉచితంగా విద్య, ఆరోగ్యం అందజేయవచ్చని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. తిరోగామి పన్నులు విధించడం వలన ఆర్థిక అసమానతలు తగ్గడంతో పాటు, ప్రజల కోసం చేసే ఖర్చుపై పరిమితులు ఎత్తి వేయవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ధనికులకు దోచిపెట్టింది "ఇక చాలు" అని ప్రజలు నిలదీస్తున్నారు. చిలీ, జర్మనీలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అసమానతలు, వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా నిరసనలు తీవ్రమవుతున్నాయి. ఫ్రాన్స్‌లో ఎల్లో వెస్ట్ నిరసనలు కొనసాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బోల్సనారో వంటి నేతలు అనుసరిస్తున్న సంపన్నులకు పన్నురాయితీలు ఇవ్వటం, పర్యావరణ ఒప్పందాలకు అవరోధాలు కల్పించటం, జాత్యహంకారం, లైంగికోన్మాదం, మైనార్టీ వ్యతిరేకత వంటి విధానాలు కలిమి లేముల మధ్య అంతరాలు మరింతగా పెంచుతున్నాయి.

సంపన్నులపై పన్ను విధించక పోవడమే ప్రపంచ వింత ధోరణిగా ఉంది. సమాజంలో శిఖరాగ్ర స్థానంలో ఉన్న కొద్దిమంది ధనవంతుల చేతుల్లో లక్షల కోట్ల డాలర్లు పోగుపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా పన్ను వసూళ్లలో కేవలం 4 శాతం మాత్రమే సంపదపై పన్ను విధించడం ద్వారా వస్తున్నాయి. అత్యంత ధనికులు చెల్లించాల్సిన పన్నుల్లో 30 శాతం తగ్గించారని అధ్యయనాలు చెబుతు న్నాయి. అతి తక్కువ కార్పొరేట్ పన్నులు వాటా దారులకు లాభాలను పెంచడానికి, కార్మికులకు వేతనాలు తగ్గించడానికి సహాయపడతాయి. ఉదాహరణకు 2011-2017 మధ్య జి7 దేశాల్లో సగటు వేతనాలు 3 శాతం పెరగగా, వాటాదారులకు డివిడెండ్ మాత్రం 31 శాతం పెరిగింది. వాస్తవానికి గత కొన్ని సంవ త్సరాలుగా నిజ వేతనాలు తగ్గుతుంటే పెట్టుబడి దారులకు మాత్రం రాబడి పెరుగుతున్నది. ప్రభుత్వాలు ధనవంతులకు పన్ను రాయితీలు ఇస్తూనే ఉన్నాయి. భారీగా పెట్టుబడులను ఆకర్షించే పేరుతో భారత దేశంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ పన్నులు తగ్గించింది.

"లింగ అసమానతలు విస్తరించడం, వేతన రేట్లు దాదాపుగా స్తబ్ధుగా ఉండటం చాలా ప్రమాదకర పరిణామం. సంపద అసమాన పంపిణీలో లింగ వివక్ష కూడా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా పురుషులు, మహిళల కంటే 50 శాతం ఎక్కువ సంపదను కలిగి ఉన్నారని, ఆర్థిక, రాజకీయ అంశాల్లో కూడా పురుషులే ఆధిపత్యం చెలాయిస్తున్నారని నివేదిక పేర్కొంది."



దేశంలోని మొదటి పదిమంది అత్యంత సంపన్నులు

**లింగ అసమానతలు**

లింగ అసమానతలు విస్తరించడం, వేతన రేట్లు దాదాపుగా స్తబ్ధుగా ఉండటం చాలా ప్రమాదకర పరిణామం. సంపద అసమాన పంపిణీలో లింగ వివక్ష కూడా ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా పురుషులు, మహిళల కంటే 50 శాతం ఎక్కువ సంపదను కలిగి ఉన్నారని, ఆర్థిక, రాజకీయ అంశాల్లో కూడా పురుషులే ఆధిపత్యం చెలాయిస్తున్నారని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా మంత్రుల్లో 18 శాతం, పార్లమెంటు సభ్యుల్లో 24 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. అందులో కేవలం 34శాతం మంది మహిళలు మాత్రమే నిర్వాహక పదవులను కలిగి ఉన్నారు. వేతనం లేని శ్రమ, చౌక శ్రమతో మహిళలు మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్నారు. అసమానతల ఆర్థిక వ్యవస్థ నడకకు వేతనం చెల్లించని పని ఇంధనంలా పని చేస్తున్నది. ఈ విధానం ద్వారా ప్రజల జేబుల నుండి కొట్టేసిన సంపద సమాజంలో ఉన్న కొద్ది మంది ధనవంతుల జేబుల్లోకి చేరుతున్నది. ఆర్థిక అసమానతలు, లింగ అసమానతలకు మధ్య ఉన్న సంబంధాన్ని ఈ నివేదిక నొక్కి చెప్పింది. మహిళలు దిగువభాగంలోనే ఉండాలనే ఆలోచనలతో పెట్టుబడిదారీ ఆర్థికచట్రం నిర్మించబడినది. తక్కువ జీతం ఉన్న ఉపాధిలో మహిళలు, బాలికలే ఎక్కువగా కనబడతారు. ఎందుకంటే వారికి తక్కువ వేతనం చెల్లించి ఎక్కువ పని చేయించుకోవచ్చు.

అభివృద్ధి యొక్క ఆర్థిక నమూనాలో మహిళల శ్రమను తక్కువగా అంచనా వేయడానికి, వేతనం చెల్లించని సంరక్షణ పనికి మధ్య పరస్పర సంబంధం ఉంది. కట్టుబాట్లు, ఆచార సాంప్రదాయాలు, లింగ అసమాన తలను ఉపయోగించి తక్కువ వేతనాలతో పని చేసేలా మహిళలు, బాలికలను బలహీనపరిచి వారి శ్రమను దోపిడీ చేస్తూ పెట్టుబడిదారీ సమాజం వ్యవస్థను నడుపుతుంది. మహిళల శ్రమను ఇంత దోపిడీ చేస్తున్నా వారి ప్రాధాన్య తను గుర్తించడానికి మాత్రం నిరాకరిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా వేతనాలు లేని, అతి తక్కువ వేతనాలతో మహిళలు చేసే సంరక్షణ పనిని పేద వర్గాలకు చెందిన మహిళలు, బాలికలే చేస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా విలువకట్టని ఇంటిపనుల్లో మూడోవంతుపనిని స్త్రీలే చేస్తున్నారు. మూడింట రెండోవంతు మహిళలు 'కేర్ వర్క్'లోనూ ఉన్నారు. నిజానికి ఇంట్లో మహిళలు చేసే

**"భారతదేశంలో పురుషుల కంటే స్త్రీలు ప్రతి రోజూ తొమ్మిది రెట్లు ఎక్కువ పని చేస్తున్నారు. పురుషులు 31 నిమిషాలు పనిచేస్తుంటే స్త్రీలు 297 నిమిషాలు పనిచేస్తున్నారు. పట్టణాల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ పురుషులు 29 నిమిషాలు పని చేస్తుంటే స్త్రీలు 321 నిమిషాలు పని చేస్తున్నారు. గ్రామాల్లో ఒకరోజుకి పురుషులు 32 నిమిషాలు పనిచేస్తుంటే, స్త్రీలు 291 నిమిషాలు పని చేస్తున్నారు."**

ఈ కేర్ వర్క్‌కు ఎలాంటి జీతం ఉండదు.

కుటుంబ సభ్యులైన పిల్లలు, రోగగ్రస్తులు, వృద్ధులకు చేసే సేవల దగ్గర నుంచి ఇంటి పనిలో దాదాపుగా మొత్తం పనులు చేస్తున్న స్త్రీలకు ఎలాంటి వేతనం అందడం లేదు. అలాంటి పని కోసం గడిపిన గంటలు కూడా చాలా ఎక్కువ. వర్ధమాన దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల మహిళలు రోజుకి దాదాపు 14 గంటలు చెల్లించని పని కోసం గడుపుతున్నారు. ఈ పనిగంటలు వర్ధమాన దేశాల్లోని పురుషులు చేసే పనిగంటల కంటే ఐదు రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారుగా వందకోట్ల గంటల పనిని మహిళలు చేస్తున్నారు. అయితే ఈపనికి ఎలాంటి వేతనమూ ఇవ్వడం లేదు. జీతం లేకుండా, జీతం తీసుకొని ఒక రోజులో మహిళలు చేస్తున్న ఈ పని ఆరువారాల పూర్తి సమయంలో పురుషులు చేసే పనితో సమానమైనదిగా ఈ సర్వేలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న 34 లక్షల మంది ఇంటి పనివారల శ్రమ దోపిడీ ఖరీదు ఏడాదికి లక్షల కోట్లలో ఉంటుందని ఒక అంచనా. ఇది పురుషుల వేతనం కంటే 60 శాతం ఎక్కువని రిపోర్టులు చెబుతున్నాయి.

భారతదేశంలో పురుషుల కంటే స్త్రీలు ప్రతి రోజూ తొమ్మిది రెట్లు ఎక్కువ పని చేస్తున్నారు. పురుషులు 31 నిమిషాలు పనిచేస్తుంటే స్త్రీలు 297 నిమిషాలు పనిచేస్తున్నారు. పట్టణాల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ పురుషులు 29 నిమిషాలు పని చేస్తుంటే స్త్రీలు 321 నిమిషాలు పని చేస్తున్నారు. గ్రామాల్లో ఒకరోజుకి పురుషులు 32 నిమిషాలు పనిచేస్తుంటే, స్త్రీలు 291 నిమిషాలు పని చేస్తున్నారు. ఈ కేర్‌వర్క్ వల్ల లింగ అసమానతలు మరింత పెరుగుతున్నాయి. దీని ప్రభావంతో మహిళల్లో అక్షరాస్యతా శాతం, మహిళా ఉద్యోగుల సంఖ్య మరింత తగ్గుతోందని సర్వేలో తేలింది. రాజకీయ, ఇతర కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఇష్టపడే మహిళలకు వేతనం లేని సంరక్షణ పని పెద్ద అడ్డంకిగా తయారైంది.

వేతనం ఇవ్వని సంరక్షణ పనికి, మహిళల పై జరుగుతున్న హింసకు మధ్య సంబంధం ఉందని "ఆన్ ఉమెన్స్ బ్యాక్స్" రిపోర్ట్ గుర్తు చేసింది. డ్రాపవుట్స్ లేకుండా పాఠశాలలకు హాజరవుతున్న 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు వస్తున్నాయని సూచించడానికి ఆధారాలున్నాయి. పాఠశాల విద్య పూర్తిచేసిన వారు, పాఠశాలకు హాజరయ్యేవారి శాతం తక్కువ ఉన్నవారు కూడా వేతనం లేని సంరక్షణ పనిలో భాగస్వాములు అవుతున్నారు. డ్రాపవుట్స్ లేకుండా బాలికలకు ప్రత్యేకంగా విద్య అందిస్తే, వేతనం లేని సంరక్షణ పని నుండి మహిళలు, బాలికలు విముక్తి పొందుతారు. వేతనాలు పొందే ఉపాధిని సంపాదించడానికి అవకాశాలుంటాయి. పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన సందర్భంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ "బేటి బచావో బేటి పడావో" కార్యక్రమం అద్భుతమైన ఫలితాలను ఇచ్చిందని, విద్యలో బాలికల నిష్పత్తి, అబ్బాయిల కంటే మెరుగ్గా ఉందని అన్నారు. నిర్మలా సీతారామన్ బాలికల నమోదు గురించి మాట్లాడారు కాని డ్రాప్ అవుట్ రేట్ల గురించి కాదు.

మహిళలపై హింసకి కారణమైన మూలాల్లోకి వెళ్లకుండా, మహిళలపై జరుగుతున్న వ్యక్తిగత హింసకు సంబంధించిన కేసులను మాత్రమే మీడియా ఫోకస్ చేస్తున్నదని నివేదిక తెలిపింది. ఇందుకు భిన్నంగా ఇప్పటికే సమాజంలో సంరక్షణ పనిలో వేతనం తీసుకొనే ఇంటి పని కార్మికులున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంటిపని చేసే 6 కోట్ల మంది కార్మికుల్లో 80 శాతం మంది మహిళలే. అందులో 10 శాతం మంది మాత్రమే కార్మిక చట్టాల పరిధిలో ఉన్నారు. వారిలో 5 శాతం మంది మాత్రమే కనీస వేతన చట్టాల పరిధిలో ఉన్నారు. వారికి పరిమితమైన పని గంటలు కూడా లేవు. వారిలో ఎక్కువ మందికి ప్రసూతి ప్రయోజనాలతో కూడిన సామాజిక భద్రత, రక్షణా చర్యలు లేవు. "ఆన్ ఉమెన్స్ బ్యాక్స్" పేరుతో ఉదయ్‌పూర్ (రాజస్థాన్), ఢిల్లీలోని గ్రామీణ, పట్టణప్రాంత మహిళలను ఇంటర్వ్యూ చేశారు. ఇంటర్వ్యూల ఆధారంగా బాలికలు పాఠశాల విద్య నుండి తప్పుకోవటానికి బాల్య వివాహాలే ప్రధాన కారణమని ఇండియా అసమానతల నివేదికలో గుర్తించారు. పాఠశాల విద్యకు సామాజిక, ఆర్థిక విలువ లేదని ప్రతివాదులు వాదించారు. 2018లో పిల్లల హక్కుల పరిరక్షణ కోసం నేషనల్ కమిషన్ ఇచ్చిన నివేదిక 15-18 ఏళ్లలోపు పాఠశాల నుండి బయటపడిన 40 శాతం మంది బాలికల్లో, 65 శాతం మంది ఇంటి పనిలో నిమగ్నమై ఉన్నారని చెప్పింది.

**ప్రభుత్వాలు బాధ్యతల నుండి తప్పుకోవడం**

ప్రపంచవ్యాప్తంగా జనాభా సమూహంలో వృద్ధుల సంఖ్య క్రమంగా పెరగడంతో వృద్ధుల సంరక్షణ అవసరం పెరుగుతున్నది. సంరక్షణ సేవల బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నది. అందువలన వృద్ధుల బాధ్యత సమాజానికి, ప్రభుత్వానికి భాగస్వామ్య బాధ్యత కాకుండా వ్యక్తుల బాధ్యతగా మారింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు క్రమంగా సంరక్షణలో పెట్టుబడులు పెట్టి ఖర్చు చేయడానికి బదులు, సాంఘిక కార్యక్రమాలను తగ్గించడం, పేద ప్రజలపై పన్నులు పెంచడం, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం, విద్య, ఆరోగ్యం వంటి సేవలను ప్రైవేటీకరించడం చేస్తున్నాయి. ట్యునీషియా, మొరాకో, జోర్డాన్ దేశాలో అమలుచేసిన ఐ.ఎం.ఎఫ్ విధానాలు మహిళలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు, అసమానతలు పెంచుతున్నాయని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత ప్రభుత్వాలు చేసే ఖర్చును ఏకపక్షంగా తగ్గించాయి. దాంతో సంపద కేంద్రీకృతమవటంతో ఆర్థిక అసమానతలు పెరిగాయి.

**అసమానతలు తీవ్రతరం**

కొన్ని కార్పొరేట్ కంపెనీలు ఆహారం, ఔషధాలు, ఫైనాన్స్, మీడియా, టెక్నాలజీ తదితర రంగాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. మార్కెట్ల నుండి కొల్లగొట్టిన లాభాలను కార్పొరేట్స్ మరియు వారి వాటాదారులు

> **"ఒక రూపాయిలో 27 పైసలు పైనున్న ఒక శాతం కార్పొరేట్లకి చెందితే, కిందనున్న 50 శాతం ప్రజలకి రూపాయిలో పన్నెండు పైసలు మాత్రమే దక్కుతున్నాయి' అని ఆక్స్‌ఫామ్ పేర్కొన్నది. ఇలాంటి విపరీతమైన ఆర్థిక అసమానతలు కొనసాగితే పేదరికాన్ని ఎన్నటికీ నిర్మూలించలేం. 2013 నుండి పేదరికం తగ్గుదల రేటు సగానికి తగ్గిందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది."**

పంచుకునే క్రమంలో అసమానతలు తీవ్రతర మతున్నాయని నివేదిక పేర్కొంది. బిలియనీర్స్ సంపదలో మూడింట ఒకవంతు సంపద వారసత్వం నుండి వస్తుందని, ఇది సంపద పంపిణీకి ఉన్న అవకాశాలను పెద్ద ఎత్తున నీరుకారుస్తుందని ఆర్థికవేత్త థామస్ పికెట్టి ఎత్తి చూపారు. విపరీతంగా సంపద పోగుబడే విధానాలు రాజకీయాలను ప్రభావితం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఉన్నత వర్గాలకు ప్రయోజనం చేకూర్చే నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రోత్సహించడానికి, బలోపేతం చేయడానికి, మీడియా, విద్యాసంస్థలను ప్రభావితం చేయ డానికి పోగుబడిన సంపదను ఉపయోగిస్తున్నారు.

'ప్రపంచంలోని సగం జనాభా రోజుకు 5.5 డాలర్లు లేదా అంతకన్నా తక్కువ డబ్బుతో బతుకుతున్నారని ప్రపంచ బ్యాంకు చెప్తున్నది. ఒకసారి ఆస్పత్రిలో చేరడం వల్ల లేదా పంట నష్టం జరగడం వల్ల ఎంతో మంది పేదలుగా మారిపోతున్నారు. ఒక రూపాయిలో 27 పైసలు పైనున్న ఒక శాతం కార్పొరేట్లకి చెందితే, కిందనున్న 50 శాతం ప్రజలకి రూపాయిలో పన్నెండు పైసలు మాత్రమే దక్కుతున్నాయి' అని ఆక్స్‌ఫామ్ పేర్కొన్నది. ఇలాంటి విపరీతమైన ఆర్థిక అసమానతలు కొనసాగితే పేదరికాన్ని ఎన్నటికీ నిర్మూలించలేం. 2013 నుండి పేదరికం తగ్గుదల రేటు సగానికి తగ్గిందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2016 - 2018 మధ్య ప్రపంచ ఆర్థికవృద్ధి నుండి అత్యంత ధనవంతులైన 1 శాతం మంది ప్రతి డాలర్‌కు 20 సెంట్లు అందుకున్నారని ప్రపంచ అసమానతల నివేదిక తెలిపింది. ప్రతి డాలర్‌కు 12 సెంట్లు అందుకున్న దిగువ 50 శాతం మందికి ఇది దాదాపు రెండు రెట్లు ఎక్కువ. తీవ్ర అసమానతలను తగ్గించడమనేది ఆర్థిక వ్యవస్థకు వదిలివేస్తే కుదరదు. ప్రభుత్వాలు ఒక శాతంగా ఉన్న ధనవంతుల కోసం కాక 99 శాతంగా ఉన్న సాధారణ ప్రజల కోసం పని చేయాలి. దీనికిగాను ఒక మానవీయమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించాలి.

ఆర్థిక వ్యవస్థ సవ్యంగా నడవాలంటే లింగ అసమానతలు తగ్గించడం, తొలగించడమే పరిష్కార మార్గం. ఆక్స్‌ఫామ్ అధ్యయనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మహిళలు మూఢ నమ్మకాలు, ఆచారాలు, సాంప్రదాయాల కారణంగా ఎక్కువ శ్రమ దోపిడీకి గురవు తున్నారు. మహిళా కార్మికులు చేసే శ్రమకు విలువ తగ్గించడం పితృస్వామ్య ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడిదారీ సమాజాల యొక్క అంతర్గత లక్షణం. పెట్టుబడిదారీ విధానంలో మహిళలు చేసే శ్రమకి తక్కువ విలువ నిర్ణయించడం, మహిళా కార్మికులను తగ్గించడం లాంటి ముందస్తు షరతులుంటాయి. అమెరికాలో కూడా 1.61 కోట్లమంది సంరక్షణ పనిలో ఉన్నారు. వారిలో ఎక్కువ మంది మహిళలు. మహిళలు వేతనం తీసుకోకుండా మతిభ్రమించిన వారికి సంరక్షణ సేవలను అందిస్తున్నారు. ఈ సేవలను మహిళలు ఇవ్వకుండా ప్రభుత్వమే ఇవ్వాల్సి వస్తే ప్రభుత్వానికి 232 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుంది. మహిళలు సంరక్షణ సేవలను ఉచితంగా అందించినప్పుడు, సంరక్షణ సేవల కోసం ప్రభుత్వాలు అదనంగా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం లేదని, సంరక్షణ సేవలకు గాను కుటుంబాలకు అదనపు ఆదాయం అవసరం లేదని ప్రభుత్వాలు బావిస్తున్నాయని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది.

**మహిళలపై హింస**

అంతర్జాతీయకరణ, పితృస్వామ్య సమాజం పై మహిళలకున్న సహజ విధేయత, నమ్మకం హింస పెరగడానికి ప్రధానమైన కారణాలు. ఇంటిపనులకి, మహిళలపై హింసకి మధ్య సంబంధాలున్నాయిని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2015-16) కనుగొన్నది. వరకట్నం తక్కువ తీసుకురావడం, భోజనం సరిపోకుండా వండటం, వ్యభిచారం, మగపిల్లలు పుట్టక పోవడం, ఇవన్నీ మహిళలపై గృహహింసకి కారణమని చెప్పవచ్చు. మహిళలపై చేయి చేసుకోవడానికి పురుషులలో మద్యపాన వ్యసనం కూడా ఒక కారణం. భారతదేశంలో నిరుపేద మహిళలు కుటుంబహింస, పేదరికంతో మరింత భయానికి లోనవుతున్నారని పరిశోధ నలు చెబుతున్నాయి. వీళ్లు గనుక తమ ఇంటిపని చేయడం మానేస్తే వారిపై మరింత హింస పెరుగుతోందని సర్వేలు తేల్చాయి. 2019లో భారతదేశంలోని బీహార్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాల్లోని 1,107 మంది మహిళలను ఆక్స్‌ఫామ్ సంస్థ కలిసినప్పుడు వీరిలో ఇంటికోసం వంటచెరకు, మంచి నీటిని తీసుకురాలేకపోతున్న 42.2 శాతం మంది మహిళలు, కుటుంబం కోసం వంట వండలేక పోతున్న 41.2 శాతం మంది మహిళలు శారీరక హింసను ఎదుర్కొంటు న్నామని చెప్పారు. 65 నుంచి 68 శాతం మహిళలు ఇలాంటి పనులు చేయకపోవడం వలన తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ యొక్క మూలాల్లోనే పితృస్వామ్య వ్యవస్థ యొక్క ఆర్థిక, సామాజిక నిర్మాణం ఉందని నివేదిక నిస్సందే హంగా పేర్కొంది. కింది కులాల మహిళలు చేసే పనిని తక్కువ అంచనా వేయడం, పాత సమాజపు లక్షణమైన లైంగిక, జాత్యహంకార వైఖరికి నిదర్శనమని చెప్పింది. ఇంట్లో పురుషుడి మాట వినలేదని 24.3 శాతం మహిళలు, అనుమతి లేకుండా డబ్బులు ఖర్చు చేశారని 26.3 శాతం మంది మహిళలు పురుషుల చేతిలో చావుదెబ్బలు తింటున్నారని పేర్కొంది. పిల్లల సంరక్షణలో, అనారోగ్యంతో ఉన్న పెద్దల విషయంలో అలక్ష్యం వహిస్తున్నా రన్న కారణంతో 36.2 శాతం మంది మహిళలు కూడా శారీరక హింసను ఎదు ర్కొంటున్నారు. మహిళలు ఎంత అనారోగ్యంగా ఉన్నా, ఎలాంటి ఇబ్బందులున్నా అన్నీ పక్కన పెట్టి, ఇంటి పనిని మాత్రం తప్పక చేయాల్సిన దుస్థితి ఉంది.

పితృస్వామ్య సమాజం సంరక్షణ పని అనేది స్త్రీ యొక్క ప్రకృతి ధర్మమని ఆదేశిస్తున్నది. ఈ లక్షణంతోనే పిల్లలు, వృద్ధులు, వికలాంగుల సంరక్షణ వంటి సేవలను అందించే బాధ్యత నుండి ప్రభుత్వాలు సమర్థవంతంగా తప్పుకుం టున్నాయి. చాలామంది మహిళలు ఇంటి సంరక్షణ పనిని చేపట్టడానికి కారణం అది

> "సంరక్షణ పని గతంలో కంటే చాలా ప్రమాదకరంగా మారింది. సంరక్షక పరిశ్రమ అంతా ప్రైవేటీకరించబడినది. ఇక్కడ సరైన ఒప్పందాలు లేకుండా అనధికారికంగా నడుస్తున్నది. అనధికార ఒప్పందాలతో కార్మికుల సంక్షేమం ప్రమాదంలో పడుతున్నది. ఉపాధి అవకాశాలు లేనప్పుడు మహిళలతో సహా చాలా మంది యువకులు సంరక్షణ పనిని ఎంచుకుంటున్నారు."

సామాజిక బాధ్యతగా నిర్ణయించడమే.

యుఎన్ ఉమెన్ రిపోర్ట్ ప్రకారం మహిళలకు వేతనాలు చెల్లించే పని శాతం పెరిగినప్పటికీ, వేతనం చెల్లించని సంరక్షణ పనుల భారం ఇప్పటికీ మహిళలే బాధ్యతగా చూడాల్సిన పరిస్థితి ఉంది. పనిచేసే ఆఫీసుల్లో ఎగతాళి చేస్తారని, బహిరంగ అవమానాలకు గురికావాల్సి వస్తుందని భయపడి పురుషులు ఇంటి సంరక్షణ పనులు తీసుకోకుండా దూరంగా ఉంటారు. ఇతర రంగాలలోని కార్మికులతో పోలిస్తే సంరక్షకులకు వేతనాలు చెల్లించే ప్రాంతాల్లో పని నిబంధనలు, షరతులు కఠినంగా ఉంటాయి. వారికి చట్టపరమైన హక్కులు, ఇతర పని సంబంధిత రక్షణ ప్రయోజనాలు లేవు. కార్మిక చట్టాల ప్రకారం ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల మాదిరిగా 10 మంది గృహ కార్మికుల్లో ఒకరికి మాత్రమే సమాన రక్షణ ఉంది. వలస వచ్చిన గృహ కార్మికులు కార్మిక చట్టాల పరిధిలోకి రారు. ఇలాంటి వారి భవితవ్యం యజమాన్యాలతో, ఏజెన్సీలతో ముడిపడి ఉన్నందున ఎక్కువ ప్రయోజనాలు పొందలేకపోతున్నారు.

సంరక్షణ పని గతంలో కంటే చాలా ప్రమాదకరంగా మారింది. సంరక్షక పరిశ్రమ అంతా ప్రైవేటీకరించబడినది. ఇక్కడ సరైన ఒప్పందాలు లేకుండా అనధికారికంగా నడుస్తున్నది. అనధికార ఒప్పందాలతో కార్మికుల సంక్షేమం ప్రమాదంలో పడుతున్నది. ఉపాధి అవకాశాలు లేనప్పుడు మహిళలతో సహా చాలా మంది యువకులు సంరక్షణ పనిని ఎంచుకుంటున్నారు. సంరక్షణ పని పరిశ్రమను నియంత్రించటానికి ప్రభుత్వాలు విముఖత చూపడం లేదు. ధనవంతులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయ పన్నులు మాఫీ చేయడం, కార్పొరేట్‌లకు పన్ను రాయితీలు ఇవ్వడం లాంటివి చేస్తున్న ప్రభుత్వాలు చెల్లించని కార్మికుల సంక్షేమం పట్ల చూపిస్తున్న శ్రద్ధ చూస్తే మరింత ఆశ్చర్యం కలుగుతుంది.

పౌర సమాజం సహకారంతో ముఖ్యంగా మహిళా హక్కుల సంఘాల చొరవతో జాతీయ సంరక్షణ వ్యవస్థను రూపొందించాలని ఆక్స్‌ఫామ్ ప్రపంచ దేశాల ప్రభుత్వాలకు సూచించింది. సాంఘిక భద్రతా వ్యవస్థను, ఉచిత పబ్లిక్ సర్వీసులను అలాగే ప్రగతిశీల పన్నుల వ్యవస్థను రూపొందించడం ద్వారా కార్పొరేట్ కంపెనీలు, అత్యంత ధనవంతుల జోక్యాన్ని, ప్రభావాలను తగ్గించాలని ఆక్స్ ఫామ్ ప్రభుత్వాలకు సూచించింది. మానవీయ ఆర్థిక వ్యవస్థలో లింగ సమానత్వం, మహిళా అనుకూల విధానాలకు ప్రాధాన్యత ఉండాలి. వేతనాలు లేని, అతి తక్కువ వేతనాలతో మహిళలు చేసే పనికి ప్రాముఖ్యం కలిగించేట్టుగా విధానాలు ఉండాలి. అప్పుడే ప్రపంచంలో అంతరాలను తగ్గించే అవకాశాలు ఉంటాయి.

పేదలు, ధనవంతుల మధ్య వున్న అంతరాలను తగ్గించడానికి, 'సంరక్షణ' బాధ్యతలలో ఉన్న వారి హక్కులను గుర్తించడానికి, వారు అందిస్తున్న విశేషమైన పని ప్రాధాన్యతను సమాజానికి తెలియజేయడానికి ఆరు పరిష్కారాలను ఆక్స్‌ఫామ్ ప్రభుత్వాలకు సూచించింది. రక్షిత మంచినీటి సదుపాయం, పారిశుధ్యం, గృహ అవసరాలకు తగిన ఇంధన వనరులు అందించాలి. శిశు, వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వపరంగా సదుపాయాలు కల్పించాలి. పన్నుల వ్యవస్థను సమూలంగా మార్చి అధిక సంపద, అధిక ఆదాయాలపై ఎక్కువ మొత్తంలో పన్నులు విధించాలి. దీనివల్ల సమకూరిన వనరులను సామాజిక సేవలను అందించడానికి ఉపయోగించాలి. సంరక్షణ' పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి చట్టాలు చేయడం, వారికి జీవించడానికి కావలసిన వేతనాలు (లివింగ్ వేజ్) ఇవ్వాలి. 'సంరక్షణ' పనిలో ఉన్న వారిని నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వాములను చేయాలి. 'సంరక్షణ' బాధ్యతలను మహిళలే చూసుకోవాలి అన్న సాంప్రదాయాలు, మూఢాచారాల పట్ల సరైన అవగాహన కలిగించాలి. సామాజిక, ఆర్థికవ్యవస్థలో లింగసమానత్వం తీసుకురావాలి.

ఆక్స్‌ఫామ్ చేసిన సూచనలను అమలు జరిగేట్లుగా పౌర సమాజం, మహిళాసంఘాలు, యువజన సంఘాలు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి. లేదంటే ఇప్పటికే అదుపు లేకుండా విజృంభిస్తున్న అంతరాలు, లింగ అసమానతలు రానున్న కాలంలో మరింత విధ్వంసం సృష్టిస్తాయి. మానవాళి భవిష్యత్తు పట్ల కనీస బాధ్యతతో వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు ఆక్స్‌ఫామ్ వెల్లడించిన విషయాలను పరిశీలించి సరైన చర్యలను సత్వరమే చేపట్టాలి.

– అనువాదం – కొత్తమాసు. హరికిషోర్

# పాఠకుల అభిప్రాయం

మార్క్సిస్టు మాసపత్రిక సంపాదకులకు నమస్కరించి వ్రాయునది మార్చి సంచికపై నా అభిప్రాయం ప్రచురించ కోరుచున్నాను. కరోనా కట్టడిలో చైనా ఆదర్శం నేడు ప్రపంచ వ్యాపితంగా ప్రజలను భయపెడుతున్న కోవిడ్-19 (కరోనావైరస్ డిసిజ్-19) సుమారు 100 దేశాలలో ఉంది. మన దేశంలో వందలాది మందికి ఉంది. మరణాలు సంబవించాయి. వేలమందికి పాజిటివ్ కనిపిస్తున్నది మొదటిగా చైనాలో వూహాన్ నగరంలో కరోనాను ఈ ఏడాది జనవరి 21న గుర్తించారు. ఫిబ్రవరి 27 కి చైనాలో 78000 చేరుకోగా 2800 మంది చనిపోయారు వ్యాధినిరోదానికి చైనా తీసుకోన్న చర్యలు "కమ్యూనిస్ట్ ప్రభుత్వం కనుకనే సాధ్యమైంది. అన్ని దేశాల ప్రభుత్వాలు చైనాను ఆదర్శంగా తీసికొవాలి. చాలాలోతుగా అధ్యయనం చేసిన వ్యాసరచయిత మరియు సంపాదకులకు అభినందనలు.

– తుంపాల శ్రీరామమూర్తి, గాజువాక.

**ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి ప్రత్యేకం**

# మహా జ్ఞాన సంపన్నుడు ఎంగెల్స్

**తెలకపల్లి రవి**



రచయిత ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

ఫ్రెడరిక్ ఎంగెల్స్ మానవజాతి చరిత్రలోనే మహత్తరమైన మార్కిస్టు సిద్ధాంతం మహోన్నత వ్యక్తులైన కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్సుల కలయికలో ఒక అసమాన మైత్రికి ప్రతీక కావడం అద్భుతమైన చారిత్రిక వాస్తవం. ఇద్దరు మహా మేధావుల మధ్య అచంచలమైన అరమరికలు లేని మైత్రికి చరిత్రలో ఇంతకన్నా మంచి ఉదాహరణ లేదంటారు. ఈ ఇద్దరు మిత్రుల కథ రాస్తే లేక చిత్రంగా తీస్తే మార్క్స్ ప్రాణమిత్రుడుగా సమాన సహచరుడుగా ఎంగెల్సు ఎక్కువ ఆకర్షణీయంగా బహుముఖీన వ్యక్తిత్వంతో శక్తిత్వంతో మన మనసుల్లో నిలిచిపోతాడు. పుట్టుకతో పెట్టుబడిదారుడే గాక గొప్ప వ్యాపార వ్యవహార దక్షుడైనప్పటికీ కార్మికవర్గ స్థితిగతులను అధ్యయనం చేసి. అపారమైన అర్ధ్రతతో, సానుభూతితో అక్షరీకరించిన మానవతా వాది. మహా సంపదలను తృణప్రాయంగా తోసిపుచ్చి శ్రమజీవుల విముక్తికే అంకితమైన ధన్యజీవి. ఆ శ్రమజీవులే సమాజ మార్పుకు చోదకశక్తులని గుర్తించిన ప్రతిభాశాలి. తనలాగే ఇంచుమించు అదే సమయంలో అదే నిర్ణయాలకు వస్తున్న మార్క్స్ గురించి తెలుసుకుని కోరి పరిచయం పెంచుకుని ఆజన్మాంత సహచరుడిగా జ్ఞానాన్ని పంచుకోవడంలో, పెంచుకోవడంలో కలసి నడవడమే గాక ఆయన నడక భారం కూడా తనే మోసిన మహా స్నేహితుడు. అందుకోసం తనకు ఇష్టం లేని వ్యాపారాన్ని చేస్తూ, మోస్తూ ఆ పైన మార్క్స్ పేరుతో రాస్తూ, ఆయన రాసినవి చూస్తూ చర్చిస్తూ సిద్ధాంతాన్ని పరిపుష్టం చేసిన మేధావి. అనేక రంగాలలో, భాషలలో ఆరితేరిన నిష్ణాతుడు. అంతటి పరిజ్ఞానం వున్నా సాయంకాలపు క్లబ్బు సభ్యుల దృష్టిలో కేవలం ద్రాక్షసారా రుచిని ఆస్వాదించగల స్నేహితుడు మాత్రమే. అలా అందరితో కలుపుగోలుగా మెలుగుతూ, ఆదుకుంటూ వ్యక్తిగత జీవితంలోనూ సంప్రదాయ విలువలను అలవోకగా తోసిపుచ్చిన సాహసి.

చాలామంది అనుకునేట్టు లేక కొంతమంది రాసేట్టు ఎంగెల్స్ పాత్ర మార్క్సును ఆర్థికంగా ఆదుకోవడమే కాదు. నిస్సందేహంగా అది గొప్ప సేవ. త్యాగం. ఆర్థిక త్యాగంగా కన్నా అధ్యయన త్యాగం ఎక్కువ. ఎందుకంటే అయితే ఆ విధంగా తను చేసి వుండకపోతే మార్క్స్ జీవితం గురించిన చింత లేకుండా నిరంతరాయంగా సిద్ధాంత కృషి చేయగలిగేవారు కాదు. కాని అంతకంటే గొప్ప విషయం సంపాదించడం కోసం ఎంగెల్సు మహామేధను మామూలు వ్యాపార విషయాలకు వెచ్చించవలసి వచ్చింది. ఆ కాలానికి అత్యధిక పరిజ్ఞానం గల వ్యక్తిగా ఆయనను చెబుతారు. ఆర్థిక, చారిత్రిక విషయాలలోనే గాక తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, సాహిత్యం, ఆఖరుకు సైనిక వ్యూహాలలో కూడా ఎంగెల్సుకు గొప్ప అవగాహన ఆసక్తి వుండేవి. తమ ఇంట్లో అమ్మాయి గర్భవతిగా వుందని ప్రసూతి శాస్త్రం చదివేశారట. ఓడలో ప్రయాణ సమయం పోనివ్వకుండా పక్షిశాస్త్రం పఠించేశాడు. ఎంగెల్సుకు ఎన్నో భాషలు వచ్చు. ఆయన కోపం వచ్చినప్పుడు పదహారు భాషల్లో గొణుగుతాడు అని అందుకే కుర్రాళ్ళు విసుక్కునేవారట. ఎంగెల్సు చూడకుండా, ఆమోదించకుండా మార్క్స్ ఏదీ అచ్చుకు ఇచ్చేవాడు కాదు. ఈయనా అంతే.

ఇంత పాత్ర నిర్వహించినప్పటికీ ఎంగెల్సు గొప్ప వినయ సంపన్నుడు. ఎప్పుడూ మార్క్స్ కన్నా ఒకడుగు వెనకే తనను చెబుతాడు. "మార్క్స్ సాధించింది నేనైతే సాధించలేను. మార్క్స్ సమున్నతంగా నిలబడగలడు. సుదూరం దృష్టి సారించగలడు. మార్క్స్ అసాధారణ మేధావి. తక్కిన మేము మహా అయితే ప్రతిభావంతులం కావచ్చు. ఆయనే లేకుంటే ఆ సిద్ధాంతం ఈ రోజున్నట్టు వుండేది కాదు. దాన్ని ఆ పేరుతో (మార్క్సిజం) పిలవడమే సరైంది" అని రాయడంలో ఎంగెల్సు గౌరవ భావం ప్రస్ఫుటమవుతుంది. నా ప్రత్యేక రంగాలు కొన్నింటిలో తప్ప నేను చేసిందేమైనావుంటే మార్క్స్ అవలీలగా చేయగలిగేవాడు అని కూడా అన్నాడు. అయితే ఈ వాక్యాలు నిజం కాదు. ఏవో కొన్ని రంగాలలో గాక మార్క్సిజం యావత్తూలోనూ ఆయన పాత్ర వుంది. కొత్త అంశం వచ్చినప్పుడు ఎవరు ఏమేమి చదవాలో కూడా వారు నిర్ణయించుకునే వారు. ఇద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు చూస్తే అవి విజ్ఞాన భాండాగారాలుగా వుంటాయి. జర్మనీలోని బెర్మన్‌లో వస్త్ర పారిశ్రామికుడి ఇంట పుట్టిన ఎంగెల్సు 17వ ఏటనే వ్యాపారంలో ప్రవేశించారు. వారికి మాంచెస్టర్‌లోనూ బట్టల మిల్లుల్లో భాగస్వామ్యం వుండేది. ఫ్రెడరిక్ ఆస్వాల్డ్ పేరుతో కవిత్వం వ్యాసాలు రాస్తుండేవాడు. 1839లో రాసిన ఉపెరల్ లేఖలు వాటిలో చెప్పుకోదగినవి. 1842లో ఎంగెల్సు మాంచెస్టర్ చేశారు. ఉదయమంతా వ్యాపారంలో తలమునకలైనా సాయింత్రం తర్వాత సామాజిక సాహిత్య జీవిగా మారిపోయేవాడు. ప్రజాస్వామిక బృందాలతో, మేధావులతో చర్చించేవాడు. ఈ క్రమంలోనే మార్క్స్ సహ సంపాదకత్వంలో వెలువడుతున్న రాజకీయార్థ శాస్త్ర విమర్శన సంపుటానికి వ్యాసం పంపించాడు. ఆ వెంటనే అది మార్క్సును ఆకట్టుకుంది. ప్రతిభావంతమైన రచన అని ఆయన మెచ్చుకున్నాడు. అప్పుడే కొలోన్‌లో వారు కలుసుకున్నారు. 1844లో పారిస్‌లో మార్క్స్ ఇంట్లో రెండవసారి కలుసుకున్నారు. ఎంగెల్సు తాత్వికత, మేధాసంపత్తి, ధైర్యం, దీక్ష, ఏకాగ్రత మార్క్సుకు నచ్చాయి. కార్మికవర్గ విప్లవ యోధునికి కావలసిన లక్షణాలు మార్క్సుకు ఎంగెల్సులో గోచరించాయి. పారిస్‌లో రెండు రోజులు మకాం వేసి మరీ ఎంగెల్సుతో చర్చించాడు. సైద్ధాంతికంగా తమ మధ్య పూర్తి ఏకీభావం వున్నదని తెలుసుకున్నారు. తొలి సంయుక్త రచనగా పవిత్ర కుటుంబం 1845లో వెలువరించారు. చరిత్రను సృష్టించేది అతీతశక్తుల్లో, మానవ చైతన్యమో, కొందరు మహా వీరులో మాత్రమే కాదని ఆ రచనలో వారు నిరూపించారు. శ్రమజీవులే చరిత్ర చోదకశక్తులుగా ముందుకు నడిపిస్తారని నొక్కి చెప్పారు. అప్పటి వరకూ ఉన్న ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలను కూడా తోసిపుచ్చారు. 1845లో ఎంగెల్స్ ప్రత్యక్షంగా పరిశీలించిన

"కేవలం పడకకుర్చీ మేధావులుగాక కార్యాచరణకు కూడా ప్రాధాన్యత నిచ్చే వ్యక్తులుగా 1846 ఫిబ్రవరిలో బ్రస్సెల్స్‌లో కమ్యూనిస్టు కరస్పాండెన్స్ కమిటీని స్థాపించారు. దీంతో పాటుగానే లండన్, పారిస్, హేంబర్గ్, కొలోన్, లిప్జిగ్ తదితర నగరాలలోనూ కమిటీలు వెలిశాయి. తదుపరి ఏడాది లీగ్ ఆఫ్ జస్ట్‌కు నాయకత్వం వహించాలన్న పిలుపు రావడంతో మరింత ఉత్సాహం పొందారు."


జెన్ని కారల్ మార్క్స్

ఇంగ్లాండులో కార్మికవర్గ పరిస్థితులు, కష్టాలు, ఇరుకు కొంపలు, మురికివాడలు ఆయనను కలిచి వేశాయి. పెట్టుబడిదారుని కుమారుడుగా స్వీయ అనుభవం కూడా ఎంతో ఉపకరించింది. ఈ పుస్తకం వచ్చిన సమయానికి మార్క్సును బెల్జియం ప్రభుత్వం ఆంక్షలతో వేధిస్తున్నది. ఈ పుస్తకంపై వచ్చిన రాయల్టీకి మరికొంత మొత్తం జోడించి మిత్రుల నుంచి కూడా సేకరించి మార్క్సుకు పంపించాడు. కొద్దికాలం తర్వాత ఆయ మాంచెస్టర్ రావడంతో ఇద్దరూ కలసి చార్టిస్టు ఉద్యమాన్ని, కార్మికుల పోరాటాలనూ గమనించారు. సంప్రదాయ ఇంగ్లీషు రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనం మొదలెట్టారు. తర్వాత భావజాలానికి జీవగర్ర లాటి జర్మన్ ఐడియాలజీ రాశారు. (కాని అది 1932లో గాని అచ్చు కాలేదు.) కేవలం పడకకుర్చీ మేధావులుగాక కార్యాచరణకు కూడా ప్రాధాన్యత నిచ్చే వ్యక్తులుగా 1846 ఫిబ్రవరిలో బ్రస్సెల్స్‌లో కమ్యూనిస్టు కరస్పాండెన్స్ కమిటీని స్థాపించారు. దీంతో పాటుగానే లండన్, పారిస్, హేంబర్గ్, కొలోన్, లిప్జిగ్ తదితర నగరాలలోనూ కమిటీలు వెలిశాయి. తదుపరి ఏడాది లీగ్ ఆఫ్ జస్ట్‌కు నాయకత్వం వహించాలన్న పిలుపు రావడంతో మరింత ఉత్సాహం పొందారు. దాని పేరు కమ్యూనిస్టు లీగ్‌గా మార్పించారు. మనుషులంతా సోదరులే అన్న మాటల స్థానంలో ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్న నినాదం తీసుకొచ్చారు. 1847 జూన్‌లో లండన్‌లో జరిగిన లీగ్ మహాసభకు మార్క్సు రాలేకపోయినా ఎంగెల్సు హాజరై దిశా నిర్దేశం చేశారు. దీని కొనసాగింపే 1848 ఫిబ్రవరిలో వెలువడిన కమ్యూనిస్టు ప్రణాళిక, దానికి ముందు ఎంగెల్సు కమ్యూనిస్టు మూల సూత్రాలు రాశారు. ఇలా అధ్యయనం, ఆచరణ మేళవింపుగా సాగిన ప్రస్థానం అది. ఆ సమయంలోనే యూరప్‌లో విప్లవ పోరాటాలూ ప్రజ్వరిల్లాయి. కొలోన్ చేరిన మిత్రద్వయం రెనిష్ జెటింగ్ పత్రిక స్థాపించారు. సంపాదకుడు మార్క్సు అయినా, ఎంగెల్సు ఎన్నో విలువైన వ్యాసాలు రాయడమే గాక నిర్వహణ భారమంతా మోశాడు. ఎంగెల్సు ఒక విజ్ఞాన సర్వస్వం, రాత్రి పగలూ ఎప్పుడైనా సరే నవ్వగలడూ ఏడవగలడు, రాయడమైనా ఆలోచించడమైనా దయ్యంలా మహా చురుగ్గా చేసేస్తాడు.' అని మార్క్సు తర్వాత రాశాడు.

ఫ్రాన్స్‌తో సహా చాలా చోట్ల ఆశించిన పోరాటాలు విఫలమైన తర్వాత మార్క్సు ఇంగ్లాండు వెళ్లడం ఏకైక మార్గంగా మిగిలింది. 1849 ఆగస్టులో ప్రవాసిగా అడుగు పెట్టిన ఆయన విశేషకృషితో పాటు శేషజీవితమంతా అక్కడే ముగిసింది. పరమ దరిద్ర భరిత జీవితం కూడా. ఆఖరుకు వారి చిన్న కుమారుడు మూషే కూడా చనిపోయాడు. వాడి అంత్యక్రియలు పూర్తి చేసి ఎంగెల్సుతో గడిపేందుకు మాంచెస్టర్ వెళ్లి ఎంగెల్స్ ఇంట్లో గడిపారు. వారిని ఆదుకోవాలంటే తాను వ్యాపారం చేయక తప్పదని ఎంగెల్సు కంపెనీలో పునఃప్రవేశం చాడు. రోజులో ఎక్కువ భాగం అధ్యయానికి గాక వ్యాపారానికి వినియోగించడం ఎంతో కష్టంగా వున్నా మిత్రుడి కోసం భరించాడు. అలాంటి మిత్రుడిని చూసి మార్క్సు ఎంతో గర్వపడేవాడు. కృతజ్ఞతా గౌరవాలూ కలిగి వుండేవాడు. మరిన్ని కేసులు పోరాటాల తర్వాత 1851లో మార్క్స్ న్యూయార్క్ ట్రిబ్యూనుకు వ్యాసాలు రాయటం ప్రారంభించాడు. ఆయన జర్మన్ భాషలో రాసినవి ఎంగెల్సు ఇంగ్లీషులోకి అనువదించి పంపేవాడు. తానే కొన్ని వ్యాసాలు సీరియల్స్ రాసి మార్క్సు పేరుతోనే పంపి ఆ ప్రతిఫలం ఆయనకే వచ్చేట్టు చూసేవాడు. అప్పుడే ఐర్లండు, ఇండియాలలో వలస పాలన ఫలితాలపై వివరంగా వ్యాస పరంపర రాశారు.

ఇద్దరూ వేర్వేరు చోట్ల వుంటున్నా భావైక్యత ఇందుకు కారణమైంది. అయితే ఈ వ్యాసాలతో మార్క్సు అర్థశాస్త్రాధ్యయనం దెబ్బతింటుందని భావించిన ఎంగెల్సు వాటిని రాసే పని తనే మీద వేసుకున్నాడు. వారం వారం ఉత్తరాలు రాసుకునేవారు. లేఖల్లో చర్చ కారణంగా వారి భావాలు పరిపుష్టం, నిర్దుష్టం అయ్యాయి.

ఈ క్రమంలో ఒక రకమైన పని విభజన కూడా వచ్చేసింది. మార్క్సు ఎక్కువగా రాజకీయ అర్థశాస్త్రం, ప్రపంచచరిత్ర, యూరప్ దేశాల విదేశాంగ విధానంపై కేంద్రీకరించగా ఎంగెల్సు సైనిక శాస్త్రం, భాషా శాస్త్రం, ప్రకృతి శాస్త్రాల అధ్యయనం కొనసాగించారు. విజ్ఞానశాస్త్ర విషయాలలో ఎంగెల్సు అవగాహన తన కాలం కన్నా చాలా ముందుండేదని అందరూ అంగీకరిస్తారు. గతితార్కిక సూత్రాలను ప్రకృతి నిర్ధారిస్తుందని ఆయన అంటారు. అంతేగాని ప్రకృతిలో వాటినెవరూ జొప్పించలేరు. వాటిని సరిగ్గా అన్వేషించి అన్వయించుకోవడమే సమస్య అన్నారు. ఆయన రాసిన ప్రకృతిలో గతితర్కం కొంత అసంపూర్ణమైనా చాలా గొప్ప రచన. వానరుడు నరుడుగా మారడంలో శ్రమపాత్ర, దాని వల్లనే భాష, మెదడు వికసించడం

వంటివాటిని ఎంగెల్సు గొప్పగా ఆవిష్కరించారు. అత్యంత ప్రామాణికమైన ఆయన యాంటీ డూరింగ్ రచన గురించి చెప్పనవసరం లేదు. భవిష్యత్తులో జరగబోయే చాలా పరిశోధనల ఫలితాలను కూడా ఆయన ఊహించగలిగాడు. పదార్థం, కాలం అనంతమైనవనీ కొందరు కాలం పుట్టుక అని చెప్పడం అర్థం లేనిదని తేల్చిపారేశారు.

1875లో డార్విన్ పరిణామవాదంపై లావ్రోకు రాసిన లేఖ ఎంగెల్సు అవగాహన విస్తృతిని చెబుతుంది. ఆ సిద్ధాంతాన్ని ఆమోదిస్తూనే కొన్ని పరిమితులు కూడా గమనంలో వుంచుకోవాలని చెబుతాడు. మొత్తం చరిత్రను మనుగడ కోసం పోరాటంగా చూడటం సరికాదంటాడు. వాస్తవానికి మనుగడ కోసం పోరాటం అన్నది ప్రకృతిలో కూడా ఒక మేరకే వర్తిస్తుంది. ప్రకృతిలో ప్రతిదీ ప్రతిదానితో ఘర్షణ పడుతుందని చెప్పడం ఆ సూత్రాన్ని మాల్థూస్ సిద్ధాంతం రూపంలో మానవ సమాజానికి అన్వయించి ప్రకృతి మానవ సమాజం ఒకటిగానే పనిచేస్తున్నట్టు చెప్పడం తప్పిదమని ఎంగెల్సు స్పష్టం చేశారు. మనిషికీ జంతువుకూ తేడా ఏమంటే జంతువు సేకరిస్తుంది. మనిషి ఉత్పత్తి చేస్తాడు. ఈ ఒక్క తేడా కారణంగానే మనం ప్రకృతిలోని ఇతర జీవ జాలంతో మనిషిని పోల్చలేము. తన అభివృద్ధిలో ఒక దశ తర్వాత మనిషి అవసరాన్ని మించి ఉత్పత్తి చేయడం మొదలవుతుంది. అవసరాలే గాక విలాసాలు కూడా వస్తాయి. మొదట ఇవి కొద్ది మందికే పరిమితమై వుండొచ్చు గాక. మనుగడ కోసం పోరాటం ఇక్కడ సంతోషాల కోసం పోరాటంగా మారుతుంది. సామాజికంగా ఉత్పత్తి అయిన అభివృద్ధి సాధనాల కోసం పోరాటంగా మారుతుంది. జనంలో అత్యధికులకు ఈ సదుపాయాలు సాధనాలు అందుబాటులో వుండవు గనక ఒక పెట్టుబడిదారీ సమాజం తను చేసిన ఉత్పత్తినంతటినీ తనే ఉపయోగించుకోలేకపోతుంది. పదేళ్లకో సంక్షోభం వచ్చిపడుతుంటుంది. మరి అలాంటప్పుడు మనుగడ కోసం పోరాటం ఎలా అన్వయిస్తుంది? అప్పుడు జరిగేదేమంటే ఉత్పత్తి చేసే శ్రామిక వర్గమే అప్పటి వరకూ పెత్తనం చేసిన వారి చేతినుంచి వాటిపై యాజమాన్యం లాగేసుకుంటుంది. అదే సామాజిక విప్లవం అవుతుంది. అని విశదీకరించాడు ఎంగెల్సు. ఇప్పుడు మనం ఎదుర్కొనే చాలా సమస్యలు, సందేహాలకు సమాధానం ఇందులో చూడగలం. ఆ విధమైన విప్లవాలు విజయాలు ఆటుపోట్లు తిరోగమనాలు ఎన్ని సంభవించినా శాస్త్రీయ అధ్యయనంతో రూపొందిన మార్క్సిజం ప్రాధాన్యత మార్క్సు ఎంగెల్సు పాత్ర చెక్కు చెదరవు. మార్క్సు పెట్టుబడి మొదటి సంపుటం రాత పూర్తవగానే ఎంగెల్సును తల్చుకున్నాడు. 1867 ఆగస్టు 15 అర్ధరాత్రి లేఖ రాశాడు. "పుస్తకం చివరి ప్రూపులు చూడటం ఇప్పుడే పూర్తయింది. నీ ఒక్కడి తోడ్పాటు వల్లనే ఇది సాధ్యమైంది. నీవు నా కోసం త్యాగం చేసి వుండకపోతే ఈ మూడు సంపుటాల పని నేనెన్నటికీ పూర్తి చేయగలిగే వాణ్ని కాదు. కృతజ్ఞతతో నిన్ను ఆలింగనం చేసుకుంటున్నా" సెప్టెంబరు 14న ఆ గ్రంథం వెలువడింది కాని రావలసినంత స్పందన రాలేదు. ఆ సమయంలో ఎంగెల్సు ఎంతో సూటిగా దానిలో సారాంశాన్ని పత్రికలలో రాసి ప్రచారమిచ్చాడు. తన మిత్రుడి ఆవిష్కరణలను పెట్టుబడిదారీ మేధావులు కావాలనే తొక్కి పడుతున్నారని ఎంగెల్సు నిరంతరం అంటుండే వారు. అదే సమయానికి మొదటి అంతర్జాతీయ సంస్థ కూడా క్రియాశీల మవడం వారి కృషిని సార్థకం చేసింది. పారిస్ కమ్యూన్‌తో సహా చాలా అనుభవాలు వారు చూశారు. దేశ దేశాలు తిరిగారు.

"అప్పుడు జరిగేదేమంటే ఉత్పత్తి చేసే శ్రామిక వర్గమే అప్పటి వరకూ పెత్తనం చేసిన వారి చేతినుంచి వాటిపై యాజమాన్యం లాగేసుకుంటుంది. అదే సామాజిక విప్లవం అవుతుంది. అని విశదీకరించాడు ఎంగెల్సు. ఇప్పుడు మనం ఎదుర్కొనే చాలా సమస్యలు, సందేహాలకు సమాధానం ఇందులో చూడగలం."

1850ల తర్వాత మార్క్సు దంపతుల ఆరోగ్యం క్షీణించింది. 1881 డిసెంబర్‌లో జెన్నీ మార్క్సు చనిపోతే మరో రెండేళ్ల తర్వాత 1883 మార్చి 14న మార్క్సు కన్నుమూశారు. ఎంగెల్సు రోజూ లాగే ఆ రోజు కూడా మిత్రుణ్ని చూసేందుకు వచ్చాడు. గాఢ నిద్రలో వున్నాడని లెంచెన్ చెప్పింది. తర్వాత "మేమా గదిలోకి వెళ్లాము. అతను ప్రగాఢ నిద్రలో వున్నాడు. మళ్లీ లేవబోడు. ఆయన నాడి వూపిరి ఆగిపోయాయి. ఆ రెండు నిముషాలలోనే ఆయన ప్రశాంతంగా ఏ బాధా లేకుండా కన్ను మూశాడు" అని ఎంగెల్సు తర్వాత స్నేహితులకు రాశాడు. మానవాళికి ఒక తల తగ్గింది. అయితే అది మన కాలంలోనే మహోన్నతమైంది అని మార్క్సును సమాధి చేసినపుడు ఎంగెల్స్ చెప్పాడు. అలా ఆఖరి వరకూ మార్క్సు అడుగులో అడుగై నడిచిన ఎంగెల్సు తర్వాత కాలంలో ప్రపంచ కార్మికోద్యమానికి పెద్ద దిక్కుగా మారాడు. ఆయన మిగిల్చిపోయిన పెట్టుబడి సంపుటాల ప్రచురణ జీవిత ధ్యేయంగా గడిపాడు. మార్క్సు అక్షరాలు భావాలు పంచుకున్న అర్థం చేసుకోగలిగిన సమజ్ఞాని ఆయనే.

ఈ కృషి యావత్తూ ఎంగెల్సు ఎంతో నిరాడంబరంగా హడావుడి ఆర్భాటం లేకుండా చేశాడు. సెంటిమెంట్లను కుమ్మరించుకున్నది లేదు. కుమారుడు ఎడ్గార్ చనిపోయినప్పుడు మాత్రం మార్క్సు దుఃఖ పట్టలేకపోయాడు. "ఈ కాలమంతా నేననుభవించిన యమయాతనల్లో కూడా నీవు నీ స్నేహస్మృతులు మనిద్దరం కలసి ఈ ప్రపంచంలో చెప్పుకోదగిందేదో ఇంకా సాధించగలమనే ఆశ నన్ను నిలబెట్టాయి" అని రాశాడు. ఎంగెల్సు జీవిత విశేషాలు తన సంప్రదాయేతర వివాహం వంటివి కూడా ఆయన ధీరోదాత్తతను ప్రతిబింబించేవే. తన భార్య మరణించిన సమయంలో ఏదో కారణం వల్ల మార్క్సు నుంచి లేఖ రాకపోవడం ఎంగెల్సును బాధించింది. తను రాసిన ఉత్తరంలో మూర్ ఎప్పటిలా సంబోధించకుండా డియర్ మార్క్సు అని సంబోధించగానే మార్క్సు తల్లడిల్లిపోయాడు. జరిగిన పొరబాటు కూడా వెంటనే అర్థం చేసుకుని క్షమాపణ పూర్వకంగా లేఖ రాశాడు. వారిద్దరి స్నేహం అంత అపురూపమైంది కాగా పాశ్చాత్య రచయితలు అందులో లొసుగులు వెతకడానికి లేని విభేదాలు చూపడానికి తంటాలు పడతుంటారు. కాని 400 పేజీల వారి లేఖలు మానవ చరిత్రలో మహత్తర సిద్ధాంతానికే గాక మహోన్నత మైత్రికి కూడా శాశ్వత ప్రతీకలు, సమిష్టి తత్వం సహచర భావన పునాదులుగా సాగవలసిన మహా ప్రస్థానానికి మార్గదర్శకాలు కూడా.

జాతీయ స్ఫూర్తి పక్ష పత్రిక సౌజన్యంతో

# పర్యావరణ పరిరక్షణతోనే ప్రగతి

**అంకితా నాయక్**

వాతావరణ మార్పులను అడ్డుకునేందుకు అవసరమైన పెట్టుబడులు పెట్టటానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నప్పటికీ, పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థికాభివృద్ధి పరుగులు తీస్తుందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణతో ఆర్థిక ప్రగతికి భరోసా ఏర్పడుతుందని, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పరిశోధనల ద్వారా తెలుస్తోంది. మన నగరాలు, పట్టణాలలో నానాటికీ పెరుగుతున్న కాలుష్యపు స్థాయి మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందన్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా కేవలం వాయు కాలుష్యం తోనే ఏటా దాదాపు 70 లక్షల మందికి పైగా ప్రజలు మృత్యువాత పడుతున్నారు. అయితే పర్యావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల వలన ఉబ్బసం, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులతో పాటు జీవనకాలం కూడా తగ్గిపోతుందన్న అంశంతో పాటు ఆర్థిక వ్యవస్థపై తీవ్రభారం పడుతోందన్న విషయాన్ని అర్థం చేసుకోవటలో మనం విఫలమవుతున్నాం. వ్యాధుల బారిన పడుతున్న జనాభా అసమర్థులైన శ్రామిక శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనితో ఉత్పత్తి స్థాయి తగ్గిపోయి ఆర్థిక ప్రగతి కుంటుపడుతుంది. జిడిపి వృద్ధి రేటు ఆధారంగా దేశ ఆర్థిక ప్రగతిని అంచనా వేసే వాతావరణంలో ఈ అంశాలకు సంబంధం లేనప్పటికీ అధ్యయనాలు మాత్రం చీకటిమయమైన భవిష్యత్తును మన కళ్లకు కడుతున్నాయి. 2016లో ప్రపంచ బ్యాంకు నిర్వహించిన అధ్యయనం ప్రకారం భారత్‌లో ప్రజల ఆరోగ్య పరిరక్షణా వ్యయం దేశ జిడిపిలో 8.5 శాతం (దాదాపు 56,000 కోట్ల డాలర్ల) మేర వుందని అంచనా వేసింది. ప్రధాన స్రవంతికి చెందిన జిడిపి వంటి ఆర్థిక సూచీలు జీవావరణ వ్యవస్థకు సంబంధించిన అంశాలను సూచించవు. ఇందులో భూగర్భ జలాల రీ ఛార్జింగ్, పోషకాల ఉత్పత్తి వంటి అంశాలు ప్రధానంగా మనకు కన్పిస్తుంటాయి. అయితే ఇటువంటి అంశాలేవీ ప్రధాన స్రవంతి వృద్ధి, పెరుగుదలను సూచించవు. జీవావరణ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న లావాదేవీలను లెక్కించటంలో మన ఆర్థిక వ్యవస్థల వైఫల్యాలే ఇందుకు కారణం. జీవవైవిధ్య వ్యవస్థ మన నుండి ఏమీ ఆశించకుండానే, మనకు ప్రకృతి ఫలాలను అందిస్తుంటుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి మానవాళికి అందించే ఫలాల విలువ సగటున ఏటా 33 లక్షల కోట్ల డాలర్ల మేర వుంటుందని 1997లో పర్యావరణ ఆర్థికవేత్త రాబర్ట్ కోస్టాంజా, ఆయన సహచరులు అంచనా వేశారు. పర్యావరణానికి, ఆర్థిక వ్యవస్థకు మధ్య సంబంధం నిరంతరం కొనసాగుతూనే వుంటుంది, భవిష్యత్తులో మరింత బలోపేతమవుతుంది కూడా...

**పర్యావరణ విధ్వంసం ఆర్థిక ప్రభావం**

ఆర్థిక ఉత్పాదకతకు జీవావరణ వ్యవస్థ పునాది వంటిది. ఇందులో ఎటువంటి ఆటంకం ఏర్పడినా అది మన ఆర్థిక ఉత్పాదకత ప్రక్రియను ప్రభావితం చేస్తుంది. చెడు ఓజోన్ వంటి ఒక చిన్న కాలుష్య కారకం ప్రాథమిక ఉత్పాదకత నష్టానికి దారి తీస్తుందని ఒక అధ్యయనంలో వెల్లడయింది. మొక్కలు, ఇతర జీవావరణ ఉత్పత్తి తగ్గిపోవటమే ఇందుకు కారణం. మరోవైపు పర్యావరణ క్షీణత ఇప్పటికే మన ఆర్థిక వ్యవస్థపై తన ప్రతికూల ప్రభావాన్ని చూపటం ప్రారంభించింది. ఉదాహరణకు దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) న్యూఢిల్లీలో రియల్ ఎస్టేట్ రంగం దూర ప్రాంతాల నుండి నీటిని రవాణా చేసుకునేందుకు భారీ యెత్తున వ్యయాన్ని భరిస్తోంది. అత్యధిక నీటి వినియోగం, అటవీ ప్రాంతాల నిర్మూలన, కాంక్రీట్ అడవులు పెరిగిపోవటం వంటి అంశాలతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోవటమే ఇందుకు కారణం. రియల్ ఎస్టేట్ రంగంపై పడుతున్న ఈ వ్యయభారం, ఆ రంగంలోని యాజమాన్యాలకు లాభార్జన తగ్గిపోవటంతో పాటు మార్కెట్ కూడా కుదించుకుపోవటానికి కారణమవుతోంది. ఫలితంగా భవిష్యత్తులో అనేక మంది ఉద్యోగాలకు గండిపడటం, జాతీయాదాయం తగ్గటం వంటి పరిణామాలకు ఇది దారితీస్తుంది.

పర్యావరణ క్షీణత దుష్ప్రభావాన్ని ఎదుర్కొంటున్న మరో రంగం పర్యాటక రంగం. 2018లో మన దేశ రాజధాని న్యూఢిల్లీకి వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య 25 నుండి 30 శాతం మేర తగ్గింది. ప్రధానంగా చలికాలంలో వచ్చే పండుగల తరువాత వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయిలో పెరిగిపోవటమే ఇందుకు కారణం. 2017 తరువాత ఆగ్రాలో వాయు కాలుష్యం పెరిగిపోవటం తో ఫుట్‌బాల్ క్రీడను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. కాశ్మీర్‌లోని దాల్ సరస్సు పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా వుంది. అత్యంత రమణీయమైన ప్రకృతి సోయగాలతో పర్యాటకులకు కనువిందు చేస్తున్న ఈ దాల్ సరస్సులో ఇటీవలి కాలంలో ఏటా 9 వేల టన్నులకు పైగా మురికినీరు కలుస్తుండటంతో ఇది కాలుష్య కాసారంగా మారిపోయింది. ఈ కాలుష్యంతో దీనిలోని నీటి రంగు నీలి ఆకుపచ్చ నుండి లేత గోధుమ రంగుకు మారిపోయింది. ఈ విపరిణామాలతో పర్యాటకులు ఈ సరస్సు చుట్టుపక్కలకు కూడా రావటం మానేశారు. దీనితో ఈ సరస్సు పర్యాటకంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడ్డాయి. 2016లో 7.6 లక్షల కోట్ల డాలర్ల ఆదాయంతో పర్యాటక రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తలమానికంగా నిలిచింది. అయితే పెరుగుతున్న కాలుష్యం, పర్యావరణ విచ్ఛిన్నం ఈ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్నే చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వున్న అన్ని దేశాల ప్రభుత్వాలూ పర్యావరణ పరిరక్షణ కోసం భారీ వ్యయాన్నే భరిస్తున్నాయి. వాతావరణ మార్పులపై పోరు జీవన్మరణ సమస్యగా మారిపోయిందన్న వాస్తవాన్ని గ్రహించిన ప్రపంచ దేశాధినేతలు పర్యావరణ పరిరక్షణ కోసం ఈ వ్యయాన్ని భరించేందుకు సిద్ధపడుతున్నారు. ఇటీవలి కాలంలో ఈ అంశానికి పెరిగిన బడ్జెట్ కేటాయింపులే ఇందుకు నిదర్శనం. భారత్‌లో నరేంద్రమోడీ సర్కారు గంగానది ప్రక్షాళన (నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) కార్యక్రమం కోసం 2014 రు.20 వేల కోట్లు కేటాయించింది. ఇంత భారీయెత్తున నిధుల కేటాయింపులతో గంగానది ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ నదిలో కలుస్తున్న కాలుష్యం ఏటా 4,93,400 క్యూబిక్ మీటర్ల పైమాటే. ఇక ప్రపంచ స్థాయిలో పరిశీలిస్తే ప్రపంచ బ్యాంకు

ఐదేళ్ల కాలపరిమితితో వాతావరణ మార్పులపై పోరు కోసం 20 వేల కోట్ల డాలర్ల సహాయాన్ని ప్రకటించింది.

**వాతావరణ మార్పులు, ఆర్థిక వ్యవస్థ**

పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషిలో తాము భాగస్వాములం కాలేక పోవటానికి ప్రజలు ఉద్యోగాలు కోల్పోవటాన్ని ప్రధానంగా ప్రపంచ దేశాలు చెబుతున్నాయి. అయితే గణాంకాలు మాత్రం పరిస్థితిని భిన్నంగా చూపుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ రంగంలో 2030 నాటికి దాదాపు 2.4 కోట్ల ఉద్యోగాలకు అవకాశాలున్నట్లు ఇంటర్నేషనల్ లేబర్ రివ్యూ అంచనాలు చెబుతున్నాయి. 2030 నాటికి విద్యుత్ రంగం ఉద్యోగాల కల్పనలో టాప్‌త్రీలో ఒకటిగా నిలిచే అవకాశాలున్నాయని ఐఎల్‌ఓ (అంతర్జాతీయ కార్మిక సంస్థ) ఈ నివేదికలో చెప్పింది. వాతావరణ మార్పులతో, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 2030 నాటికి దాదాపు 8 కోట్ల ఫుల్‌టైమ్ ఉద్యోగాలు కోల్పోతామని ఐఎల్‌ఓ మరో నివేదికలో చెబుతోంది. ఇది ప్రపంచ జిడిపికి 2.4 లక్షల కోట్ల డాలర్ల నష్టాన్ని కలిగిస్తుందని హెచ్చరిస్తోంది. వాతావరణ మార్పులతో తీవ్రంగా ప్రభావితమయ్యే రంగాలలో బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవనాధారమైన వ్యవసాయం, నిర్మాణ రంగాలే ప్రధానమైనవి. వాతావరణ మార్పులపై పోరుతో లభించే ప్రయోజనాల కన్నా, నిస్తేజంగా వుంటే వచ్చే నష్టాలే ఎక్కువన్న కఠోర వాస్తవాలను ఈ విషయాలు మనకు స్పష్టం చేస్తున్నాయి. వాతావరణ మార్పులు, అభివృద్ధికి అవినాభావ సంబంధం వుందన్న విషయాన్ని రుజువు చేసేందుకు మనకు అనేక ఆధారాలు లభిస్తున్నాయి. శాసనకర్తలు చెబుతున్న అభివృద్ధి అంతా కేవలం డొల్ల మాటలు మాత్రమే. ప్రస్తుతం మన దైనందిన జీవితంలో మనం ఉపయోగించే ప్రతి వస్తువూ మనం కలుషితం చేస్తున్న ప్రకృతి వనరుల నుండి వచ్చేవే. వ్యవసాయోత్పాదనల పెరుగుదల కోసం రసాయన ఎరువులను గుమ్మరిస్తుండటంతో సాగుభూములు సారహీనమైపోతున్నాయి. పాడి, గుడ్లు వంటి ఉత్పాదనల పెరుగుదల కోసం పశువులు, కోళ్ళు తదితరాలకు స్టెరాయిడ్స్ వంటి విషకాలుష్యాలతో కూడిన ఇంజెక్షన్లు చేస్తున్నారు. మనం రోజూ తాగుతున్న నీరు, తింటున్న పండ్లు, కూరగాయలు, మాంసం, పాలు ఇలా ప్రతి ఒక్కటీ మన శరీరాలను గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రభావితం చేస్తున్నాయి. ప్రస్తుతం రోజూ మనం ఖర్చు పెట్టే ప్రతి రూపాయితో మన చావును మనమే కొనుక్కుంటున్నాం. మనం ఖర్చు పెట్టే ఈ సొమ్ము జిడిపికి చేరి అభివృద్ధికి తోడ్పడుతుందన్న ప్రచారంతో మనం ఈ ఉత్పత్తులకు ఆకర్షితులవుతున్నాం. ఏటా జిడిపి పెరుగుదల రేటు లక్ష్యం మన కష్టార్జితాన్ని వెచ్చిస్తూ అనేక రూపాల్లో మనం నష్టపోతున్నాం.

**“రసాయన ఎరువులను గుమ్మరిస్తుండటంతో సాగుభూములు సారహీనమైపోతున్నాయి. పాడి, గుడ్లు వంటి ఉత్పాదనల పెరుగుదల కోసం పశువులు, కోళ్ళు తదితరాలకు స్టెరాయిడ్స్ వంటి విషకాలుష్యాలతో కూడిన ఇంజెక్షన్లు చేస్తున్నారు. మనం రోజూ తాగుతున్న నీరు, తింటున్న పండ్లు, కూరగాయలు, మాంసం, పాలు ఇలా ప్రతి ఒక్కటీ మన శరీరాలను గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రభావితం చేస్తున్నాయి.”**

**సంక్షేమం, వినిమయం మధ్య ఘర్షణ**

జీవన ప్రమాణాలను ఆర్థిక సూచీలు నిర్దేశిస్తుండటమే జీవన నాణ్యత తగ్గిపోతుండటానికి ప్రధాన కారణం. ప్రతి ఆర్థిక సూచీ కూడా మార్కెట్ల కలయిక అన్న విషయం తెలిసిందే. ఏ మార్కెట్‌కయినా ఉత్పత్తి ధర నిర్ణయం ప్రాథమిక సూత్రం. ఈ ధరను నిర్ణయించేది దానిని కొనుగోలు చేసిన వ్యక్తికి అందించే ప్రయోజనం కన్నా ఆ ఉత్పత్తికి ఉన్న డిమాండేనన్నది సుస్పష్టం. అయితే వినిమయ ప్రయోజనం, వినిమయం ఒకటి కాదు ఉదాహరణకు చెప్పాలంటే పొగాకు వినియోగదారుకు అది ప్రతికూల ఫలితాలను అందిస్తుంది. అయితే ప్రయోజనం మాత్రం సానుకూలమైనదే. జీవన ప్రమాణాలకు, జీవన నాణ్యతకు వున్న ఈ వైరుధ్యం రాజకీయ, ఆర్థిక చర్చా వేదికల్లో ఎక్కడా కన్పించదు. మొత్తమ్మీద ఇది మనం ప్రస్తుతం వినియోగిస్తున్న వ్యవస్థలను ధ్వంసం చేస్తుందని చెప్పక తప్పదు. ఇది ప్రపంచాన్ని వ్యతిరేక ప్రయోజనాల దిశలో ముందుకు నెడుతుంది. 'మంచి' ఆర్థిక వ్యవస్థకు ఇది ఏ మాత్రం మంచిది కాదు. పైన పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే వాతావరణ మార్పులపై పోరులో మన ఆరోగ్యాన్ని, ఆర్థిక వ్యవస్థలను పణంగా పెడుతున్నప్పటికీ ఆశించిన వేగంలో పురోగతి లేదన్న విషయం స్పష్టమవుతోంది. కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే మారిపోయే ప్రభుత్వాలు తమ ఓట్ల వేటలో అందుకు పనికిరాని అంశాలను పట్టించుకోకపోవటం ఇందుకు కారణం. ఈ మనం కిందికి పోతున్నప్పటికీ ప్రగతిని చూపే వృద్ధి మోడల్స్‌పై మన ఆర్థికవ్యవస్థ ఆధారపడి వుంది. ఇందులో కూడా పర్యావరణ హీనతకు దోహదపడుతున్న వారిపై ఎటువంటి ఆంక్షలూ లేకపోవటం, వారి చర్యలు జిడిపి వృద్ధిరేటు పెరుగుదలకు తోడ్పడుతుండటం మరో కారణం. ప్రస్తుతం మనం జీవిస్తున్న వినిమయవాద ప్రపంచంలో మనకు చెడు చేసే దానిని తిరస్కరించటం కన్నా, మన చుట్టూ వున్న వస్తువుల సేకరణను గర్వకారణంగా భావిస్తుంటాం.

**ప్రక్షాళనకు ఇదే సమయం**

ఆర్థిక నిపుణులుగా చెప్పుకుంటున్న వారు చూపే వృద్ధి మోడల్స్ కేవలం అర్ధసత్యాలను మాత్రమే మన కళ్లకు చూపుతుంటాయి. మారుతున్న ప్రపంచానికి అవసరమైన అంశాలను ఆర్థికశాస్త్రం చూపలేదు. ప్రపంచం మొత్తం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత సమయంలో ఆర్థిక రంగాన్ని పూర్తి ప్రక్షాళన చేయటం అవసరం. జాన్ మేనార్డ్ కీన్స్ చెబుతున్నదీ, ఇదీ ఒకటి కాదు. కాలం చెల్లిన ఆర్థిక గణంకాల నుండి బయటపడి నిజాయితీ లెక్కలతో జరుగుతున్న విధ్వంసాన్ని అంచనా వేయటం, ముఖ్యంగా జిడిపి అంచనాలలోకి రాని విధ్వంసాన్ని అంచనా వేసి పరిహారం వసూలు చేయటం అవసరం. నదుల్లో కలిసే ప్రతి కలుషిత నీటి బొట్టుకూ, మనం కూల్చివేసే ప్రతి చెట్టుకూ, మనం పీలుస్తున్న ప్రతి యూనిట్ గాలికీ సొమ్మును వసూలు చేసే ఆర్థిక వ్యవస్థ రావాల్సిన అవసరం వుంది. ఆర్థిక ప్రగతిని అంచనా వేసే జిడిపి లెక్కలతో 1934లో సైమన్ కజ్నెట్స్ ముందుకు వచ్చిన తరువాత దెబ్బతింటున్న పర్యావరణం, వాతావరణ మార్పులతో ప్రపంచం వేగంగా మారిపోతోందన్న వాస్తవాన్ని మనం గ్రహించాలి. కొత్త వాస్తవాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి విధానాలను మార్చుకోవాల్సిన సమయం ఇదేనని మనం గ్రహించాల్సిన అవసరం వుంది.

**అనువాదం: వెంకటేశ్వర వరప్రసాద్**

❋

# భారతదేశ కార్మికవర్గం - జాతీయోద్యమం

**టి.చంద్రపాల్**



రచయిత ఇన్సూరెన్సు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఆధునిక పరిశ్రమల ఏర్పాటు క్రమేపీ ఆరంభం కావడంతో పాటు రైల్వే, తపాలా, టెలిగ్రాఫ్ వ్యవస్థల ఆవిర్భావంతో 19వ శతాబ్దపు ద్వితీయార్ధం నుంచి ఆధునిక కార్మికుడి ఉనికి మనకు కనిపించడం ఆరంభ మవుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో దుర్భర పరిస్థితులలో అస్తవ్యస్తంగా ఉన్న కార్మికులు క్రమంగా తమ అస్థిత్వాన్ని చాటుకుంటూ, సమిష్టిగా వ్యవహరిస్తూ, తమ ప్రయోజనాల కోసం పోరాడుతూ ఒక జాతీయస్థాయి వర్గంగా ఆవిర్భవించే ప్రక్రియకు, భారత జాతీయోద్యమం ఎదుగుదలకూ మధ్య అవినాభావ సంబంధం ఉంది.

వాస్తవానికి అప్పటికి ప్రధాన స్రవంతిలోని జాతీయోద్యమం కార్మికుల సమస్యలను పరిగణనలోకి తీసుకోలేదు. కార్మికులు అప్పట్లో దుర్భరమైన, అన్యాయమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రారంభంలో జాతీయవాదులు వారి సమస్యల పరిష్కారం మీద ఏ మాత్రం దృష్టిపెట్టలేదు. అంతేకాదు. యూరోపియన్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల విషయంలో ఒక విధంగానూ, దేశీయ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల విషయంలో మరో విధంగానూ వ్యవహరించారు.

1903-08 మధ్య కాలంలో ఉద్భవించిన స్వదేశీ ఉద్యమం కార్మికోద్యమ చరిత్రలో మైలురాయి. కార్మికసంఘాలు శక్తివంతం కావడం, సమ్మెలను నిర్వహించగలగడం వంటి రెండు ప్రధానమైన పరిణామాలు పారిశ్రామిక సమ్మెలలో కనిపించడం ఈ కాలంలోనే జరిగిందని అధికారిక సర్వే ఒకటి తేల్చిచెప్పింది. ఈ కాలంలో సమ్మెల సంఖ్య విపరీతంగా పెరిగింది. స్వదేశీ నాయకులు సుస్థిరమైన కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడంలోనూ, సమ్మెలనూ నిర్వహించడలోనూ వారికి న్యాయ పరమైన సహకారం అందించడంలోనూ, నిధులనూ సమీకరించడంలోనూ ఎంతో ఉత్సాహంగా పని చేశారు. బి.సి.పాల్, సి.ఆర్.దాస్, లియాఖత్ హుస్సేన్ వంటి జాతీయ నాయకుల సమ్మెచేస్తున్న కార్మికులకు మద్దతుగా ఏర్పాటైన బహిరంగ సదస్సులలో ప్రసంగాలు చేశారు. అశ్విన్ కుమార్ బెనర్జీ. ప్రభాత్‌కుమార్, రాయ్‌చౌదరి, ప్రేమ్‌తాష్ బోస్, అపూర్వకుమార్ ఘోష్‌లను పూర్తిగా అంకితమైపోయిన స్వదేశీ నాయకులుగా చెప్పుకోవాలి.

సమ్మెచేస్తున్న కార్మికులకు మద్దతుగా కలకత్తా వీధుల్లో తరచుగా ర్యాలీలు నిర్వహిస్తుండే వారు. ఊరేగింపులో పాల్గొన్న వారికి దారి పొడవునా ప్రజలు ఆహార పదార్థాలను అందిస్తుండేవారు. మహిళలూ, పోలీస్ కానిస్టేబుళ్ళతో సహా అనేకమంది విరాళాలు ఇస్తుండేవారు. డబ్బు, బియ్యం, బంగాళదుంపలు, ఆకుకూరలు, ఇలా అనేకం విరాళాల రూపంలో అందుతుండేవి. అఖిల భారత స్థాయిలో కార్మిక సంఘాలను ఏర్పాటు చేసే ప్రయత్నం కూడా ఈ కాలంలో జరిగినప్పటికీ, ఆ ప్రయత్నాలు జయప్రదం కాలేదు. యూరోపియన్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకూ, దేశీయ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకూ మధ్య వివక్ష కనబరిచే వైఖరి ఈ కాలంలో కొనసాగుతూనే వుంది.

సమరశీల జాతీయవాదుల కమ్యూనిస్టుల నాయకత్వంలో దేశవ్యాప్తంగా 1927-1929 మధ్య కాలంలో అనేక సమ్మెలు, ప్రదర్శనలూ జరిగాయి. 1927 నవంబర్‌లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు ఇవ్వాలని పిలుపునిచ్చిన నాయకుడు వేలాది మంది కార్మికులు నిరసన ప్రదర్శనల్లో పాలు పంచుకున్నారు. మేడే, లెనిన్‌డే, రష్యన్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా కార్మికుల సదస్సులూ, సమావేశాలు అనేకం జరిగాయి.

కార్మికవర్గంలో ఈ రకమైన సమరశీల భావనలు చోటుచేసుకోవడం వారి రాజకీయ జోక్యం ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేసింది. ముఖ్యంగా జాతీయవాదమూ వామపక్ష పోకడలూ చేయి చేయీ కలపడం ప్రభుత్వాన్ని భయపెట్టింది. దానితో కార్మికోద్యమంపై దాడికి రెండు మార్గాలను ఎంచుకొంది. ఒకవైపు ప్రజాభద్రత చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం వంటివి తీసుకువచ్చి ఒక్కవేటున కార్మికోద్యమానికి నాయకత్వం వహిస్తున్న రాడికల్ భావాలున్న నాయకులందరినీ అరెస్టు చేసి వారిపై మీరట్ కుట్రకేసు మోపింది. మరోవైపు కార్మికోద్యమాన్ని చల్లార్చే విఫలయత్నంలో భాగంగా కొన్నిచర్యలు కూడా ప్రకటించింది. 1929లో కార్మికుల సమస్యలు పరిష్కారానికి రాయల్ కమిషన్ ఏర్పాటు ఇందుకు ఉదాహరణగా చెప్పుకొవచ్చు.

వలసపాలన ఆఖరు సంవత్సరాల్లో కూడా ఆర్థిక సంబంధమైన అంశాలపై దేశవ్యాప్తంగా అనేక సమ్మెలు జరిగాయి. తంతి-తపాలాశాఖ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె ఎంతో ప్రాచుర్యం పొందింది. యుద్ధకాలంలోనూ అనంతరం ఉత్పన్నమైన ఆర్థిక సమస్యలు, అధిక ధరలు, నిజ వేతనం పడిపోవడం కార్మిక వర్గాన్ని దుర్భర స్థితిలోకి నెట్టి సహనం కోల్పోయేటట్టుగా చేశాయి. వారిలో అశాంతి ప్రబలిపోయింది.

స్వాతంత్ర్యం ఇంకెంతో దూరంలో లేదన్న భావన భారత ప్రజల్లో బాగా బలపడింది. దీనితో పాటుగా స్వాతంత్ర్యం ఒక్కటే తమ సమస్యలన్నింటికీ పరిష్కారమన్న నమ్మకం అన్ని వర్గాలూ పెంచుకున్నాయి. కార్మికవర్గం కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. స్వాతంత్ర్యం రావడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న సంపూర్ణ విశ్వాసంతో వారు పోరాడుతూనే ఉన్నారు.

ఈ వ్యాసం భారత స్వతంత్ర పోరాటం రచయిత ఆధిత్యముఖర్జీ, పుస్తక సౌజన్యంతో

❋

# పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రమవుతాయి

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**సోవియట్ యూనియన్ పతనమైన తర్వాత మిగిలిన సోషలిస్టు దేశాలు, లాటిన్ అమెరికాలోని వెనిజులా, ఈక్వెడార్, ఇతర ప్రాంతాల్లోని సోషలిస్టు దిశలో వెళ్లాలను కుంటున్న అన్ని దేశాలపైనా పెట్టుబడి దాడి చేస్తోంది. సమాజ పరిణామ క్రమం ముందుకు వెళ్లాలి కదా! మళ్లీ పెట్టుబడి దాడికి గురై సమాజం వెనక్కి పోవడాన్ని ఎలా చూడలి?**

1990 దశకం ప్రారంభంలో సోషలిస్టు వ్యవస్థ దెబ్బతిన్నది. సోవియట్ యూనియన్, ఇంకా కొన్ని దేశాలలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించబడింది. కొత్త శతాబ్ద ప్రారంభంలో అనేక లాటిన్ అమెరికా దేశాలలో సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో ముందుకు వచ్చిన అభ్యుదయ, వామపక్ష శక్తులు అధికారాన్ని చేపట్టాయి. కానీ గత కొంతకాలం నుండి పెట్టుబడి ఎదురుదాడి ప్రారంభించింది. కుట్రలు, కుతంత్రాలతో విదేశాలలో ప్రభుత్వాలను కూల్చివేయడమో, ఆత్మరక్షణలోకి నెట్టడమో చేసింది. ఇది అభ్యుదయ, వామపక్ష శక్తులకు తీవ్రమైన ఎదురుదెబ్బ. అయితే ఈ ఎదురుదెబ్బకు గురైన దేశాలు శాశ్వతంగా అభివృద్ధి నిరోధక దశలోనే ఉంటాయనుకోరాదు. మళ్ళీ ఉద్యమ శక్తిని కూడగట్టుకుని పెట్టుబడికి వ్యతిరేకంగా ముందుకువచ్చే అవకాశాలు ఉన్నాయి. అటువంటి పోరాటాలు అనేక దేశాలలో పుంజుకుంటున్న దాఖలాలు కూడా మనం చూడవచ్చు.

అయితే సమాజం ఎప్పుడూ ఒడిదుడుకులు లేకుండా, ఆటుపోట్లు లేకుండా, తిరోగమనాలు లేకుండా ముందుకి, అభ్యుదయం వైపుకి సాగుతూనే ఉండాలని మనలో చాలామంది కోరుకుంటారు. ఎదురుదెబ్బ తగిలినపుడు నిరుత్సాహానికి గురవుతుంటాము. కొంతమంది పరిస్థితులు తిరిగి మారతాయని, మళ్ళీ సమాజం పురోగమిస్తుందనే విశ్వాసాన్ని కూడా కోల్పోతుంటారు. కానీ చారిత్రక గమనం పరిశీలిస్తే సమాజ పరిణామం సరళరేఖలాగా ఉండదని, అనేక జిగ్‌జాగ్స్‌తో నడుస్తుందని, అయినా సుదీర్ఘకాలంలో పరిశీలన చేస్తే అది ముందుకే సాగుతుందని అర్థమవుతుంది. విప్లవాలు ఎప్పుడూ జయప్రదమవుతూనే ఉంటాయి, వాటికి ఎదురుదెబ్బలు తగలవు, అవి ఓడిపోవు అని మార్క్స్ కూడా చెప్పలేదు. ఈ సంఘర్షణలో అనేక సందర్భాలలో విప్లవ శక్తులు ఓడిపోయి సమాజం తాత్కాలికంగానైనా వెనక్కి మళ్ళే అవకాశాలు కూడా ఉంటాయని మార్క్స్ చెప్పాడు. ఈ విషయాన్ని మీరు గమనంలో ఉంచుకుంటే మీ ప్రశ్నలోని సంశయానికి సమాధానం దొరుకుతుంది. ఇప్పుడు విప్లవ శక్తులు ఆత్మరక్షణలో ఉండడం ఎంత నిజమో, ఈ పరిస్థితి తాత్కాలికమైనదని తిరిగి విప్లవ శక్తులు పురోగమించే అవకాశం ఉందనడం కూడా అంతే నిజం.

❊

## రాజ్యం - రాజ్యాంగయంత్రం - రాజ్యాంగం

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడినా కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రం చేస్తున్నారు. దానిని బట్టి కమ్యూనిస్టు పార్టీలను పెట్టుబడిదారులు ఎంత ప్రమాదకరమైనవిగా పరిగణిస్తున్నారో అర్థమవు తున్నది. అందుకే వాటిని ఎదగనీయ కుండా అడుగడుగునా అడ్డుపడుతున్నారు. కమ్యూనిస్టు పార్టీల ప్రత్యేకతని దెబ్బకొట్టి ఇవి కూడా అన్ని పార్టీల లాంటివే అని నిరూపించ డానికి కార్పొరేట్ మీడియా నిరంత రాయంగా ప్రయత్నం చేస్తున్నది. కమ్యూనిస్టు పార్టీలపై వ్యతిరేక ప్రచారం చేయడం ద్వారా యువతలో విశ్వాసాన్ని దెబ్బతీయడానికి పూనుకొన్నది. ఈ సవాల్‌ను ఎదుర్కొని నూతన రాజకీయ శక్తిగా కమ్యూనిస్టు పార్టీలను తీర్చిదిద్దడం ద్వారానే ఈ సమాజాన్ని మార్చ గలం. సామాజిక మార్పు కోసం కొనసాగే పోరాటాన్ని కొనసాగిస్తూనే అందులో తక్షణ సాధనంగా ఉన్న రాజ్యాంగాన్ని సైతం కాపాడు కోవాలి. ఈ పోరాటాల్లో కలిసి వచ్చే ప్రజా స్వామ్య శక్తులను కూడగట్టుకోవాలి. తద్వారా మరో ప్రపంచం కోసం ముందడుగు వేయాలి.

❊

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# కమ్యూనిస్టులు సంస్కరణోద్యమ నాయకులు

(2వ పేజీ తరువాయి)

మంత్రాలు నేర్పించారు. ఆ ప్రాంతంలో వైష్ణవ గుడి ట్రస్టీలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలుసుకుని 200 మంది దళితుల భుజాలపై శంఖు. చక్రం గుర్తులను వేయించి వారు ఎన్నికలలో పాల్గొనేలా దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసేందుకు తయారు చేసారు. ఇది బ్రాహ్మణులకు ఆగ్రహాన్ని తెప్పించింది. వారు సివిల్ కోర్టులో దావా వేశారు. అది హై కోర్టును చేరింది. రామమూర్తి ఇచ్చిన తర్ఫీదుతో దళితులు కోర్టులో న్యాయమూర్తులను తమ వాదనతో ఒప్పించగలిగారు. తీర్పు వారికి అనుకూలంగా తెచ్చు కోగలిగారు. ఇదొక చారిత్రాత్మక తీర్పు. బ్రాహ్మణులకు ఇష్టం లేకపోయినా దళితులు ఆలయ ప్రవేశం చేయగలిగారు. గాంధీ గారి 'మనసులు మారాలి' అనే విధానానికి భిన్నంగా, ఇక్కడ పురోగతిని బలవంతంగా గుర్తించేటట్టు చేయడం జరిగింది. అప్పటికే రామ్మూర్తికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నాయి. ఆ పార్టీ వ్యవస్థాపక మహాసభకి కూడా హాజరయ్యారు. సామాజిక సంస్కరణోద్య మాలలో ఆయన చాలా చురుకుగా ఉండేవారు. అంతేకాదు, వాటితో పాటు కార్మికులను సంఘటితం చేయడంలో, కార్మిక సంఘాలు నిర్మించడంలో కూడా ప్రముఖపాత్ర పోషించారు. రామ్మూర్తితో పాటు, పి జీవానందం, బి. శ్రీనివాసరావు కూడా సామాజిక సంస్కరణోద్యమాలలో కీలకపాత్ర పోషించారు. జీవానందం పెరియార్ రామస్వామి నిర్మించిన ఆత్మ గౌరవ ఉద్యమంలో చురుకుగా పనిచేసేవారు. ఆ తరువాతి కాలంలో ఆయన ఒక ప్రముఖ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడయ్యారు. శ్రీనివాసరావు భూస్వాముల అణచివేతకు, కుల అణచివేతకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక పోరాటాలు చేసారు.

కేరళ ప్రజా నాయకుడు ఏ కె గోపాలన్ కూడా ఇదే బాటలో నడిచారు. నాడున్న వివకను అంగీకరించక, దానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసారు. అందులో ఒకటి గురువాయూర్ గుడి సత్యాగ్రహంగా పేరుపొందిన పోరాటం. ఇది దళితుల ఆలయ ప్రవేశాన్ని కోరుతూ చేసిన పోరాటం. అగ్రవర్ణాల వారు గోపాలన్‌ని విపరీతంగా కొట్టారు. ఖైదు చేయించారు, హింసించారు. ఇన్ని హింసలను భరించి కూడా ఆయన ఉద్యమంలో పాల్గొంటూనే ఉన్నారు. ఈ పోరాటమే దేశం ఆయనని గుర్తించేటట్టు చేసింది. పి. కృష్ణ పిళ్ళై గురువాయూర్ ఉద్యమంలో పాల్గొన్న మరో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు. ఇ ఎం ఎస్ నంబూద్రి పాద్, పి కృష్ణ పిళ్ళైలు, ఏ కే గోపాలన్ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరేందుకు, ఆ తరువాతి కాలంలో కమ్యూనిస్టు పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకోడంలోనూ సహాయం అందించారు. నంబూద్రిపాద్ జాతీయోద్యమంలో పాల్గొంటూ కుల సంస్కరణల ఉద్యమంలో పాల్గొనడం అత్యంత అవసరమని విద్యార్థి దశ నుండి కూడా నంబూద్రిపాద్ వ్యాసాలు వ్రాస్తూండేవారు. నంబూద్రి కులంలో పుట్టడం వలన ఆ కులంలోని వెనుకబాటుతనం, మహిళల దురవస్థలు, ఇతర చెడు సంప్రదాయాలు ఆయనకి బాగా తెలుసు. విధవా వివాహాలు చేయాలనీ బహు భార్యత్వం పనికి రాదని ఆయన చురుకుగా ఉద్యమాలు నడిపారు. ఆనాడు నంబూద్రి కులంలో పాటిస్తున్న పరదా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. స్త్రీలకు వక్షస్థలం కప్పుకునే హక్కు గురించి కూడా పోరాటాలు చేసారు. మొదటిసారిగా ఇ ఎం ఎస్ ని అరెస్ట్ చేసిన తరువాత ఆయన పెద్దన్న ఆయనతో కుటుంబ సంబంధాలు తెంపుకున్నారు. జైలుకు వెళ్లి వచ్చినవారిని వెలివేయడం ఆనాటి నంబూద్రి కుటుంబాల సంప్రదాయం. ఇటువంటివి ఇ ఎం ఎస్‌ను సామాజిక, ఆర్థిక స్వేచ్ఛ కోసం చేస్తున్న పోరాటాల నుండి వెనక్కు మరల్చలేదు. సోషలిస్టు భావాల వైపుకే పయనం కొనసాగించారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. ఆ తరువాత దాని అఖిల భారత సహాయ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆ తరువాతి కాలంలో కేరళలోని మొత్తం కాంగ్రెస్ సోషలిస్టు పార్టీయే కమ్యూనిస్టు పార్టీగా మారిపోయింది.

పి రామ్మూర్తి, ఇ ఎం ఎస్ నంబూద్రిపాద్, ఏ కె గోపాలన్ - అందరూ, కమ్యూనిస్టు పార్టీయే నిజమైన ప్రత్యామ్నాయం అని తాము తెలుసుకోడంలో పి సుందరయ్య పాత్ర ఉందని ఒప్పుకున్నారు. సుందరయ్యగారు తన రాజకీయ జీవితాన్ని వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయడంతో ప్రారంభించారు. వ్యవసాయ కూలీలలో దళితులే అత్యధికం. దళితుల పట్ల వివక్షను, అగ్రవర్ణాలవారు దళితులను తమ ఇళ్లలోకి రానివ్వకపోవడాన్ని, అస్పృశ్యత పాటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వ్యవసాయ కార్మికులకు మొట్టమొదటి సారిగా కార్మికసంఘాన్ని ఏర్పాటు చేసారు. దళితులతో పాటు అగ్రవర్ణాలకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు. ఇంట్లో అస్పృస్యతను వ్యతిరేకించడమే కాక వ్యవసాయ కూలీలతో పాటు పొలంలో సుందరయ్య పనిచేసేవారు. వారితోపాటే భోజనం చేసేవారు. వారి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించేవారు. వారికోసం ఒక నిత్యావసర వస్తువుల దుకాణాన్ని కూడా పెట్టారు. ఈ విధంగా ఆయన వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే కాదు. సంక్షేమ కార్యక్రమాల ద్వారా, ప్రత్యామ్నాయ మార్గాలను కూడా చూపించారు. ఇందులో భాగంగానే తన పేరులో ఉన్న కులంపేరును కూడా తొలగించుకున్నారు. సమానత్వ ఆలోచనల దిశగా పయనిస్తూ, కమ్యూనిస్టులు దళితులలో ఆ ఆలోచనలను ప్రచారం చేసే ప్రయత్నాలు చేసారు. సామాజిక అణచివేతకు, ఆర్థిక దోపిడీకి కారణాలు చెప్పే ప్రయత్నాలు చేసారు. కమ్యూనిస్టు పార్టీ జండా కింద సంఘటితం చేసారు. వ్యవసాయ కార్మికులలో సుందరయ్య, బసవపున్నయ్యలు ఎంతో మార్గదర్శకంగా కృషి చేయడం వలననే, ఆంధ్రప్రదేశ్‌లో ఆనాడు కమ్యూనిస్టులను 'దళితుల పార్టీ' అని పిలిచేవారు.

మార్క్సిజం లెనినిజం సిద్ధాంతం, కమ్యూనిస్టు పార్టీ మాత్రమే సమ సమాజాన్ని స్థాపించడానికి చోదక శక్తిగా ఉంటాయని కమ్యూనిస్టు మార్గ దర్శకులు ఆచరణ ద్వారా చూపించారు. వారు అందుకు అనేక రకాల వర్గ, ప్రజా సంఘాలను నిర్మించారు. సామాజిక అణచివేతను ఎదుర్కోడానికి అనేక పోరాటాలు చేసారు. వీటన్నటిని సమసమాజ స్థాపనలో భాగంగానే చూసారు. ఈ ప్రయత్నాల వలన పార్టీ పునాది బలపడింది. అదే బ్రిటిష్ ప్రభుత్వం విశృంఖలంగా కొనసాగించిన అణచివేతను ఎదుర్కొని నిలిచేందుకు సహకరించింది. ముఖ్యంగా 1930 రెండో భాగంలో కమ్యూనిస్టు ఉద్యమం విస్తరించడానికి తోడ్పడింది.

### 1928-1935 మధ్య కాలంలో కొన్ని సైద్ధాంతిక సమస్యలు

1928లో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆరవ మహాసభ ప్రభావం భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీపై తీవ్రంగా పడింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆరవ మహాసభలో, రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మహాసభలో (1920) లెనిన్ సలహా మేరకు ఆమోదించిన వలసవాద సిద్ధాంత అవగాహనకి సవరణ చేయడం జరిగింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్

అయిదు, ఆరు మహాసభల మధ్యకాలంలో అనేక దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలలోని ప్రతిఘాతుక - అవకాశావాద గ్రూపులు బహిష్కరించబడ్డాయి. ట్రాట్స్కి ఇజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి కూడా ఇంటర్నేషనల్ ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చింది. పైగా చైనాలో జరిగే సంఘటనలు ఆరవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌పై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. ఇవన్నీ కలిసి కామింటర్న్ వలస విధానం పట్ల కొత్త అవగాహన ఏర్పరచు కొనేటట్టు చేసాయి.

ఈ సభలో వివిధ దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు అనుసరించాల్సిన వ్యూహం, ఆయా దేశాలలోని పెటీబూర్జువా పార్టీలు, గ్రూపులు అనుసరిస్తున్న రాజకీయ, నిర్మాణ విధానాలకు భిన్నమైన ప్రత్యామ్నాయ విధానాలతో ఉండాలని నిర్దేశించింది. "విప్లవ పోరాటాలకు అవసరమైనంత వరకు, కొన్ని పరిస్థితులలో తాత్కాలికంగా కమ్యూనిస్టు పార్టీలు జాతీయ విప్లవోద్యమంతో కలవవచ్చు. అయితే ఆ విప్లవోద్యమం నిజంగానే విప్లవాత్మకంగా ఉండాలి. పాలనాధికారానికి వ్యతిరేకంగా పోరాడుతుండాలి. కమ్యూనిస్టులు, రైతులు, దోపిడీకి గురవుతున్న విస్తృత ప్రజా బాహుళ్యంలో విప్లవ చైతన్యాన్ని పెంపొందిం చేందుకు కమ్యూనిస్టులు ఇస్తున్న శిక్షణకు గాని, చేసే నిర్మాణ కృషికి గాని వారి ప్రతినిధులెవ్వరూ అడ్డు పడకూడదు."

ఈ సిద్ధాంతం భారతదేశానికి సంబంధించి నంత వరకు ఒక ముఖ్యమైన సూచన చేసింది. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. ఎందుకంటే భారతదేశంలో ఆనాడున్న ప్రత్యేకమైన పరిస్థితులు ఇటువంటి పార్టీలను సునాయా సంగా సాధారణ పెటిబుర్జువా పార్టీలుగా మార్చేయగలవు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్నుండి దేశాన్ని విముక్తి చేయడం, వ్యవసాయ విప్లవం సాధన కోసం భూస్వామ్య వ్యవస్థ అవశేషాలను నిర్మూలించడం, దేశంలో సోవియట్ తరహా కార్మిక కర్షక నియంతృత్వాన్ని నెలకొల్పడం కమ్యూనిస్టుల మౌలిక కర్తవ్యం. ఈ కర్తవ్యాలను సాధించాలంటే బలమైన కమ్యూనిస్టు పార్టి నిర్మాణం జరిగితీరాలి. అది శ్రామికవర్గానికి, రైతులకు, ఇతర శ్రమజీవులకు నాయకత్వం వహించి, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం చేయగలుగుతుంది. దేశంలో చెల్లాచెదురుగా ఉన్న వివిధ కమ్యూనిస్టు గ్రూపులు, వ్యక్తుల ఐక్యతే ఈ నాటి కమ్యూనిస్టుల ప్రథమ కర్తవ్యం."

కామింటర్న్ ఆరవ మహాసభ చర్చించిన ముఖ్యమైన అంశాలలో ఒకటి జాతీయ విముక్తి ఉద్యమాలు. ఆరవ మహాసభలో ఆమోదించిన ఈ వలసవాద సిద్ధాంతంలోనే జాతీయ బూర్జువావర్గ పాత్ర, జాతీయ స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించిన వ్యూహం, ఎత్తుగడలలో కొన్ని వైరుధ్యాలు, పొరపాటు ప్రతిపాదనలు ఉన్నాయి. ఉదాహరణకు 'జాతీయ బూర్జువావర్గం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో చెప్పుకోదగ్గ శక్తి కాదని' మహాసభ అంచనా వేసింది. కూసినెన్ ఆరవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను అంచనా వేస్తూ కామింటర్న్‌లో ఒంటెత్తువాద పోకడలు ఉన్నాయని సి పి ఎస్ యు 20వ మహాసభలో (1954) ఒప్పుకున్నారు.

కార్మికవర్గ స్వరూపాన్ని, స్వతంత్ర పోరాటంలో వ్యవసాయక విప్లవం ప్రాధాన్య తను కామింటర్న్ ఆరవ మహాసభ సరిగానే విశ్లేషించింది. ఇంతకు ముందు సూచించిన సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్యవేదిక ఎత్తుగడల ఆలోచన నుండి ఇప్పుడు గణనీయంగా మార్పు చెందింది. అయితే వలసదేశాలలోని స్వతంత్ర పోరాటాలలో కమ్యూనిస్టుల బలాన్ని, జాతీయోద్యమానికి కార్మికవర్గం నాయకత్వం వహించగల శక్తిని అతిగా అంచనా వేసింది. నిజానికి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ అంచనా వేసుకున్నట్టుగా అప్పటికింకా 'వ్యవస్థ కుప్పకూలి పోయే" స్థితిలో లేదు. కమ్యూనిస్టులు వలసవాద వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించే స్థితిలో లేరు. అయినప్పటికీ సౌమ్యేంద్రనాథ్ టాగూర్ డబ్ల్యుపిపి కి మద్దతుగా మాట్లాడి నప్పటికీ భారత ప్రతినిధి బృందం తీర్మానానికి మద్దతిచ్చింది. కామింటర్న్ ఇచ్చిన దిశానిర్దేశం భారతదేశ కమ్యూనిస్టులలో ఒక తీవ్రమైన రాజకీయ, నిర్మాణ గందరగోళాన్ని సృష్టించి ంది. కామింటర్న్ దిశానిర్దేశం మేరకు కమ్యూనిస్టు పార్టీ కలకత్తాలో అఖిల భారత వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ (1928) మహాసభ తరువాత ఒక సమావేశం ఏర్పాటు చేసింది. ఆ సమా వేశంలో వలసవాద వ్యతిరేక సిద్ధాంతాన్ని ఆమోదిస్తూనే, అఖిల భారత కమ్యూనిస్టు పార్టీని బహిరంగంగా ఏర్పాటు చేయగలమో లేదో పరీక్షించ వలసి ఉంటుందని తీర్మానించింది. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీని రద్దచేస్తున్నట్టు నిర్ణయం తీసుకోలేదు.

'కార్మికులందరికీ అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టో' అన్న ప్రకటనా పత్రంలో కామింటర్న్ సూచించిన బాట యొక్క ప్రతిబిం బం స్పష్టంగా కనిపించింది. ఈ ప్రకటనలో, కమ్యూనిస్టు పార్టీని వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీకి సమాంతరంగా అభివృద్ధి చేయవలసిన అవసరం ఉన్నదన్న కామింటర్న్ వాదనను సమర్ధించుకుంది. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీని కామింటర్న్ ఒక 'తప్పనిసరైన దశ'గా చిత్రీకరించింది. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీకి మద్దతు ఇవ్వమని, కమ్యూనిస్టు పార్టీని 'వెంటనే' ఏర్పాటు చేసుకోమని, 'మీరు విజయం సాధించాలంటే సైన్యాన్ని సిద్ధం చేసుకోవాలని,' కార్మికులు, కార్మికసంఘాలకు మేనిఫెస్టో పిలుపునిచ్చింది. భారతదేశంలోని కమ్యూని స్టులు కామింటర్న్ సూచనలతో కొంతమేరకు సర్దుబాటు చేసుకునే ప్రయత్నం ఈ మేనిఫెస్టో. అయితే ఇంకా ఏ నిర్ణయం తీసుకోక మునుపే 1929 మార్చిలో కమ్యూనిస్టులపై మీరట్ కుట్ర కేసు మోపబడింది. భారతదేశ కమ్యూనిస్టులకు ఇది పెద్ద ఎదురు దెబ్బ.

1930లో ఆమోదించిన కార్యాచరణ వేదికలో కామింటర్న్ ఆరవ మహాసభ సూచించిన సూత్రాలు ఉన్నాయి. అందులో " భారతదేశ విప్లవానికి పెద్ద ప్రతిబంధకం జాతీయ కాంగ్రెస్ లోని వామపక్షవాదులుగా ఉండి, స్వతంత్ర పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న జవహర్ లాల్ నెహ్రూ, బోస్, గిన్వాలా మొదలైన నాయకుల విప్లవ పదజాలం." అని ఉంది. ఈ అవగాహన 1930-32 మధ్య కాలంలో ఒంటెత్తు పోకడలకు దారితీసి పార్టీ ప్రతిష్టకి తీవ్రంగా భంగం కలిగించింది.

1930లలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఆర్థిక సంక్షోభం రానున్నదని కామింటర్న్ ముందే పసిగట్టింది. ఇది సామ్రాజ్యవాదులలో వైరుధ్యాలను తీవ్రతరం చేస్తుందని, పెద్ద ఎత్తున విప్లవాలు పెల్లుబికే అవకాశాలు కల్పిస్తుందని కమ్యూనిస్టు పార్టీలకు సూచించింది. ఈ పెరిగిన వర్గ వైరుధ్యాలు రాజ్యం మరింతగా అణచివేతలకు పాల్పడ డానికి, ఫాసిజానికి దారితీస్తుందని కూడా హెచ్చరించింది.

కానీ 1932లో జరిగిన పన్నెండవ ప్లీనంలో మాత్రమే సంక్షోభంలో చిక్కుకున్న పెట్టుబడిదారీ విధానాన్ని ఎదుర్కోడానికి ప్రజలను సమీకరిం చాలని, పెరుగుతున్న ఫాసిస్టు కుతంత్రాలకు పరిష్కారాలను వెతకాల్సిన అవసరం ఉందని గుర్తించింది. ఈ ప్లీనంలోనే ఐక్య వేదికల ఏర్పాటు విధానం దిశగా కామింటర్న్ తొలి అడుగు వేసింది. ఆ తరువాత 1935లో జరిగిన కామింటర్న్ ఏడవ మహాసభ ఇదే విధానాన్ని ఆమోదించింది.

1932 మేలో కామింటర్న్ అధికార పత్రిక ఇంప్రెకార్‌లో కామింటర్న్ మద్దతుతో చైనా, గ్రేట్

బ్రిటన్, జర్మన్ కమ్యూనిస్టు పార్టీలు రాసిన ఒక బహిరంగ లేఖ ప్రచురించబడింది. కొమిన్‌టర్న్ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలిపాయి. బూర్జువా కాంగ్రెస్ నాయకత్వానికి, కార్మికులలో, రైతులలో, ఇతర పట్టణాలలో నివసించే 'పెట్టి బూర్జువాజి 'కి 'తేడాను' ఈ లేఖలో గుర్తించింది. పెటిబుర్జువాజికి కాంగ్రెస్ పార్టీ 'ద్రోహ బుద్ధి' అర్ధం కాక దానిని అనుసరిస్తుంటుంది. అందు వలన కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి ప్రజా ప్రతిఘటనలో కమ్యూనిస్టులు పాల్గొనాల్సిన అవసరం ఉంది. అదేసమయంలో 'కమ్యూనిస్టుల నినాదాలను ఆందోళనలను' ముందుకు తీసుకెళ్లాలి. ఈ లేఖలో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ కార్యక్రమాలలో పాల్గొనాలని దిశానిర్దేశం చేయడం వలన కమ్యూనిస్టు పార్టీ ఒంటరిపాటు కాకుండా ప్రజాసమూహంలో కలిసిపో గలిగింది. 1933లో చైనా కమ్యూనిస్టు పార్టీ భారతదేశ కమూనిస్టు పార్టీకి మళ్ళీ ఒక బహిరంగ లేఖ వ్రాసింది. అయితే ఈ బహిరంగ లేఖలు పార్టీలోని ఒంటెత్తు పోకడలను నిలవరించలేకపోయాయి. పార్టీ పునరుజ్జీవం పొందడానికి ప్రయత్నించినప్పటికీ స్వతంత్ర పోరాటంలో జాతీయ బూర్జువాజి ప్రతికూల దృక్పథాన్ని మార్చలేకపోయింది. కమ్యూనిస్టుల కేంద్రీకరణ, బూర్జువాజి తప్పిదాలను బహిరంగ పరచడానికి మాత్రమే పరిమితమయింది. అంతర్జాతీయ పరిస్థితులలో వచ్చిన మార్పులు, తరువాతి కాలంలో కొమిన్‌టర్న్ విధానాలలో వచ్చిన మార్పులు కమ్యూనిస్టులు అనుసరించే ఎత్తుగడలను కొంతవరకు సవరించగలిగాయి.

కొమిన్‌టర్న్ ఏడవ మహాసభ (1935) జాతీయ వలస దేశాలలో, అర్ధ వలస దేశాలలో జరిగే స్వతంత్ర పోరాటాలకు, ఫాసిస్టు వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక పోరాటాలకు ఉన్న దగ్గరి సంబంధాన్ని ఎత్తి చూపింది. ఈ దేశాలలో ఐక్య వేదికలంటేనే సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య వేదిక. జాతీయ బూర్జువావర్గం సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమానికి వెన్నుపోటు పొడుస్తున్నారన్న నిరాధార అభియోగాన్ని మహాసభ పూర్తిగా తోసి పుచ్చింది. దేశంలోని సంస్కరణవాదులతో కలిసి పనిచేయాలని, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించాలని కమ్యూనిస్టులకు పిలుపునిచ్చింది. అప్పటి అంతర్జాతీయ పరిస్థితులలో భారతదేశ కమ్యూనిస్టుల పాత్రను గురించి డిమిత్రోవ్ తన ప్రసంగంలో "భారతదేశంలో కమ్యూనిస్టులు, ప్రజలు పాల్గొనే సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యక్రమాలకు మద్దతునివ్వాలి. పాల్గొనాలి


ఏ.కె. గోపాలన్

గానీ జాతీయ సంస్కరణవాదుల నాయకత్వంలో జరిగే ఉద్యమాలకు కాదు. కమ్యూనిస్టులు వారి రాజకీయ, నిర్మాణపరంగా స్వతంత్రంగా వ్యవహరిస్తూనే, భారత జాతీయ కాంగ్రెస్ అంతర్గత నిర్మాణంలో చురుకుగా పనిచేయాలి".

ఈ అవగాహననే మరింత మెరుగు పరుస్తూ 1936లో గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులయిన రజని పామిదత్, బెన్ బ్రాడ్లీలు, 'భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజావేదికను' ఏర్పరచుకోవాలని సూచిస్తూ, 'దత్-బ్రాడ్లీ సిద్ధాంతం' ప్రచురించారు. ఈ సిద్ధాంతం భారత కమ్యూనిస్టు ఉద్యమంపై అత్యంత శక్తివంతమైన ప్రభావాన్ని చూపింది.

### దత్ బ్రాడ్లీ సిద్ధాంతం

1936 ఫిబ్రవరి 29న కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పత్రిక ఇంప్రెకార్‌లో దత్ బ్రాడ్లీ సిద్ధాంతం ప్రచురించబడింది. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు శరవేగంగా మారుతున్న నేపథ్యంలో ఈ సిద్ధాంతవ్యాసం ప్రచురించబడింది. ఒకవైపు అంతర్జాతీయంగా ఫాసిజం ముందడుగు వేస్తున్నది. మరోవైపు దేశంలో సహాయ నిరాకరణోద్యమం నిలిపివేయబడింది. దానితో జాతీయో ద్యమంలో పాలుపంచుకుంటున్న యువతరం తీవ్ర నిరుత్సాహానికి లోనయింది. 1934లో ప్రారంభించబడిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సి ఎస్ పి)వలస దేశాలను గురించిన మార్క్సిస్టు అవగాహనతో ప్రభావితమైంది. సి ఎస్ పి అవిర్భావంతో ఒక వేర్పాటువాద వ్యతిరేక ఆలోచనా ధోరణి అభివృద్ధి చెందింది. సి ఎస్ పిలో ఎక్కువ మంది సోషలిజం సాధనకు భారత జాతీయ కాంగ్రెస్ తనకుతానే ఒక ఆయుధంగా మారుతుందని ఆశించారు. ఉగిసలాటలకు, మోసాలకు లోనుకాకుండా కాంగ్రెస్‌ను నిలపాలని, అందుకోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటాలలో పాల్గొనాలని, తద్వారా బూర్జువాజి భాగోతాలను బట్టబయలు చేయాలని కమ్యూనిస్టులు, సోషలిస్టులు తమ ప్రధాన కర్తవ్యంగా భావించారు. ఈక్రమంలో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ నిర్ణయాలనన్నిటిని వ్యతిరేకిస్తున్నప్పటికీ, కాంగ్రెస్‌లోని బూర్జువా నాయకత్వం తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలకు, ఆ నిర్ణయాలను విధేయతతో ఆమోదిస్తూ వాటిని అమలు చేస్తున్న దాని అనుచరులకు మధ్య బేధాన్ని చూడడం మొదలు పెట్టింది. అలా ఆమోదిస్తున్న క్రమంలోనే మొదలయింది సి ఎస్ పి సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక. దత్ బ్రాడ్లీ సిద్ధాంతం ప్రధానంగా ఈ కింది ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించింది.

ఈనాడున్నస్థితిని మార్చడం ఎలా?

మనం అందరం (బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించేవారు) ఎలా కలవగలం?

అందరం కలిసి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించటానికి శక్తివంతమైన ఉద్యమాన్ని నిర్మించడానికి ప్రజలను ఎలా సమీకరించగలం?

మనం ఎన్నుకున్న జాతీయ ప్రతినిధుల విధానాలు ఎలా ఉండాలి? సామ్రాజ్యవాదాన్ని ఓడించే జాతీయ పోరాటాల దిశ భవిష్యత్తులో ఎలా ఉండాలి?

"ఇప్పుడు ప్రధానంగా కావలసింది సామ్రాజ్యవాద శక్తులను ఎదిరించే పోరాట శక్తుల ఐక్యత. ఇప్పటికే ప్రతీఘాత, దోపిడీ శక్తులు ఉన్నాయి, అవి ఎదుగుతున్నాయి కూడా. వాటికి వ్యతిరేకంగా విజయవంతంగా పోరాటాలు చేయడానికి ఈ ఐక్యత తప్పనిసరి. కానీ ఐక్యత అంటే ఏమిటి?

ఈ రోజు ఐక్యత ఐక్యవేదికలు అని అందరు మాట్లాడుతున్నారు. అనేక ప్రతిపాదనలు ఈ పేరుమీద వస్తున్నాయి.

"సామ్రాజ్యవాదులతో సహకరించి ఎలాగయినా అధికార పీఠం మీద ఎక్కి కూచోవాలనుకునే మితవాద శక్తుల నుండి, బ్రిటిష్ పాలకుల స్నేహితుల నుండి కూడా ఇటువంటి ప్రతిపాదనలు వస్తున్నాయి.... సామ్రాజ్యవాదులకు తమ సేవలను వారు కొనసాగించుకోవాలని నిర్ణయించుకుంటే హృదయపూర్వకంగా వీటిని స్వాగతించవచ్చు. ఎందుకంటే వీరికి ప్రజల మద్దతు లేదు. అందువలన అధికారంలో ఒక స్థానాన్ని గెలుచుకుని తద్వారా వారి కార్యక్రమాలను కొనసాగించుకోవాలని ఆశపడుతున్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని తాకట్టు పెట్టి బ్రిటిష్ వారితో నేయ్యమందే ప్రయత్నం ఐక్య వేదికలను బలహీన పరుస్తుంది కానీ బలపరచదు.

"అందువలన ఐక్యత అన్నది ఒక

ఊహాజనితం కాదు. అది సామ్రాజ్యవాద వ్యతిరేకత మూలాలుగా గల ఐక్యత. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత ప్రజలందరూ ఐక్యంగా కలవాలని మనం కోరుకోవచ్చు. కానీ విదేశీ పరిపాలనకు వ్యతిరేకంగా నూటికి నూరు శాతం భారత ప్రజలందరూ ఈ ఊహ జనిత 'ఐక్యత'లో భాగస్వాములవుతారని అనుకోలేము. కొందరి ప్రయోజనాలు బ్రిటిష్ వారితో ముడిపడి ఉన్నాయి. ఉదాహరణకి రాజులూ, భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, ప్రతిఘాత మతతత్వ, జాతి బేధాలపై ఆధారపడిన రాజకీయవాదులు... వీరంతా సామ్రాజ్య వాదానికి అనుకూలంగా ఉండవలసిందే. స్వతంత్ర పోరాటాలు చేసే ప్రజల శక్తిని అంచనా వేసేటప్పుడు సామ్రాజ్యవాద పాలనలో ఉన్న ప్రజల వాస్తవ వర్గ పొందికను దృష్టిలో పెట్టుకోవాలి. "కానీ, ప్రజలలో అత్యధికులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉండవచ్చు. అంటే ప్రజలలో అత్యధికులు సామ్రాజ్యవాద పాలన వలన బాధలు పడుతున్నవారు, వారితోపాటు స్వతంత్ర పోరాటానికి మద్దత్తు నిచ్చేందుకు సిద్ధంగా

ఉన్నమరికొన్ని ఇతర తరగతుల ప్రజలు కూడా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి కలిసి వస్తారు.

'ఆ విధంగా ఐక్యతకు మౌలికంగా ఉండ వలసిన లక్షణాలు:

1. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడడం, ఇప్పుడున్న బానిస వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాడడం, భారతదేశ సంపూర్ణ స్వాతంతం కోసం పోరాడడం.

2. కష్టజీవుల అవసరాలకోసం క్రియాశీలంగా పోరాడడం. ఇటువంటి భారతీ యుల ఐక్యతే మనకు కావలసింది– సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడడానికి సామ్రాజ్య వాద వ్యతిరేక ఐక్య ప్రజావేదిక మనకు కావాలి.

''మనం వామపక్షవాదులం, అనేక పర్యాయాలు ఇప్పుడున్న కాంగ్రెస్ నాయకత్వాన్ని, కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎత్తుగడలను విమర్శిం చాము. ఎన్నో విధానాలు, నిర్ణయాలు తప్పని తేలిపోయాయి... అవి అసలైన జాతీయ పోరాటాన్ని ఘోరంగా దెబ్బతీశాయి. సామ్రాజ్య వాదానికి పూర్తిగా లొంగిపోయి వున్నాయి. వాటికి కారణం ఇప్పుడు నాయకత్వ స్థానంలో ఉన్న బూర్జువా నాయకులు. వారి ప్రయోజనాలు సాధారణ ప్రజల ప్రయోజనా లకు విరుద్ధంగా ఉంటాయి. జాతి ప్రయోజనా లకు కూడా భిన్నంగా ఉంటాయి... ఈ విధానాలను విమర్శ చేయడం అంటే ఏ విధంగానూ కాంగ్రెస్ లోని సాధారణ ప్రజలను విమర్శించడం కాదు. నాయకత్వాన్ని లేదా ప్రత్యేకంగా విధానాలను వ్యతిరేకించడం అంటే కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న, అసంఖ్యాకంగా ప్రజలు పాల్గొంటున్న జాతీయ పోరాటాలకు సహకరిం చడం, బలపరచడమే. "కావలసిందల్లా జాతీయ కాంగ్రెస్ సాధించిన ఐక్యతను బలపరచడం, మరింత విస్తృతపరచడం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజా సంఘా లను, నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం.

''అందువలన ప్రప్రథమంగా చేయ వలసినది, జాతీయ కాంగ్రెస్ ఐక్యవేదికను ఉన్న అన్ని ప్రజా సంఘాలతో–, కార్మిక సంఘా లు, కర్షక సంఘాలు, యువకుల సంఘాలు, లేదా సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘాలతో కలిపి విశాల సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికను ఏర్పాటు చేయాలి. ఈ వేదికకు మూలం సామ్రాజ్యవాద వ్యతిరేకత, దాని రాజ్యాంగ వ్యతిరేకత కావాలి. ప్రజాసంఘాలు తమ తక్షణ డిమాండ్లను సాధించడానికి సిద్ధం చేయాలి.

"భారతదేశ సంపూర్ణ స్వతంత్రమే అంతిమ లక్ష్యం కావాలి. దీనిని ఏ సశష భిషలు లేకుండా ఆమోదించాలి. అందువలన జాతీయ కాంగ్రెస్, చర్చల సందర్భంలో ఎటువంటి రాజీలు పడుతున్నా, కాస్త కూస్తా ఆమోదాలు తెలుపుతున్నా వ్యతిరేకించవచ్చు. రాజ్యాంగానికి లోబడి పనిచేయడాన్ని వ్యతిరేకించవచ్చు. "పైగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేయవలసిన పోరాటాన్ని దేశ స్వతంత్ర పోరాటం అనే రాజకీయ డిమాండ్‌తో కలిపి పోరాటం చేస్తూ, కార్మికుల కర్షకుల తక్షణ ముఖ్యమైన డిమాండ్లను కూడా వీటికి జతచేయవచ్చు.

"అందువలన, ఉదాహరణకి ఇటువంటి కార్యక్రమంలో

1. భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యంగా సాగుతుంది.

2. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘ నిర్మాణ స్వేచ్ఛ, పత్రికల స్వేచ్ఛ, సమీకరణ స్వేచ్ఛ, సమ్మెలు పికెటింగులు చేసే స్వేచ్ఛ డిమాండ్ చేయాలి.

3. అసాధారణ చట్టాలు, ప్రాతినిధ్య చట్టాలు, ఆర్డినెన్స్‌లు, కార్మిక వ్యతిరేకచట్టాలు (నేర చట్టాల సవరణలు, పత్రికా చట్టం వగైరా.. ) ఉపసంహరించుకోవాలి.

4.రాజకీయ ఖైదీలను, నిర్బంధితులను విడుదల చేయాలి.

5. కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించ కూడదు. జీతాలు తగ్గించకూడదు. కుటుంబానికి సరిపడా కనీసవేతనం, ఎనిమిది గంటల పని ఉండాలి, రైతులు చెల్లించే శిస్తులో 50శాతం కోత వేయాలి, శిస్తు చెల్లించని రైతుల భూములను సామ్రాజ్యవాదుల కప్పాలు చెల్లించడానికో, రాజుల కప్పాల కోసమో, జమీందారుల వడ్డీవ్యాపారుల రుణాల చెల్లింపుల కోసమో బలవంతంగా లాక్కో కూడదు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కార్యక్రమం ఎత్తుగడల గురించి స్పష్టతను ఇవ్వడం అత్యంత కీలకం. అందుకు ప్రతేకమైన శ్రద్ధ పెట్టాలి.

"సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా వేదిక ఏర్పడడానికవసరమైన మార్పులు, జాతీయ కాంగ్రెస్ విధానాలలో పనిలో తీసుకురావ డానికి, ప్రజలకు అవసరమైన ముఖ్యమైన డిమాండ్ల సాధన కోసం, కాంగ్రెస్‌లోని వామపక్ష వాదులు ఐక్యంగా కృషి చేయాలి. కాంగ్రెస్‌లో ఉన్న కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యులు కాంగ్రెస్‌లో తీవ్రవాదులను ఒకచోటికి చేర్చడంలో కీలక పాత్ర పోషించాలి.

"ఈ విధంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజావేదిక మొదటిదశ నిర్మించవచ్చు. ఇది ఇప్పటికే స్థానిక, జిల్లా ప్రాంతాలవారి ఉండి పోరాడుతున్నది.

''సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికకు ముఖ్యమైన సమస్య ఎన్నికలు. ఒక వైపు సామ్రాజ్యవాద వ్యతిరేక వేదిక సంపూర్ణ స్వరాజ్యం కోసం పోరాడాలి. సామ్రాజ్య వాదులకు, దాని విభాగాలకు సహాయనిరాకరణ చేయాలి. ప్రజల తక్షణ డిమాండ్ల కోసం గళమెత్తాలి. ఎన్నికలలో పాల్గొంటున్నా, జాతీయోద్యమంలో పాల్గొంటున్న విస్తార ప్రజానీకం దృష్టి మరల్చకూడదు. ఎన్నికలలో జాతీయ వేదిక చీలిపోకుండా జాగ్రత్తపడాలి. కానీ అటువంటి ప్రయత్నాలు సామ్రాజ్యవాద వ్యతిరేక వామపక్షవాదులను అణచివేయడానికి ఉపయోగించ కుండా చూసుకోవాలి. "ఉద్యమం ఇప్పుడున్నస్థితిలో రాజ్యాంగ శాసన సభ ఏర్పాటు, సర్వజనీన ఓటు హక్కు, ప్రత్యక్ష రహస్య బ్యాలెట్‌లను మన ప్రధాన డిమాండ్ లుగా పెట్ట వచ్చు.

''విశాల ఐక్య వేదిక, శక్తివంతమైన ఫలప్రదమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా వేదిక భారత జాతీయోద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించాలి. దత్ బ్రాడ్లి సిద్ధాంతం కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో సహకరించింది. కమ్యూ నిస్టుల జోక్యంతోనే ఈ కాలంలో ఎంతో మంది కార్య కర్తలు, కొత్త తరం నాయకులూ వచ్చారు. వారే దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించ డానికి అభివృద్ధి చేయడానికి కృషి చేసారు.

**అనువాదం : కె. ఉషారాణి**

❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-04-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# మతానికి ప్రభుత్వంతో సంబంధం ఉండరాదు.



**– లెనిన్**

జనాభాలో అత్యల్పంగా వున్న భూస్వాముల, పెట్టుబడిదారుల వర్గం అపారంగా వున్న శ్రామికవర్గ రాసులను దోపిడీ చేయడంపైనే ప్రస్తుత సమాజం పూర్తిగా ఆధారపడి వున్నది. ఇది బానిస సమాజం. ఎందుకంటే పెట్టుబడిదారుల కోసం ఎవరైతే తమ యావజ్జీవితమూ శ్రమిస్తారో, ఆ 'స్వతంత్ర' శ్రామికులు పెట్టుబడిదారీ బానిసత్వాన్ని సంరక్షించేటందుకూ, శాశ్వతం చేసేటందుకూ లాభాలను ఆర్జించి పెట్టే బానిసల జీవన భృతికి అవసరమైన దానిని మాత్రమే పొందటానికి 'అర్హులు'గా వుంటారు.

శ్రామికులపై సాగే ఆర్థిక పీడన అనివార్యంగా ప్రతి ఒక విధమైన రాజకీయ అణచివేతనూ, సామాజిక అవమానాన్నీ ఉద్భవింపచేస్తుంది. ప్రజారాసుల ఆత్మిక, నైతిక జీవనాన్ని మొద్దుపరచి, అంధకార బంధురం చేస్తుంది. శ్రామికులు, వారి ఆర్థిక విమోచన కొరకు పోరాడేందుకు కొద్దో గొప్పో రాజకీయ స్వేచ్ఛను సాధించుకోవచ్చు. కానీ స్వేచ్ఛ ఎంతవున్నప్పటికీ పెట్టుబడి అధికారాన్ని కుప్పకూల్చనంతవరకూ పేదరికం, నిరుద్యోగం, అణచివేతల నుండి వారికి విముక్తి వుండదు. పరులకోసం వారు అనునిత్యం చేసే శ్రమ కారణంగానూ, లేమిడి, ఏకాకితనం కారణంగానూ క్రుంగిపోయిన ప్రజారాసులపై ప్రతిచోటా అమితమైన భారంగా తయారైనట్టి ఆధ్యాత్మిక పీడన రూపాలలో మతం ఒకటి. ప్రకృతితో సమరంలో ఆటవికుని అశక్తత అతనిలో దేవుళ్లు, దెయ్యాలు, అద్భుతాలు తదితరాలలో విశ్వాసాన్ని పెంచినట్లే దోపిడీదారులకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో దోపిడీకి గురవుతున్న వర్గాల అశక్తత మరణానంతర సుఖమయ జీవితంపట్ల వారిలో అనివార్యంగా విశ్వాసాన్ని పెంచుతుంది. ఇహలోకంలో వున్నప్పుడు అణుకువతోనూ, సహనంతోనూ వుండాలని స్వర్గసౌఖ్యాల ఆశతో వూరడిల్లాలని తమ జీవితమంతా చాకిరీ చేస్తూ లేమిడిలో బతికేవారికి మతం బోధిస్తుంది. అయితే ఎవరైతే యితరుల శ్రమపై పడి బతుకుతున్నారో వారు ఇహలోకంలో ధార్మికతను పాటించాలని మతం చెపుతున్నది. ఆ రకంగా దోపిడీదారులుగా వుండే వారి మొత్తం ఉనికిని చౌకబారు రీతిలో సమర్థిస్తూ స్వర్గంలో కులికేటందుకుగాను సరసమైన ధరలకు టిక్కెట్లను అమ్ముతున్నది. మతం ప్రజలపాలిట నల్లమందు. మతం ఒకరమైన ఆధ్యాత్మిక సారాయి వంటిది. పెట్టుబడికి బానిసలైనవారు వారి మానవ ప్రతిష్టనూ, కాస్తో కూస్తో మానవార్హమనదగిన జీవితం కోసం వారి డిమాండ్‌ను యీ సారాయిలో నిమజ్జనం చేస్తారు.

అయితే ఒక బానిస అతని బానిసత్వాన్ని గుర్తెరిగి, విముక్తి కొరకై పోరాడేందుకు శిరసెత్తుకొని నిలిస్తే ఆసరికే అతను బానిసగా వుండటాన్ని సగపాలు మానుకొన్నట్లు అవుతుంది. భారీ ఫ్యాక్టరీలలో పెరిగిపెద్దవాడై, పట్టణ జీవనంతో పరిణతి చెందిన ఆధునిక వర్గ చైతన్యం కలిగిన కార్మికుడు తమ దురభిమానాలను తృణీకార భావంతో త్రోసిపుచ్చి, స్వర్గరాజ్యాన్ని పూజారులకూ, బూర్జువా మూఢవిశ్వాసాలకూ విడిచిపెట్టి ఇక్కడ యీ లోకంలోనే తన కొరకు మెరుగైన జీవితం కోసం ప్రయత్నిస్తాడు. మతం మంచుతెరలను తొలగించడానికి ఏదైతే శాస్త్ర విజ్ఞానాన్ని తన పక్షాన నిలుపుకొన్నదో, ఇహ లోకంలో ఉత్తమ జీవితం కొరకు వర్తమానంలో పోరాడేందుకు కార్మికులను సంఘటితపరచడం ద్వారా పరలోక జీవిత విశ్వాసాల నుండి ఏదైతే వారికి విముక్తి కల్పించిందో ఆ సోషలిజం పక్షానే నేటి కార్మికులు నిలుస్తారు.

మతాన్ని స్వంత వ్యవహారమని తప్పనిసరిగా ప్రకటించాలి. సాధారణంగా సోషలిస్టులు యీ మాటల్లోనే మతంపట్ల తమ వైఖరిని వ్యక్తం చేస్తుంటారు. అయితే ఎలాంటి పొరపాటు అవగాహననైనా నివారించేటందుకై యీ మాటల అర్థాన్ని కచ్చితమైన రీతిలో నిర్వచించవలసి వుంది. రాజ్యానికి సంబంధించినంతవరకూ మతాన్ని స్వంత వ్యవహారంగా భావించాలని మనం డిమాండ్ చేస్తాము. అయితే మన పార్టీకి సంబంధించినంత వరకూ మతాన్ని స్వంత వ్యవహారంగా ఏ విధంగానూ భావించజాలము. రాజ్యంతో మతానికి ఎంతమాత్రం సంబంధం వుండరాదు. మత సంఘాలకు ప్రభుత్వ అధికార యంత్రాంగంతో ఎంతమాత్రం సంబంధం వుండకూడదు. తన కిష్టమైన ఏ మతాన్నైనా అవలంబించేటందుకు లేదా ఏ మతాన్నీ అవలంబించకుండా వుండేదుకు అంటే ప్రతి సోషలిస్టు విధిగా వున్నట్లుగానే నాస్తికునిగా వుండేందుకూ ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా సంపూర్ణ స్వేచ్ఛ వుండాలి.

(లెనిన్ రచించిన సోషలిజం – మతం అన్న వ్యాసంలోని కొన్ని భాగాలు)

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.11. Published on April 1, 2020